

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 23-3-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 354 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: నవమి తె.5.38 తదుపరి దశమి, నక్షత్రం: పూర్వాషాడ తె.4.18 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: మ.1.21-3.00; అమృతఘడియలు: రా.11.19-12.58; దుర్ముహూర్తం: సా.4.46-5.34; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.20; సూర్యాస్తమయం: 6.23 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



చెన్నైలో జరిగిన జేఏసీ సమావేశంలో సీఎంలు స్టాలిన్, రేవంత్‌రెడ్డి, విజయన్, భగవంత్ మాన్, కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్, మహేశ్‌గౌడ్ తదితరులు



రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న స్టాలిన్

పాతికేళ్లు వాయిదా వేయాలి

ప్రస్తుత లోక్‌సభ సీట్లను యథాతథంగా ఉంచాలి.. పునర్విభజన న్యాయసమ్మతంగా జరగాలి

దక్షిణాది రాష్ట్రాలను శిక్షించేలా ఉండకూడదు

బాధిత రాష్ట్రాల పార్టీలతో అఖిలపక్షం జరపాలి

ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి

చెన్నైలో సమావేశమైన జేఏసీ తీర్మానంలో డిమాండ్

స్టాలిన్ పిలుపునకు భారీ స్పందన

3 రాష్ట్రాల సీఎంలు, పలు పార్టీల నేతల హాజరు

రాజకీయ, న్యాయ కార్యాచరణకు నిపుణుల కమిటీ

పునర్విభజన వ్యతిరేక పార్టీల ఎంపీలతో కోర్ కమిటీ

తదుపరి భేటీ హైదరాబాద్‌లో జరపాలని నిర్ణయం

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను 25 ఏళ్లపాటు వాయిదా వేయాలని, ప్రస్తుతమున్న లోక్‌సభ స్థానాలను యథాతథంగా కొనసాగించాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్లమెంట్‌లో ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని జేఏసీ సమావేశం తీర్మానించింది. ఈ ప్రక్రియ దక్షిణాదిని శిక్షించేలా ఉండకూడదని, న్యాయసమ్మతంగా పునర్విభజన జరగాలని స్పష్టం చేసింది. పునర్విభజనతో నష్టపోతామని ఆందోళన చెందుతున్న రాష్ట్రాలకు చెందిన పార్టీలను ఆహ్వానించి అఖిలపక్ష సమావేశం జరపాలని కేంద్రాన్ని కోరింది. కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ పోరాటం చేస్తూనే.. న్యాయపరమైన కార్యాచరణ దిశగా పని చేసేందుకు నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలన్న స్టాలిన్ ప్రతిపాదనను

మిగతా 14వ పేజీలో...

జీడీపీకి మన వాటా 36%

జనాభాను నియంత్రించాం

అయినా శిక్షిస్తున్నారు: కేటీఆర్

బీజేపీపై విషం కక్కడమే

వారి అజెండా: కిషన్‌రెడ్డి

స్టాలిన్ నిర్వహించింది

దొంగల ముఠా భేటీ

లిక్కర్ దందాల్లో దొరికినోళ్లే

పాల్గొన్నారు: బండి సంజయ్

13

రాజకీయ గళం కోల్పోతాం

ఉత్తరాది ముందు ద్వితీయ శ్రేణి పౌరులమైతాం

అడ్డుకోడానికి దక్షిణాది ఐక్య పోరాటం చేయాలి

మరో పాతికేళ్లు సీట్లు పెంచొద్దు

ఉన్న సీట్లతోనే పునర్విభజన.. రాష్ట్రమే యూనిట్

అక్కడి జనాభా ఆధారంగా సీట్ల హద్దులు

50% పెంచితే మాకు 33% సీట్లు ఇవ్వాల్సిందే

వాటిని దక్షిణాదికి ప్రొ రేటా ప్రకారం పంచవచ్చు

జనాభా ఆధారంగా పునర్విభజనకు వ్యతిరేకం

జేఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వాటీజ్ దిస్ జస్టిస్!?

డిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు బయటపడ్డాయని వెలువడ్డ వార్త న్యాయ వ్యవస్థను ఉలికిపాటుకు గురిచేసింది. మిగతా వ్యవస్థల వలే న్యాయ వ్యవస్థలో కూడా అవినీతి చోటుచేసుకుంటోందన్న విమర్శలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే, న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కారణంగా న్యాయమూర్తుల అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడలేని పరిస్థితి ఉంది.



కొత్త పలుకు

న్యాయ వ్యవస్థలో అవినీతి అనేది బహిరంగ రహస్యంగా మారిన ఈ రోజుల్లో న్యాయమూర్తులకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను కొనసాగించవలసిందేనా? ఇప్పటికే న్యాయమూర్తుల నియామకం ప్రక్రియ చర్చనీయాంశం అయింది. ఉన్నత న్యాయ స్థానాలతోపాటు సర్వోన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులను నియమించే అధికారం కొలీజియం వద్ద ఉండటం వాంఛనీయం కాదన్న వాదన నడుస్తోంది.

డబ్బు కట్టలు లభించిన విషయం నిజమా? కాదా? అని నిర్ధారించుకోవడానికి వారం రోజులు చాలవా? ఇంకెంత కాలం కావాలి? వారం రోజులుగా ఈ వ్యవహారం గుప్పుమంటున్నా నోరు విప్పని ఢిల్లీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఇప్పుడు 'అబ్బే, అలాంటిదేమీ లేదు' అని ప్రకటించడమేమిటి? మళ్లీ మర్నాడే తాను అలా అనలేదని మాట మార్చడమేమిటి? దేశవ్యాప్తంగా రాజకీయ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఈడీ ఈ వ్యవహారంలో మౌనంగా ఎందుకుందో తెలియదు.

4

ఇటీవలి కాలంలో మన న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించడం లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. దేశంలో బలమైన నాయకత్వం ఉన్నప్పుడల్లా న్యాయ వ్యవస్థ సాగిలపడిన సందర్భాలు ఉన్నాయి.

న్యాయ వ్యవస్థ స్వచ్ఛంగా ఉండాలని కోరుకొనే హక్కు ఈ దేశ పౌరులకు ఉంది. తనకు సంబంధించి వచ్చిన ఆరోపణలు అవాస్తవమని సదరు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అయినా ప్రకటించాలి లేదా విచారణను త్వరగా ముగించి వాస్తవం ఏమిటో ప్రజలకు చెప్పాలి.

న్యాయమూర్తులు కూడా ఈ సమాజం నుంచే వస్తారు. వారు ఆకాశం నుంచి ఊడిపడరు. సమాజంలో ఉన్న బలహీనతలు వారిలో కొందరికి ఉండవచ్చు కూడా. అంచేత తప్పు జరిగి ఉంటే.. తప్పు జరిగిందని సర్వోన్నత న్యాయస్థానమైనా స్పష్టం చేస్తే ప్రజలకు కొంతలో కొంతైనా ఉపశమనం లభిస్తుంది. అలా కాకుండా ఇది తమ అంతర్గత వ్యవహారమని, తామే చూసుకుంటామని ఏ స్థాయిలోనైనా భావిస్తే అది న్యాయ వ్యవస్థకు కీడు చేసినట్టే అవుతుంది.

జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నిజంగా డబ్బు లభించి ఉంటే ఆయనకు ఏ శిక్ష విధిస్తారోనని కూడా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

10,954 రెవెన్యూ శాఖలో కొత్త పోస్టులు

గ్రామ పాలనాధికారులుగా పేరు

దాదాపు 6 వేల పోస్టుల్లో వీఆర్వో, వీఆర్ఏలకు అవకాశం

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిన మిగిలిన పోస్టుల భర్తీ

హైదరాబాద్, మార్చి22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో గ్రామ స్థాయిలోని పాత పరిపాలనా వ్యవస్థను పటిష్ఠం చేయడానికి మార్గం సుగమమైంది. ప్రజలకు అందుబాటులో ఉండి, భూవ్యవహారాలను చూసిన గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వో), గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏ)లో కొంత మందిని మళ్లీ రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థలో 10,954 కొత్త పోస్టులను సృష్టించింది. ఈ పోస్టులకు 'గ్రామ పాలనాధికారులుగా(జీపీఓ) నామకరణం చేసింది. ఈ పోస్టులను

మిగతా 3వ పేజీలో...



ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో కేసీఆర్

తెలంగాణ సంపదపై గుంటనక్కల్లా కన్నేశారు

మంచిగ పాలన చేయాలంటే చంద్రబాబు రావాలట

ఏపీలో కూటమి లేకుంటే చంద్రబాబు గెలిచేవాడా!?

నన్ను ఓడించి ఇప్పుడు 'కేసీఆర్ అన్నా' అంటే ఎలా!?

కత్తి ఒకరికిచ్చి నన్ను యుద్ధం చేయమంటే ఎట్లా!?

పాలకుడిని ఎన్నుకునేటప్పుడే ఆలోచించాలి

ఆవేదనతోనే సన్నాసులు, దద్దమ్మలు అన్నా

ఎవరిపైనా నాకు వ్యక్తిగత కోపం లేదు: కేసీఆర్

12

బీజేపీకి 8 మంది, కాంగ్రెస్‌కు 8 మంది ఎంపీలను ఇచ్చారు. వాళ్లు ఒక్క ఏకాణా అయినా తెచ్చారా? పార్లమెంటులో బీఆర్‌ఎస్ ఎంపీలుంటే రాష్ట్ర హక్కులను కాపాడుకునేవారు. ఈ నేలపై ఎవరూ శాశ్వతం కాదు. కేసీఆర్ ఎప్పటికీ ఉండడు. అందరూ ఒక్కొక్క కేసీఆర్‌లా తయారై తెలంగాణను కాపాడుకోవాలి.

\- కేసీఆర్

జస్టిస్ వర్మపై విచారణ

ఆదేశాలు జారీ చేసిన సీజేఐ ఖన్నా.. సమగ్ర విచారణకు త్రిసభ్య కమిటీ

కమిటీలో పంజాబ్, హిమాచల్ సీజేలు, కర్ణాటక న్యాయమూర్తి

సీజేఐ నిర్ణయానికి వీడియో క్లిప్పింగే కారణం!.. వర్మపై వదంతుల వ్యాప్తి: సుప్రీం

2018లోనే వర్మపై ఆర్థిక నేరం కేసు.. రుణం 97.85 కోట్ల దుర్వినియోగం

జస్టిస్ వర్మ ఇంట్లో డబ్బు కట్టలు దొరకలేదని నేను చెప్పలేదు: ఢిల్లీ ఫైర్ డీజీ

న్యూఢిల్లీ, మార్చి 22: అగ్నిప్రమాదంతో వెలుగులోకి వచ్చిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల ఉదంతంపై భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా విచారణకు ఆదేశించారు. ఢిల్లీ హైకోర్టు సీజే జస్టిస్ డీకే ఉపాధ్యాయ్ శుక్రవారం ఇచ్చిన అంతర్గత విచారణ నివేదిక మేరకు.. శనివారం త్రిసభ్య కమిటీని నియమించారు. సమగ్ర విచారణ జరపనున్న ఈ కమిటీలో పంజాబ్-హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ శీల్‌నాగు, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జీఎస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు ప్రధాన



న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ ఉన్నారు. వర్మ అంశంపై సుప్రీంకోర్టు ఓ ప్రకటనను విడుదల చేస్తూ.. "జస్టిస్ యశ్వంత్ వర్మపై తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందుతున్నాయి" అని పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు సీజే ఇచ్చిన నివేదిక, జస్టిస్ వర్మ వివరణను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపింది. కాగా.. ఈ ఉదంతం వెలుగులోకి రాగానే సీజేఐ కొలీజియం భేటీని ఏర్పాటు చేయడానికి ఓ వీడియో క్లిప్పింగ్ ప్రధాన కారణం అని తెలుస్తోంది. ఈనెల 14న వర్మ ఇంట్లో అగ్నిప్రమాదం

మిగతా 14వ పేజీలో...



వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్

'దీవార్ మే ఏక్ ఖిడ్కీ థీ' నవలకు..

ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి సాహితీ వేత్త

జ్యూరీలో సభ్యుడిగా ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు

14

తాత్కాలిక వలస వీసాపై ట్రంప్ కొరడా

అమెరికాలో ఉంటున్న 5,32,000 మందిపై ప్రభావం

వీరిలో అత్యధికులు క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనిజులా దేశస్థులే

ఆర్టీసీ బస్సు ఢీకొని అడిషనల్ ఎస్పీ దుర్మరణం

» మార్నింగ్ వాక్‌కు వెళ్లొస్తూ రోడ్డు దాటుతుండగా ప్రమాదం


నందీశ్వరబాబ్జీ (ఫైల్)

హయత్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మార్నింగ్ వాక్‌కు వెళ్లొస్తూ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అడిషనల్ ఎస్పీ టీఎం నందీశ్వర బాబ్జీ(50) దుర్మరణం చెందారు. 1995 బ్యాచ్ ఎస్సైగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేసిన బాబ్జీ నాలుగు రోజుల క్రితమే అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. నందీశ్వర బాబ్జీ తన భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు రాకేష్ శరత్ ప్రీతంతో కలిసి హయత్‌నగర్ ప్రాంతంలోని లక్ష్మారెడ్డిపాలెంలో నివాసముంటున్నారు. నందీశ్వర బాబ్జీ ఎప్పట్లాగే శనివారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల ప్రాంతంలో మార్నింగ్ వాక్ కోసం సమీపంలోని జాతీయ రహదారి వద్దకు వెళ్లారు. వ్యాయామం ముగించుకుని ఇంటికి తిరిగొస్తూ తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో రోడ్డు దాటేందుకు యత్నించారు. బాబ్జీ రహదారి మధ్యలో ఉన్న గ్రిల్‌ను దాటగానే విజయవాడ వైపు నుంచి నగరంలోకి వేగంగా వస్తున్న ఓ ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ఆయన్ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాబ్జీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లిలో బర్డ్‌ఫ్లూ

» రెండు లక్షల కోళ్ల ఖననానికి చర్యలు.. 6కోట్ల మేర నష్టం

చిట్యాల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకడంతో పశు సంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పౌల్ట్రీఫామ్‌లోని రెండు లక్షల కోళ్ల ఖననానికి చర్యలు చేపట్టారు. గుండ్రాంపల్లి గ్రామశివారుల్లో 15 ఏళ్లుగా వీఎస్‌కే పౌల్ట్రీఫామ్ నిర్వహిస్తున్న వంగోటి బాలకృష్ణారెడ్డి.. ఈ నెల 17న సుమారు వెయ్యి కోళ్లు మృతి చెందడంతో పశు సంవర్ధకశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వీఎస్‌కే పౌల్ట్రీఫామ్ వైద్యులు, ప్రత్యేక బృందాలతో పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ ఈ నెల 18న పౌల్ట్రీఫామ్‌ను తనిఖీ చేశారు. షెడ్లు, కోళ్లను పరిశీలించారు. ఈ పౌల్ట్రీఫామ్‌లో మరణించిన కోళ్ల కళేబరాల నమూనాలను పరీక్షించిన హైదరాబాద్, భోపాల్ ల్యాబ్‌లు బర్డ్‌ఫ్లూ వల్లే అవి మరణించాయని ఈ నెల 19న నివేదిక ఇచ్చాయి. దీంతో రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది ఈ నెల 20న వీఎస్‌కే పౌల్ట్రీఫామ్‌కు చేరుకున్నారు. పీపీఈ కిట్లు ధరించి ప్రత్యేక వాహనాల్లో కోళ్లఫామ్‌లోకి వెళ్లి శనివారం సాయంత్రం వరకూ 1.14 లక్షల కోళ్లకు మత్తుమందు ఇచ్చి చంపేశారు. ఎక్స్‌కవేటర్‌తో కోళ్ల ఫామ్ మధ్య గల స్థలంలో పది అడుగుల లోతు గుంతలు తవ్వించి కోళ్ల కళేబరాలు, గుడ్లు పూడ్చి పెట్టారు. మొత్తంగా యజమానికి రూ.6 కోట్ల నష్టం వాటిల్లనున్నట్లు సమాచారం.

జీవో 317 బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి: జేఏసీ

పంజాగుట్ట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం తెచ్చిన చీకటి జీవో 317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను వెంటనే వారి సొంత జిల్లాలు, జోన్‌లకు కేటాయించి న్యాయం చేయాలని జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఛైర్మన్ టి.విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ సెక్రెటరీ జనరల్ నాగేశ్వరరావు, కార్యదర్శి పి.సందీప్, కోశాధికారి ఎం.వినోద, చాముండేశ్వరిలతో కలిసి స్థానికత పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 24న తలపెట్టిన చలో హైదరాబాద్ పోస్టరును ఆయన ఆవిష్కరించారు. అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14లోపు తమ స్థానికతను పునరుద్ధరించకపోతే ఏప్రిల్ 24న వేలాదిమందితో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

బీరు సీసాతో కొట్టి బాలికను చంపి.. రోడ్డెక్కి వాహనాలు, దుకాణాలపై రాళ్లు రువ్వి..

» మతిస్థిమితం లేని ఓ వ్యక్తి బీభత్సం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకనో.. మద్యం మత్తు వల్లో స్పష్టత లేదు కానీ.. విచక్షణ కోల్పోయి ఓ వ్యక్తి మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ ప్రాంతంలో శనివారం బీభత్సం సృష్టించాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన జగేశ్వర్ తన భార్య, కుమార్తె రియాకుమారి(6)తో కలిసి పోచారం మునిసిపాలిటీ, లేబర్ క్యాంప్‌లో నివాసముంటూ ఇన్ఫోసిస్‌లో భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. పశ్చిమ బెంగాల్, పర్బతిపూర్‌కు చెందిన హప్నహెమ్ బ్రూమ్(30) అనే యువకుడు శుక్రవారం అక్కడే పనిలో చేరాడు. ఏం జరిగిందో తెలియదు కానీ శనివారం మధ్యాహ్నం లేబర్ క్యాంప్‌లో ఓ పక్కన ఆడుకుంటున్న రియాకుమారి తలపై హప్న బీరు సీసాతో కొట్టి పరుగు తీశాడు. గమనించిన తల్లిదండ్రులు రియాను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బాలిక మరణించింది. మరోపక్క, జోడిమెట్ల వద్ద వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపైకి వచ్చిన హప్న.. అటుగా వస్తున్న వాహనాలపై రాళ్లు విసిరుతూ పరుగులు తీశాడు. దాడిలో రెండు కార్ల అద్దాలు, ఒక ఆటో ధ్వంసం కాగా పలువురికి గాయాలయ్యాయి. అలాగే, ఓ టైల్స్ దుకాణంపై రాళ్లు రువ్వి.. టైల్స్ అన్నింటిని ధ్వంసం చేశాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు హప్నను అదుపులోకి తీసుకున్నారు.

వాట్సా‌ప్‌లో ప్రశ్నపత్రంపై విచారణ

ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేసిన నల్లగొండ కలెక్టర్.. విధుల నుంచి పరీక్ష కేంద్రం సీఎస్, డీవో తొలగింపు

» ఫొటో తీసిన వారి ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వాట్సాప్ గ్రూపుల్లో పదో తరగతి ప్రశ్నపత్రం బయటకు వచ్చిన ఘటనపై నల్లగొండ జిల్లా అధికారులు విచారణ ముమ్మరం చేశారు. ఓ ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేయగా, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు డిపార్ట్‌మెంటల్ అధికారి(డీవో)ని విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన తొలి రోజు తెలుగు ప్రశ్నపత్రం వాట్సాప్ గ్రూపుల్లోకి రావడంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి విచారణకు ఆదేశించారు. ఘటనకు సంబంధించి ప్రాథమికంగా నకిరేకల్ ఎస్సీ గురుకుల పరీక్షా కేంద్రంలో విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్ సుధారాణిని సస్పెండ్ చేశారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్, డిపార్ట్‌మెంటల్ అధికారి రామ్మోహన్‌రెడ్డిని ఆయా విధుల నుంచి తొలగించారు. ఒకవైపు ఈ ఘటనపై నకిరేకల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా.. మరోవైపు రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సైతం విచారణ చేపట్టారు. ప్రశ్నపత్రాన్ని ఫొటో తీసిన వ్యక్తి పరీక్ష కేంద్రంలో విధుల్లో ఉన్నవారా? లేక బయట నుంచి వచ్చిన వారా? ఎవరి కోసం ఈ ఫొటో తీశారు? అనే అంశంపై ఆరా తీస్తున్నారు. ప్రశ్నపత్రం ఏయే ప్రాంతాల్లోని వాట్సాప్ గ్రూపుల్లోకి చేరిందనే సమాచారం సేకరిస్తున్నారు. విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని డీఈవో భిక్షపతి తెలిపారు.

బస్సు చక్రాల కిందపడి విద్యార్థిని మృతి

పదో తరగతి పరీక్ష రాసి ఇంటికొస్తున్న విద్యార్థినిని బస్సు రూపంలో మృత్యువు కబళించింది. గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న ఒడిశా వాసి బెనుధర్ కుమార్తె ప్రభాతి(19) స్థానికంగా విజయభారతి స్కూల్‌లో పదోతరగతి, కుమారుడు సుమంత్ డిప్లొమా చదువుతున్నారు. రాయదుర్గం జడ్పీహెచ్ఎస్ కేంద్రంలో పరీక్ష రాసిన ప్రభాతిని ఆమె సోదరుడు సుమంత్ బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి బయల్దేరారు. గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై వీరి బైక్‌ను డబుల్‌డెక్కర్ బస్సు వెనుక నుంచి ఢీ కొట్టడంతో అన్న, చెల్లి ఇద్దరు కిందపడిపోయారు. ఈ క్రమంలో ప్రభాతి పైనుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమంత్‌కు గాయాలయ్యాయి. రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వాటర్ క్యాన్లు తీసుకువెళ్లే ఆటో ఢీ కొట్టడం వల్లే వారు కింద పడ్డారని బస్సు డ్రైవర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థికి రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలు కాగా, ఆ గాయాలతోనే పరీక్షకు హాజరయ్యాడు. ఖమ్మం నగర పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌కు చెందిన షేక్ అసన్.. తన తండ్రితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనపై తండ్రి జానీమియా తలకు గాయాలు కాగా, అసన్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమయం మించిపోతుండడంతో ఎలాగోలా పరీక్షా కేంద్రానికి చేరుకున్న అసన్.. పరీక్ష రాస్తుండగా వాంతులు చేసుకున్నాడు. అక్కడి సిబ్బంది సమాచారం మేరకు 108లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేశాక, మళ్లీ అతడు పరీక్ష రాశాడు. కాగా, వికారాబాద్ జిల్లా దోమ మండలం ఊటుపల్లికి చెందిన విద్యార్థిని రిషిక.. పరిగిలోని జడ్పీ ఉన్నత పాఠశాల-2లో హిందీ పరీక్ష రాస్తూ.. ఉన్నట్టుండి కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే ఆ విద్యార్థినిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. విద్యార్థిని కాసేపటికి కోలుకోవడంతో తిరిగి కేంద్రానికి తీసుకురాగా.. పరీక్ష రాసింది. రక్తం పంచుకొని పుట్టిన చెల్లి మరణించినా.. ఆ దుఃఖాన్ని దిగమింగుకొని ఓ విద్యార్థి పరీక్ష రాశాడు. నిజామాబాద్‌లోని ఆదర్శనగర్‌కు చెందిన సాయిలు, వినోద దంపతులకు పల్లవి(12), లక్ష్మిగణసాయి ఇద్దరు పిల్లలు. పల్లవి కొంత కాలంగా లుకేమియాతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. ఒకవైపు చెల్లి మృతి చెంది నా.. ఆ దుఃఖాన్ని దిగమింగుకొని గణసాయి పరీక్ష రాసిన ఘటన పలువురిని కంటతడి పెట్టించింది.


బస్సు ప్రమాదంలో మృతి చెందిన ప్రభాతి(ఫైల్)

రబ్బర్ స్టాంప్ అధ్యక్షుడు వద్దు

» తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి నియామకంపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

» సీఎంతో కొత్త అధ్యక్షుడు రహస్య మంతనాలు చేయొద్దని హితవు

» అధ్యక్ష పదవి రేసులో లేనన్న కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్/ అఫ్జల్‌గంజ్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి నియామకంపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎమ్మెల్యే టీ రాజాసింగ్ శనివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడిని రాష్ట్ర కమిటీ నిర్ణయిస్తే రబ్బర్ స్టాంప్‌గానే మిగిలిపోతాడని ఆరోపించారు. ఒకవేళ కేంద్ర కమిటీ నిర్ణయిస్తే, బీజేపీకి తెలంగాణలో మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. దీని సంగతి బీజేపీ అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. గతంలో బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షులుగా పనిచేసిన వారు గ్రూపు రాజకీయాలతో పార్టీకి తీవ్రనష్టం చేశారని ఆరోపించారు. తెలంగాణ బీజేపీశాఖకు వచ్చే కొత్త అధ్యక్షుడు.. రాష్ట్ర సీఎంతో రహస్య మంతనాలు జరుపుతూ బ్యాక్‌డోర్ రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఇప్పుడు వచ్చే బీజేపీ అంటే హిందూత్వ పార్టీ అని, ధర్మం కోసం పని చేసే కార్యకర్తలను బీజేపీ తెలంగాణశాఖ నూతన అధ్యక్షుడు గుర్తించి, వారికి సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేరు ప్రఖ్యాతులు ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు నేతల చేతులు కట్టి పడేస్తున్నారన్నారు. గతంలో బీజేపీని నమ్ముకున్న సీనియర్ నాయకులు, కార్యకర్తలను పక్కనబెట్టారని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ముందు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా తన మాట వినకపోతే ప్రజల ముందు పెడుతున్నానని రాజాసింగ్ చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు చెప్పాలే గానీ, మీడియా ముందుకు ఎందుకు వెళుతున్నారని తనపై అవాకులు చెవాకులు పేలుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టులు ఉన్నా ఉద్దేశపూర్వకంగానే ఎవరికీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, తాను అధ్యక్ష పదవి రేసులో లేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం తనకు కేంద్రమంత్రి పదవి బాధ్యత అప్పగించిందన్నారు. పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తనకు ముఖ్యం అని చెప్పారు. క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీ హై కమాండ్ నిర్ణయమే శిరోధార్యం అని స్పష్టం చేశారు. ఇప్పటికే బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడి నియామకంపై రెండు, మూడు సార్లు అభిప్రాయ సేకరణ జరిపినా, పార్టీ అధ్యక్షుడిగా తనను బాధ్యతల నుంచి ఎప్పుడు తప్పిస్తారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎదురుచూస్తున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై అసాధారణ జాప్యంతో పార్టీ శ్రేణుల్లో నిరాశా నిస్పృహలు నెలకొన్నాయి.

ఈదురుగాలులు, వడగళ్లు

పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం

» నేడు, రేపు అక్కడక్కడా వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో ఓవైపు ఎండలు మండుతుంటే.. కొన్ని జిల్లాల్లో మబ్బు పట్టి వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి పలు జిల్లాల్లో జోరు వాన కురిసింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 278 మండలాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. కొన్నిచోట్ల భారీ వర్షాలు పడ్డాయి. అత్యధికంగా జగిత్యాల జిల్లా పెగడపల్లిలో 5.2 సెం.మీ., మంచిర్యాలలో 4.7, పెద్దపల్లి జిల్లా ధర్మారంలో 4.6, కరీంనగర్ జిల్లా గంగాధరలో 4.2, మెదక్ జిల్లా శంకరంపేట్-ఆర్‌లో 4, మేడ్చల్ జిల్లా కీసరలో 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వాంకిడి, కెరమెరి, జైనూరు మండలాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్-7లో వడగండ్లతో ఓ కోళ్ల ఫాంలోని 300 కడక్‌నాథ్ కోళ్లు మృతి చెందాయి. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వడగళ్లు పడ్డాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు నవాబ్‌పేట మండలంలో మోస్తరు వర్షం కురిసింది. నల్లగొండతో పాటు దేవరకొండ, కొండమల్లేపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షాలు, వడగళ్లతో అనేక ప్రాంతాల్లో పంటలు దెబ్బతినడంతో పాటు మామిడి కాయలు రాలిపోయాయి. ఆది, సోమవారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

హైదరాబాద్‌లో కుండపోత..

హైదరాబాద్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత కుండపోత కురిసింది. శేరిలింగంపల్లిలో అత్యధికంగా 5.4 సెం.మీ వర్షపాతం నమోదైంది. కూకట్‌పల్లి అల్లాపూర్ వివేకానందనగర్‌లో 5, మాదాపూర్‌లో 4.8, బోరబండలో 4.8 సెం.మీ వర్షం పడింది. యూసఫ్‌గూడ, శేరిలింగంపల్లి, బోరబండ, రాజేంద్రనగర్, కాప్రా తదితర ప్రాంతాల్లో వడగళ్లు కురిశాయి. ఈదురుగాలులతో చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతో అనేక ప్రాంతాల్లో గంటల కొద్దీ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి.. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో శుక్రవారం రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.


కుమరం భీం జిల్లా కెరమెరిలో కురిసిన వడగళ్లు


కరీంనగర్ జిల్లా నగునూర్‌లో నేలవాలిన మొక్కజొన్న పంట

ఎండదెబ్బకు ఉపాధి కూలీ మృతి

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో శనివారం ఎండ మండిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో అత్యధికంగా 39.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉపాధి హామీ పనులు చేస్తున్న ఓ కూలీ అస్వస్థతకు గురై పని స్థలంలోనే మృతి చెందాడు. సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం ఎనగల్ గ్రామానికి చెందిన పసుల లచ్చయ్య(60) శనివారం గ్రామంలో రోడ్డు పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం విరామ సమయంలో భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు.

లోకం తీరు



'ఎస్ఎల్‌బీసీ టన్నెల్'పై రేపు సీఎం సమీక్ష

» సహాయక చర్యల కోసం రూ.5 కోట్లు విడుదల

» ప్రమాదం జరిగి నెల.. లభించని కార్మికుల ఆచూకీ

హైదరాబాద్/నాగర్‌కర్నూల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో సహాయక చర్యల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించనున్నారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగే సమీక్షకు జాతీయ విపత్తు స్పందన దళాలతోపాటు ఆర్మీ కీలక అధికారులు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఎన్‌జీఆర్ఐ, సింగరేణితోపాటు పలు శాఖల అధికారులు హాజరు కానున్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సరిగ్గా నెల క్రితం (గత నెల 22న) ప్రమాదం జరిగి.. 8 మంది చిక్కుకుపోయిన విషయం విదితమే. అప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతుండగా.. గురుప్రీత్‌సింగ్(పంజాబ్) మృతదేహాన్ని మాత్రమే గుర్తించారు. ఇప్పటికీ మనోజ్‌కుమార్(యూపీ), సందీప్ సాహు, జగ్తా జెస్, కీశ్వర్ సాహు, సంతోష్ సాహు, అనుజ్ సాహు(జార్ఖండ్), సన్నీసింగ్(జమ్మూకశ్మీర్) ఆచూకీ లభించలేదు. రెవెన్యూ(విపత్తుల యాజమాన్యం) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ నెల రోజులుగా టన్నెల్ వద్దే ఉండి సహాయక చర్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. అయితే, సోమవారం నిర్వహించనున్న సమీక్షలో సహాయక చర్యలను మరింత ముమ్మరం చేసేందుకు సీఎం దిశానిర్దేశనం చేయనున్నారు. మరోవైపు సహాయక చర్యల కోసం రూ.5 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ శనివారం జీవో జారీ చేశారు. కాగా, ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రతికూల పరిస్థితుల కారణంగా సహాయక చర్యలకు విఘాతం కలుగుతోంది.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య


పాల్తి జీవుల (ఫైల్)

కౌడిపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీళ్ల లేక ఎండిపోతున్న వరి పొలాన్ని ఎలాగైనా కాపాడుకోవాలన్న తపనతో ఆ రైతన్న చేసిన ప్రయత్నం ఫలించలేదు. నీళ్ల కోసం అప్పు చేసి బోర్లు వేసినా ప్రయోజనం కలగలేదు. అప్పులుకావడంతో తీర్చే దారిలేక ఆ రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధి కుషాన్‌గడ్డతండాలో జరిగింది. మృతుడి కుటుంబీకుల వివరాల ప్రకారం పాల్తి జీవుల(50)కు మూడెకరాల వరి పొలం ఉంది. నీళ్లలేక ఎండిపోతుండడంతో నెల రోజుల క్రితం అప్పు చేసి మూడు బోర్లు వేసినా ఫలితం దక్కలేదు. రూ.5లక్షల వరకు అప్పులు ఉండడంతో తీర్చే మార్గంలేక మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోంచి బయటికెళ్లిన జీవుల తిరిగిరాలేదు. శనివారం వెతుకుతుండగా రాజీపేట శివారులోని అటవీ ప్రాంతంలో ఉరేసుకుని కనిపించాడు.


రాజన్న ఆలయ కళాభవన్‌పై కురులను ఆరబెడుతున్న సిబ్బంది (ఫైల్)

తలనీలాల నిల్వలతో 'రాజన్న'కు శిరోభారం

- మూడుసార్లు టెండర్లు.. ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ముగియనున్న టెండర్ రూ.19 కోట్లు

సిరిసిల్ల, మార్చి22(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్నకు తలనీలాలు శిరోభారంగా మారాయి. 2025-27 సంవత్సరానికి సంబంధించిన తలనీలాల సేకరణకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో శుక్రవారం నాలుగోసారి వాయిదా పడింది. ఏప్రిల్ 2న మళ్లీ టెండర్లు పిలుస్తామని ఈవో వినోద్‌రెడ్డి చెప్పారు. గత కాంట్రాక్టర్ రూ.19 కోట్లకు టెండర్ దక్కించుకున్నా కనీసం టెండర్ ఆదాయం రాదనే కారణంగా చేతులెత్తేసి దేవాలయానికి బకాయిపడ్డారు. 31 మార్చి 2024 వరకు కేవలం రూ. 9 కోట్లు మాత్రమే కట్టి వదిలేయగా, 2025 సంవత్సరం వరకు రూ.10 కోట్లు కట్టాల్సి ఉంది. రూ.79 లక్షల విలువగల 6 చెక్కులను కాంట్రాక్టర్ ఆలయాధికారులకు అందజేశాడు. అనుకున్న సమయానికి కాంట్రాక్టర్ డబ్బులు చెల్లించకపోవడంతో చెక్కులను బ్యాంకులో జమచేయగా ఖాతాలో డబ్బులు లేవని తేలింది. దీంతో ఆలయాధికారులు చెక్‌బౌన్స్ కేసులు వేశారు. ఆ తరువాత అధికారుల పర్యవేక్షణలోనే తలనీలాలు ఆరబెట్టడం, వాటిని భద్రపర్చడం, సమస్యగా మారింది. గోదాముల్లో తలనీలాలు పేరుకుపోవడంతో ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సదరు కాంట్రాక్టర్ రూ 2.5 కోట్లు చెల్లించడంతో రూ.5 కోట్లు విలువల చేసే తలనీలాలను అప్పగించారు. కాంట్రాక్టర్ బకాయి ఉండడం, చెక్ బౌన్స్ కేసు నడుస్తున్నప్పటికి మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు తలనీలాలు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది.

యూట్యూబర్ సన్నీయాదవ్‌పై లుక్ ఔట్ నోటీసు

సూర్యాపేట క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకు చెందిన బైక్ రైడర్, యూట్యూబర్ బయ్యా సన్నీయాదవ్‌పై లుక్ ఔట్ నోటీసు జారీ అయింది. శనివారం ఇందుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ రవి విలేకరులకు తెలిపారు. సన్నీయాదవ్ బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తున్నాడని ఈ నెల 5న సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండల పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. దీంతో అప్పటి నుంచి అతడు పరారీలో ఉన్నాడు. దర్యాప్తులో సన్నీయాదవ్ విదేశాల్లో ఉన్నట్లు తెలిసింది. అతడిని అరెస్ట్ చేసేందుకు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సీఐడీ విభాగానికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఇమ్మిగ్రేషన్ అధికారులకు లుక్ ఔట్ నోటీస్ జారీ చేశారు. సన్నీయాదవ్ వాఘా సరిహద్దు మీదుగా పాకిస్తాన్‌లోకి వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు సన్నీయాదవ్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించాడు.

నేడు దేవాదుల మోటార్ ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు

వరంగల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గోదావరి జలాలను రైతులకు అందించేందుకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. దేవాదుల ఫేస్-3లో భాగంగా నిర్మించిన హనుమకొండ జిల్లా దేవన్నపేట పంప్‌హౌస్‌లో మూడు 31మెగావాట్ల మోటర్లున్నాయి. వీటిలో ఒక్క మోటర్‌ను రన్ చేసిన రోజుకు 584క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేయొచ్చు. దేవాదులకు నీటిని అందించేందుకు గోదావరిపై నిర్మించిన సమ్మక్క బ్యారేజీలో డెడ్ స్టోరేజీ 0.58టీఎంసీలు పోగా, 1.83టీఎంసీల నీటిని లిఫ్టు చేసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ లక్ష్యంతోనే ఈ నెల 18వ తేదీన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దేవన్నపేట పంప్‌హౌస్‌లో మోటర్‌ను రన్ చేసేందుకు వచ్చారు. అయితే టెక్నికల్ సమస్య తలెత్తటంతో మోటర్‌ను రన్ చేయకుండానే వెనుతిరిగి పోయారు. ఆస్ట్రియా దేశానికి చెందిన ఆండ్రీజ్ కంపెనీకి చెందిన మోటర్లు కావటంతో ఆ దేశం నుంచి సాంకేతిక నిపుణులను రప్పించారు. అయితే శుక్రవారం మోటర్ల రన్ చేసేందుకు ఎదురైనా టెక్నికల్ సమస్యలను అధిగమించి టెస్ట్ నిర్వహించారు. ఆస్ట్రియా దేశం నుంచి శనివారం మరో సాంకేతిక నిపుణుడు రావటంతో సాయంత్రం వరకు ట్రయల్ రన్‌ను పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రం వరకు ట్రయల్ రన్ పూర్తి చేయాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం రాత్రికి కానీ లేదంటే సోమవారం వరకు అన్ని సాంకేతిక సమస్యలను అధిగమించి దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోస్తామని దేవాదుల సీఈవో అశోక్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఏ తప్పూ చేయలేదు

ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వండి

- హైకోర్టులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పిటిషన్
- నాకు వ్యతిరేకంగా పనికివచ్చే ఒక్కసాక్ష్యం కూడా లేదు
- పోలీసు అధికారిగా అంకితభావంతో విధులు నిర్వర్తించా
- వామపక్ష తీవ్రవాదం.. టెర్రరిజంను నియంత్రించాను
- నా ప్రతిభను రాష్ట్రంతోపాటు కేంద్ర ఏజెన్సీలు శ్లాఘించాయి
- క్యాన్సర్, కొవిడ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నా: ప్రభాకర్‌రావు



హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. తాను ఏ తప్పూ చేయలేదని, ఈ కేసులో తనను అక్రమంగా ఇరికించారని తెలిపారు. 30 ఏళ్లకు పైగా పోలీసు అధికారిగా వివిధ హోదాల్లో అత్యంత అంకితభావంతో పనిచేశానని, చట్టవిరుద్ధంగా ఏ పనీ చేయలేదని పేర్కొన్నారు. వామపక్ష తీవ్రవాదం, ఇస్లామిక్ టెర్రరిజంను కట్టడి చేయడంలో తాను కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. తన సర్వీసు మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలుమార్లు ప్రశంసలు అందుకోవడమే కాకుండా తన ప్రతిభను కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సైతం శ్లాఘించాయని పేర్కొన్నారు. తాను క్యాన్సర్‌తో పాటు కొవిడ్ కారణంగా గొంతు, ఊపిరితిత్తులకు సోకిన ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు తెలిపారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో తనకు వ్యతిరేకంగా పనికివచ్చే ఒక్క సాక్ష్యం కూడా లేదని, కేవలం ఇతర నిందితుల నేరాంగీకార వాంగ్మూలాలు తప్ప పోలీసుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన తొలిసారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

వైద్య పరీక్షల కోసమే అమెరికాకు..

"ఫోన్ ట్యాపింగ్ కేసులో నన్ను అక్రమంగా ఇరికించారని తెలియగానే న్యాయవాది ద్వారా ట్రయల్ కోర్టులో మెమో దాఖలు చేసి.. అమెరికాకు ఏ పరిస్థితుల్లో వెళ్లాల్సి వచ్చిందో వివరించాను. కేసు నమోదుకు చాలా కాలం ముందే అమెరికాకు వైద్య పరీక్షల కోసం టికెట్లు బుక్ చేసుకున్నాను. దర్యాప్తు అధికారిని సంప్రదించి ఫోన్ నంబర్ ఇవ్వడంతోపాటు దర్యాప్తునకు అన్నిరకాలుగా సహకరిస్తానని చెప్పాను. అయినా.. తప్పించుకొని పారిపోయాడనే ముద్ర వేయడం సమంజసం కాదు. ఈ విషయాన్ని ట్రయల్ కోర్టు దృష్టికి సైతం తీసుకెళ్లాను. నా ఇంట్లో తనిఖీలు చేసినా ఒక్క ఆధారం కూడా దొరకలేదు. ఫోన్ నంబర్ ఇచ్చినప్పటికీ పోలీసులు నా నుంచి ఏ వివరాలూ కోరలేదు. 2023 డిసెంబరులో రాజీనామా చేసిన మూడు నెలల తర్వాత అమెరికా వచ్చాను. ఇండియాలో ఉన్నప్పుడు ఎవరూ ఫోన్ ట్యాపింగ్ గురించి నన్ను ప్రశ్నించలేదు. రాజకీయ అధికార మార్పిడి వల్లే ఈ కేసులో అక్రమంగా ఇరికించారు. అప్పటి అధికార పార్టీకి సహాయం చేయడానికి ఫోన్ ట్యాపింగ్ చేశాననేది కేవలం అబద్ధం మాత్రమే. నాకు ఏ రాజకీయ ఆసక్తులు, వివక్ష లేవు. దశాబ్దాలుగా సేకరించిన డేటా పోయిందనడం, ఏ-2 ప్రణీత్‌రావుకు ఎక్కువ ప్రమోషన్లు ఇచ్చారనడం పూర్తిగా తప్పు" అని పిటిషన్‌లో ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. ఈ పిటిషన్ ఈ నెల 24న జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.


ఖమ్మం మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

'తేజా మిర్చి' మరింత పతనం

- నెలలో క్వింటాల్‌పై రూ.2,000 డౌన్
- కోల్డ్ స్టోరేజీలకు మిర్చి తరలిస్తున్న రైతు

ఖమ్మం మార్కెట్ , మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో 'తేజా' రకం మిర్చి ధర రోజురోజుకు పడిపోతోంది. వ్యాపారులు శుక్రవారం మార్కెట్‌లో క్వింటాల్ మిర్చికి జెండాపాట ధర రూ.13,450గా నిర్ణయించారు. విఏర్చి నాణ్యతను బట్టి క్వింటాల్ మిర్చికి రూ.5,800-రూ.11,500 మధ్య ఎక్కువ లాట్లు కొనుగోలు చేశారు. నెల క్రితం క్వింటాల్ మిర్చి ధర రూ.15,000 పలికితే ప్రస్తుతం రూ.2,000పై చిలుకు పతనమైంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో క్వింటాల్ మిర్చి ధర రూ.18,000-రూ.19,000 మధ్య పలికింది. చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల నుంచి 'తేజా' మిర్చికి అంతగా గిరాకీ లేకపోవడంవల్లే ఎగుమతులు నిలిచిపోయాయని, తత్ఫలితంగా ధరలు తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కాగా, మార్కెట్‌కు శుక్రవారం 65 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి.

కోల్డ్‌స్టోరేజీలపైనే రైతుల కొండంత ఆశ

మార్కెట్లో రోజురోజుకూ మిర్చి ధరలు తగ్గిపోతుండటంతో విసుగెత్తిన రైతులు కోల్డ్ స్టోరేజీలపై కొండంత ఆశలు పెట్టుకున్నారు. ప్రారంభంలో క్వింటాల్ మిర్చి రూ.18,000-రూ.19,000 మధ్య ధర పలికినప్పుడు రైతులు వడివడిగా పంట అమ్ముకున్నారు. ధరలు తగ్గడంతో గిట్టుబాటు కావడం లేదని పంట నిల్వ కోసం శీతల గిడ్డంగుల వైపు పరుగులు తీస్తున్నారు. అంతర్జాతీయంగా గిరాకీ లేదని వ్యాపారులు చెబుతున్నా.. భవిష్యత్‌పై ఆశతో అన్నదాతలు కోల్డ్ స్టోరేజీల్లో పంట నిల్వ చేస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌తోపాటు మద్దులపల్లి మార్కెట్ పరిధిలో గల సుమారు 25 కోల్డ్ స్టోరేజీల్లో 23 లక్షల మిర్చి బస్తాల నిల్వ సామర్థ్యం ఉంది. ఇప్పటికే సుమారు 18 లక్షల బస్తాలకు పైగా నిల్వ చేశారు. ఇక 5 లక్షల విఏర్చి బస్తాల నిల్వకే అవకాశముంది. గతేడాది కూడా కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చి రైతులు భారీగా నష్టపోయారు.

గతంతో పోలిస్తే సన్నగిల్లిన డిమాండ్

విదేశాల నుంచి ఆర్డర్లు రాకపోవడం వల్లే మిర్చి ధరలు తగ్గుతున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. పంటలో వైరస్, తెగుళ్ల ప్రభావంతో మిర్చిలో నాణ్యత తగ్గుముఖం పట్టిందని, మిర్చిలో ఆయిల్ తగ్గడం కూడా గిరాకీ పడిపోవడానికి కారణం అని వ్యాపార వర్గాల కథనం. తత్ఫలితంగా ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లో పండిస్తున్న మిర్చికి గతంతో పోలిస్తే డిమాండ్ తగ్గిందని వ్యాపారులు అంటున్నారు.

10,954 రెవెన్యూ శాఖలో కొత్త పోస్టులు

(మొదటి పేజీ తరువాయి)

మంజూరు చేస్తూ శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ ఎకుమార్ సుల్తానియా ఉత్తర్వులను జారీ చేశారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విధుల్లోకి తిరిగి తీసుకుంటామని హామీ ఇచ్చి వివిధ శాఖల్లో నియమించింది. అయితే... అర్హతలున్నవారిని రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలంటూ పలుసంఘాలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. దాంతో ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలోనే 10,954 పోస్టులను సృష్టించి అర్హత గల వీఆర్ఓలు, వీఆర్ఏలలో కొంత మందిని తీసుకోనుంది. 6వేల మందిని ఈరకంగా నియమించనున్నట్లు తెలిసింది. మిగతా పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిన భర్తీ చేయనుంది.

85,894 మంది కార్మికులకు రూ.381.13 కోట్ల వ్యయం : మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ ద్వారా 85,894 మంది కార్మికులకు రూ.381.13 కోట్ల మేర వ్యయం చేశామని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అసెంబ్లీలో పద్దులపై శనివారం జరిగిన చర్చకు సమాధానమిస్తూ.. కార్మిక శాఖ కింద మూడు రకాల బోర్డులు ఉన్నాయన్నారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు, తెలంగాణ కార్మిక సంక్షేమ బోర్డు, తెలంగాణ అసంఘటిత రంగ కార్మిక సామాజిక భద్రత బోర్డులు ఉన్నాయని తెలిపారు.

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7 వరకు జరుగుతాయని ఈవో జగన్మోహన్‌రావు తెలిపారు.

- ఎర్రుపాలెం, ఆంధ్రజ్యోతి

కాటమయ్య రక్షణ కిట్లు ఏవీ?

- గీత కార్మికుల ఎదురుచూపులు
- రాష్ట్రవ్యాప్తంగా 1,85,429 మంది గీత కార్మికులు
- అందరికీ కిట్లు అందించాలని వినతి



జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులను ప్రమాదాల బారి నుంచి కాపాడేందుకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. మంచి సంకల్పంతో ముందుకొచ్చిన ప్రభుత్వం.. గీత కార్మికులందరికీ కిట్లను మాత్రం అందించలేకపోతోంది. తమకు ఎప్పుడెప్పుడు కిట్లు అందిస్తారా అని గౌడన్నలు ఎదురుచూస్తున్నారు. తరచుగా వివిధ ప్రాంతాల్లో గీత కార్మికులు తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోతుంటారు. ఇలా ఎంతో మంది గాయపడి మృతి చెందుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కల్లు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గౌడన్నల రక్షణ కోసం ఉచితంగా కిట్లను అందించాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. బీసీ సంక్షేమ శాఖలోని టాడీ టాపర్స్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు కిట్ల వాడకంపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 1,85,429 గీత కార్మికులున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. 2024 జూలైలో తొలిదశలో రాష్ట్రంలోని 84 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 9,461 రక్షణ కిట్లను పంపిణీ చేయడానికి లబ్ధిదారులకు శిక్షణను అందించారు. ఇందులో 2,475 మందికి కిట్లను పంపిణీ చేయగా 6,986 కిట్లు ఇంకా అందించాల్సి ఉంది. ఒక్కో కిట్ ధర, శిక్షణ కలిపి సుమారు రూ.13 వేలు వ్యయం అవుతుండగా ప్రభుత్వమే భరిస్తున్నది. రెండో దశలో సుమారు మరో 10 వేల మందికి రక్షణ కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ఏడు ఉమ్మడి జిల్లాల్లో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కిట్ల పంపిణీ నిలిచిపోయింది. కోడ్ పూర్తి అయినప్పటికీ కిట్ల పంపిణీ తిరిగి ప్రారంభం కాలేదు. వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్, ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలో ఒక్క గీతకార్మికుడికి కూడా రక్షణ కిట్ ఇవ్వలేదు. తొలి దశ రక్షణ కిట్లను లక్ష్యం మేరకు పంపిణీ చేయాలని, రెండో దశలోనూ కిట్ల పంపిణీని వేగవంతం చేయాలని గీత కార్మికులు కోరుతున్నారు.


రక్షణ కిట్

గీత కార్మికులందరికీ రక్షణ కిట్లు అందించాలి



రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ రక్షణ కిట్లు అందించాలి. తొలిదశ పంపిణీ ఇంకా పూర్తి కాలేదు. రెండో దశ పంపిణీ అక్కడక్కడా జరిగిందంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రక్షణ కిట్ల పంపిణీని వేగవంతం చేయాలి.

-కాలికంటి కుమారస్వామి, గీత కార్మికుడు, జగిత్యాల జిల్లా

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే **RK**



కొత్తపలుకు |

వాట్‌ ఈజ్‌ దిస్‌ జస్టిస్‌?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు బయటపడ్డాయని వెలువడ్డ వార్త న్యాయ వ్యవస్థను ఉలికిపాటుకు గురిచేసింది. న్యాయవ్యవస్థ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వెలువడిన ఈ వార్తతో సదరు వ్యవస్థపై ప్రజలలో నమ్మకం మరింత సన్నగిల్లింది. ఈ ఉదంతంతో పలు మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోట్ల కట్టలు ఈ నెల 14న బయటపడగా, వారం రోజుల వరకు అది వెలుగు చూడకపోవడానికి కారణం ఏమిటి? ఆ నోటా ఈ నోటా ఈ ఉదంతం వెలుగులోకి రావడం ఏమిటి? సదరు న్యాయమూర్తిని కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకోవడం ఏమిటి? లెక్కల్లో చూపని నగదు దొరికినప్పుడు హడావిడి చేసే ఈడీ, ఆదాయపు పన్ను శాఖలు మౌనంగా ఉండటం ఏమిటి? ఈ సంఘటనపై సమాచారం సుప్రీంకోర్టు కొలీజియంకు నిజంగానే ఆలస్యంగా తెలిసిందా? లేక ఈ వ్యవహారం గాలివానగా మారడంతో విధిలేని పరిస్థితుల్లో సుప్రీంకోర్టు కొలీజియం స్పందించిందా? ఈ సంఘటనపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణ చేపట్టగా 'అబ్బే, సదరు న్యాయమూర్తి ఇంట్లో డబ్బే దొరకలేదు' అని ఢిల్లీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ప్రకటించడం ఏమిటి? ఇందులో నిజానిజాలు తెలుసుకొనే హక్కు ఈ దేశ పౌరులకు లేదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయా?

> **కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బెట్టింగ్ యాప్‌లను, జూదాన్ని పోలిన గేమ్‌లను నిషేధిస్తూ గేమింగ్ చట్టాన్ని తీసుకొచ్చారు. ఆ తర్వాత యథావిధిగా అందరూ ఆ చట్టాన్ని మరచిపోయారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా గేమింగ్ యాప్‌ల కోసం సినీ ప్రముఖులు ప్రచారం చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అప్పుడు పట్టించుకోలేదు. దీంతో అది నేరమే కాదనుకొని ప్రముఖ హీరోలు కూడా ప్రచారం చేశారు. ఇప్పుడు హఠాత్తుగా అధికారులు మేల్కొన్నారు. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ప్రచారం చేసిన వారిపై పోలీసులు అప్పుడే ఎందుకు కేసులు పెట్టలేదు? ఇప్పుడు మాత్రమే ఎందుకు హడావిడి చేస్తున్నారు? చట్టాలను అమలు చేయని అధికారులపై కూడా చర్యలు ఉండాలి కదా? చట్టాలంటే ప్రజల్లో భయం ఉండాలి. చట్టాలను ఉల్లంఘిస్తే శిక్ష పడుతుందన్న భయం ఉండాలి. అలా కాకుండా గిట్టని వారిని ఇబ్బంది పెట్టేందుకు... మూలన పడి ఉన్న చట్టాలను దుమ్ము దులిపి అమలు చేయాలనుకోవడం వల్లనే తంటా అంతా.**

అవినీతికి అతీతం కాదా??

మిగతా వ్యవస్థల వలే న్యాయ వ్యవస్థలో కూడా అవినీతి చోటుచేసుకుంటోందన్న విమర్శలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే, న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కారణంగా న్యాయమూర్తుల అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడలేని పరిస్థితి ఉంది. కీలకమైన, సున్నితమైన అంశాలపై విచారణ జరిపి తీర్పులు ఇచ్చే హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో రక్షణలు కల్పించారు. ఇప్పుడా రక్షణలను కొంతమంది న్యాయమూర్తులు దుర్వినియోగం చేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. తీర్పులు అనుకూలంగా రాని సందర్భాలలో కక్షిదారులు న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించకుండా రాజ్యాంగ నిర్మాతలు ఈ రక్షణలు కల్పించారు. న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించే వారిని కోర్టు ధిక్కరణ కింద శిక్షించే వెసులుబాటును న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించింది. న్యాయమూర్తులకు కల్పించినంత రక్షణ న్యాయాధికారులకు కల్పించలేదు. కింది స్థాయి కోర్టులలో పనిచేసే న్యాయాధికారులు అవినీతికి పాల్పడినా లేదా ఇతర అనైతిక చర్యలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకొనే అవకాశం హైకోర్టులకు కల్పించారు. అదే హైకోర్టు న్యాయమూర్తి ఎవరైనా అవినీతికి పాల్పడ్డారని వెల్లడైనా సదరు న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు కూడా నేరుగా చర్య తీసుకోలేదు. పార్లమెంటు ఉభయ సభల్లో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించడం ద్వారానే సదరు న్యాయమూర్తులను తొలగించగలరు. స్వతంత్ర భారతావనిలో రామస్వామి, సౌమిత్రసేన్ అనే ఇద్దరు న్యాయమూర్తులు మాత్రమే అభిశంసన ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు లభించిన విషయం వాస్తవమేనని రుజువైతే ఆయనపై ఏమి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశం అయింది. న్యాయాధికారులను అవినీతి కేసులలో అరెస్టు చేసి జైలుకు పంపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఇనుప ఖనిజం గనుల వ్యవహారంలో గాలి జనార్దన్‌రెడ్డి అండ్ కో నుంచి ఐదు కోట్ల రూపాయలు లంచంగా తీసుకున్నారన్న ఆరోపణలపై పట్టాభి రామారావు అనే న్యాయాధికారిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతితో సీబీఐ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో అవమాన భారంతో కుంగిపోయిన పట్టాభి రామారావు కొంతకాలానికి ఆత్మహత్య చేసుకున్నారు.


నిజమేనా? నిజమైతే ఏం చేస్తారు?

ఇప్పుడు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ వ్యవహారం రచ్చగా మారింది. వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీం కొలీజియం నిర్ణయించడంతో, 'మా హైకోర్టు ఏమైనా చెత్త బుట్టా?' అని అలహాబాద్ హైకోర్టు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. దీంతో వర్మ బదిలీకి, ఆయనపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేపట్టిన అంతర్గత విచారణకూ సంబంధం లేదని సుప్రీంకోర్టు కొలీజియం వివరణ ఇచ్చింది. డబ్బు కట్టలు లభించిన విషయం నిజమా? కాదా? అని నిర్ధారించుకోవడానికి వారం రోజులు చాలవా? ఇంకెంత కాలం కావాలి? ఒకవేళ అది నిజం కాని పక్షంలో యశ్వంత్ వర్మ ప్రతిష్ఠకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత తీసుకుంటారు? అంతర్గత విచారణలో అది నిజమే అని తేలితే సదరు న్యాయమూర్తిపై ఏమి చర్యలు తీసుకుంటారు? వారం రోజులుగా ఈ వ్యవహారం గుప్పుమంటున్నా నోరు విప్పని ఢిల్లీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ అతుల్ గర్గ్ ఇప్పుడు 'అబ్బే, అలాంటిదేమీ లేదు' అని ప్రకటించడమేమిటి? దేశ వ్యాప్తంగా రాజకీయ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మౌనంగా ఎందుకుందో తెలియదు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల వద్ద లెక్కల్లో చూపని నగదు స్వల్ప మొత్తంలో దొరికినా అవినీతి నిరోధక సంస్థలు కేసులు పెడతాయి. లంచంగా వంద రూపాయలు తీసుకున్నప్పటికీ నేరం నేరమేనని ఉన్నత న్యాయస్థానాలు ఎన్నో సందర్భాలలో తీర్పులు ఇచ్చాయి. ఈ సూత్రం న్యాయమూర్తులకు వర్తించదా? రాజ్యాంగపరంగా రక్షణ కల్పించబడినప్పటికీ ఇలాంటి సందర్భాలలో సదరు న్యాయమూర్తులపై చర్యలు తీసుకోని పక్షంలో ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఎలా ఉంటుంది? న్యాయవ్యవస్థలోనూ జవాబుదారీతనం ఉండాలి కదా?

కీలక ప్రశ్నలు...

న్యాయ వ్యవస్థలో అవినీతి అనేది బహిరంగ రహస్యంగా మారిన ఈ రోజుల్లో న్యాయమూర్తులకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను కొనసాగించవలసిందేనా? ఇప్పటికే న్యాయమూర్తుల నియామకం ప్రక్రియ చర్చనీయాంశం అయింది. ఉన్నత న్యాయస్థానాలతోపాటు సర్వోన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులను నియమించే అధికారం కొలీజియం వద్ద ఉండటం వాంఛనీయం కాదన్న వాదన నడుస్తోంది. అలా అని న్యాయమూర్తుల నియామక అధికారం ప్రభుత్వాలకు అప్పగిస్తే న్యాయ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతింటుందన్న వాదన కూడా బలంగా ఉంది. ఇటీవలి కాలంలో మన న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించడం లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. దేశంలో బలమైన నాయకత్వం ఉన్నప్పుడల్లా న్యాయ వ్యవస్థ సాగిలపడిన సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో పాలకులు ఎంత శక్తిమంతులుగా ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడిన న్యాయమూర్తులను కూడా చూశాం. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు న్యాయ వ్యవస్థ లొంగిపోయిందని చెబుతారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు ఉండేవారు. కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పి.శివశంకర్ పనిచేశారు. అప్పట్లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ద్రోణంరాజు సత్యనారాయణ అనే కాంగ్రెస్ నాయకుడు హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌ను విస్తృత ధర్మాసనం నెలల తరబడి విచారించింది. చివరికి ముఖ్యమంత్రి నివాసంలో పరిమితికి మించి పాలు వినియోగించడం వంటి అంశాలలో ఎన్టీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని ధర్మాసనం తేల్చింది. రెండు మూడు లీటర్ల పాలు ఎక్కువగా వినియోగించారని ఇప్పుడు తీర్పు ఇస్తే జనం నవ్వుకుంటారు. వందల, వేల కోట్ల అవినీతి జరిగినా, జరుగుతున్నా ప్రజల్లో స్పందన ఉండటం లేదు. ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా తీర్పు రావడానికి పై నుంచి వచ్చిన ఒత్తిళ్లు పనిచేశాయని అప్పట్లో ప్రచారం జరిగింది. దీనిపై ఎన్టీఆర్ సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకున్నారు. అది విచారణకు రాకముందే ఆయన కన్నుమూశారు. కేసు దాఖలు చేసిన ద్రోణంరాజు గానీ, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కానీ, న్యాయశాఖ మంత్రి శివశంకర్ కానీ, ద్రోణంరాజు తరఫున కేసులు వాదించిన ఎస్.రామచంద్రరావు కానీ ఇప్పుడు మన మధ్య లేరు. ఎన్టీఆర్ తరఫున వాదించిన ఇ.అయ్యపురెడ్డి కూడా ఇప్పుడు మనతో లేరు. కేంద్రంలో బలమైన నాయకత్వం ఉన్నప్పుడు న్యాయవ్యవస్థ ఒత్తిళ్లకు తలొగ్గే అవకాశం ఉందని చెప్పడానికి ఎన్టీఆర్ కేసును ఒక ఉదాహరణగా న్యాయ నిపుణులు చెబుతుంటారు. అలా అని న్యాయమూర్తులు అందరూ అలాగే ఉంటారని భావించకూడదు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది కూడా అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తే. జస్టిస్ జగ్మోహన్ లాల్ సిన్హా ఇచ్చిన ఆ సాహసోపేత తీర్పు బలమైన నాయకురాలు ఇందిరాగాంధీని డిఫెన్స్‌లో పడేసింది. నాటి తీర్పు నుంచి బయటపడేందుకు దేశంలో అత్యయిక పరిస్థితిని ఇందిరాగాంధీ అమలు చేశారు. ఆమె అధికారం కూడా కోల్పోయారు.

అలాంటి నిఖార్సయిన న్యాయమూర్తులు ఎందరో ఉన్నారు. తులసి వనంలో గంజాయి మొక్కల్లా అక్కడక్కడా కొంత మంది దారితప్పుతారు. కాకపోతే ఇటీవలి కాలంలో గంజాయి మొక్కలు ఎక్కువ అవుతున్నాయన్న భావన ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడు మళ్లీ యశ్వంత్ వర్మ వ్యవహారానికి వద్దాం! ఈ విషయం కేవలం న్యాయ వ్యవస్థ ప్రైవేటు వ్యవహారం కాదు. న్యాయ వ్యవస్థ స్వచ్ఛంగా ఉండాలని కోరుకొనే హక్కు ఈ దేశ పౌరులకు ఉంది. రాజ్యాంగం ఎన్ని రక్షణలు కల్పించినప్పటికీ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయే పనులు చేయకూడదు కదా! తనకు సంబంధించి వచ్చిన ఆరోపణలు అవాస్తవమని సదరు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అయినా ప్రకటించాలి, లేదా విచారణను త్వరగా ముగించి వాస్తవం ఏమిటో ప్రజలకు తెలియజేయాలి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు మంచి పేరే ఉంది. న్యాయ వ్యవస్థ విశ్వసనీయతను కాపాడేందుకు ఆయన చర్యలు తీసుకోవాలి. సంఘటన జరిగిన తర్వాత వారం రోజుల వరకు నోట్ల కట్టల వ్యవహారం బయటకు రాకపోవడమే తనను అధికంగా బాధిస్తోందని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈ అభిప్రాయంతో ఎవరైనా ఏకీభవించాల్సిందే. నోట్ల కట్టలు అక్కడ ఉండటం నిజమే అయితే దాన్ని దాచిపెట్టాలని అనుకోవడం కూడా నేరమే అవుతుంది. తప్పు జరిగినప్పుడు చర్యలు తీసుకోవాలిగానీ జరిగిన దానికి మసిబూసి మారేడు కాయ చేయాలనుకోవడం కూడా నేరం అవుతుంది. నిప్పు లేనిదే పొగ రాదు అని అంటారు. ఇప్పుడు పొగ వచ్చింది. నోట్ల కట్టల వ్యవహారం దాచిపెట్టాలని ఏ స్థాయిలో ప్రయత్నాలు జరిగినా ప్రజల్లో న్యాయ వ్యవస్థ విశ్వసనీయత మరింత దెబ్బతింటుంది. న్యాయమూర్తులు కూడా ఈ సమాజం నుంచే వస్తారు. వారు ఆకాశం నుంచి ఊడిపడరు. సమాజంలో ఉన్న బలహీనతలు వారిలో కొందరికి ఉండవచ్చు కూడా. అంచేత తప్పు జరిగి ఉంటే.. తప్పు జరిగిందని సర్వోన్నత న్యాయస్థానమైనా స్పష్టం చేస్తే ప్రజలకు కొంతలో కొంతైనా ఉపశమనం లభిస్తుంది. అలా కాకుండా ఇది తమ అంతర్గత వ్యవహారమని, తామే చూసుకుంటామని ఏ స్థాయిలోనైనా భావిస్తే అది న్యాయ వ్యవస్థకు కీడు చేసినట్టే అవుతుంది. నోట్ల కట్టల ఉదంతం శుక్రవారం ఉదయం నుంచి ప్రసార మాధ్యమాలలో ప్రచారమైనప్పటికీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ రాత్రి పొద్దుపోయాక అంతా ఉత్తదే అని ప్రకటించడం, శనివారం అందుకు విరుద్ధంగా తాను అలా అనలేదని మాట మార్చడం వింతగా ఉంది. ఏదేమైనా మన న్యాయ వ్యవస్థకు కూడా జవాబుదారీతనం ఉండాలి. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నిజంగా డబ్బు లభించి ఉంటే ఆయనకు ఏ శిక్ష విధిస్తారోనని కూడా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆయనతో రాజీనామా మాత్రమే చేయిస్తారా? లేక అవినీతి నిరోధక చట్టాలు, మనీ లాండరింగ్ చట్టాల కింద శిక్షిస్తారా అన్నది కూడా తెలుసుకోవాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన వార్తా పత్రికలలో ఈ ఉదంతమే పతాక శీర్షికగా వచ్చింది. అయితే, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి చెందిన రోత మీడియాలో మాత్రం ఈ వార్త ఫస్ట్ పేజీలో అప్రధానంగా ప్రచురించారు. అవినీతి కేసులలో విచారణను ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డికి నైతికత లేనందునే కాబోలు ఆయన రోత మీడియా ఈ వార్తను విస్మరించింది.



> **కొండ కోనల్లో జీవిస్తున్న గిరిపుత్రులకు నాగరిక ప్రపంచంతో సంబంధాలు ఉండటం లేదు. అలాంటి వారు చట్టాల గురించి ఎలా తెలుసుకుంటారు? ఈ కారణంగా Ignorance of law is not an excuse అని మరో చట్టంలో ఉన్న విషయం చెప్పి శిక్షిస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో నిజంగా నగదు లభించి ఉంటే Ignorance of law అని చెప్పలేరు కదా? ఆయన నేరానికి శిక్ష పడాల్సిందే!**

తెలియదంటే సరిపోదు...

Ignorance of law is not an excuse అని పలు సందర్భాలలో న్యాయ స్థానాలు తీర్పులు ఇచ్చాయి. తెలంగాణలో బెట్టింగ్ యాప్‌ల తరఫున ప్రచారం చేసిన సినీ ప్రముఖులలో కొందరు, తమకు అలా ప్రచారం చేయడం తప్పని తెలియదన్నారు. న్యాయ సమీక్షలో ఈ వాదన నిలబడదు. చట్టాల గురించి తెలుసుకోవలసిన బాధ్యత ప్రజల మీదే ఉంటుందని మన చట్టాలు చెబుతున్నాయి. ప్రకాశ్‌రాజ్ వంటి వారు మాత్రం బెట్టింగ్ యాప్‌ల కోసం ప్రచారం చేయడం తప్పు అని తెలియగానే తాను ఆపేశానని హుందాగా చెప్పారు. నిజానికి మన దేశంలో ఏమి చట్టాలు ఉన్నాయి? ఎన్ని చట్టాలు ఉన్నాయి? అన్న విషయం ఎంతమందికి తెలుసు? కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న వారిలో ఎంత మందికి అమలులో ఉన్న చట్టాల గురించి తెలుసు? ఇందుకు కారణం లేకపోలేదు. ఆయా ప్రభుత్వాలు చట్టాలు చేసుకుంటూ పోతున్నాయి. వాటి గురించి ప్రజలకు కనీస అవగాహన కల్పించడం లేదు. అంతెందుకు! సదరు చట్టాలను ఆమోదిస్తున్న చట్టసభల్లోని సభ్యుల్లో ఎంత మందికి ఆ చట్టాల గురించి తెలుసు? ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి మనసులో అనుకుంటారు. వారు అనుకున్న దాన్ని చట్టాల రూపంలో అధికారులు బిల్లుగా రూపొందిస్తారు. సదరు బిల్లులను సమగ్రంగా చర్చించకుండానే అధికార పార్టీ సభ్యులు వాటిని ఆమోదిస్తారు. ఆ వెంటనే ఆయా చట్టాలు అమల్లోకి వస్తాయి. ప్రసార మాధ్యమాలలో కూడా వాటి గురించి వివరించరు. వివరంగా వార్తలు ప్రచురించినా పాఠకులకు ఆసక్తి ఉండదు. చట్టాలు చేసిన వారికి కూడా అందులో ఏముందో తెలియదు. చట్టసభ సభ్యులకే తాము ఆమోదించిన చట్టాల గురించి తెలియని నేపథ్యంలో... 'చట్టాల గురించి తెలియనంత మాత్రాన నేరం నుంచి తప్పించుకోలేరు' అని అనడం కించిత్ ఆశ్చర్యంగా ఉంది. మన దేశంలో ఎన్ని చట్టాలు ఉన్నాయని అడిగితే ఒక్కరైనా కరెక్టుగా చెప్పగలరా? కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బెట్టింగ్ యాప్‌లను, జూదాన్ని పోలిన గేమ్‌లను నిషేధిస్తూ గేమింగ్ చట్టాన్ని తీసుకొచ్చారు. ఆ తర్వాత యథావిధిగా అందరూ ఆ చట్టాన్ని మరచిపోయారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా గేమింగ్ యాప్‌ల కోసం సినీ ప్రముఖులు ప్రచారం చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అప్పుడు పట్టించుకోలేదు. దీంతో అది నేరమే కాదనుకొని ప్రముఖ హీరోలు కూడా ప్రచారం చేశారు. ఇప్పుడు హఠాత్తుగా అధికారులు మేల్కొన్నారు. హెల్మెట్ ధారణ విషయమే తీసుకుందాం. న్యాయస్థానాలు ఆదేశించినప్పుడు లేదా ట్రాఫిక్ అధికారులకు గుర్తొచ్చినప్పుడు మాత్రమే హెల్మెట్ ధారణ రూల్ అమలు చేస్తున్నారు.

> **నిజానికి మన దేశంలో ఏమి చట్టాలు ఉన్నాయి? ఎన్ని చట్టాలు ఉన్నాయి? అన్న విషయం ఎంతమందికి తెలుసు? కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న వారిలో ఎంత మందికి అమలులో ఉన్న చట్టాల గురించి తెలుసు? ఇందుకు కారణం లేకపోలేదు. ఆయా ప్రభుత్వాలు చట్టాలు చేసుకుంటూ పోతున్నాయి. వాటి గురించి ప్రజలకు కనీస అవగాహన కల్పించడం లేదు. అంతెందుకు! సదరు చట్టాలను ఆమోదిస్తున్న చట్టసభల్లోని సభ్యుల్లో ఎంత మందికి ఆ చట్టాల గురించి తెలుసు? ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి మనసులో అనుకుంటారు. వారు అనుకున్నదాన్ని చట్టాల రూపంలో అధికారులు బిల్లుగా రూపొందిస్తారు. సదరు బిల్లులను సమగ్రంగా చర్చించకుండానే అధికార పార్టీ సభ్యులు వాటిని ఆమోదిస్తారు. ఆ వెంటనే ఆయా చట్టాలు అమల్లోకి వస్తాయి. చట్టాలు చేసిన వారికి కూడా అందులో ఏముందో తెలియదు. చట్టసభ సభ్యులకే తాము ఆమోదించిన చట్టాల గురించి తెలియని నేపథ్యంలో... 'చట్టాల గురించి తెలియనంత మాత్రాన నేరం నుంచి తప్పించుకోలేరు' అని అనడం కించిత్ ఆశ్చర్యంగా ఉంది.**

వాహనాలలో కూర్చున్నవారు బయటకు కనిపించకుండా కార్లలో బ్లాక్ ఫిల్మ్ అంటించడం కూడా నిషేధించారు. అయినా సుప్రీంకోర్టు స్పందించే వరకు ఈ రూల్ అమలు కాలేదు. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో! చట్టాలు చేసిన ప్రభుత్వాలకు వాటికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన బాధ్యత లేదా? మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని చట్టాలు చేశారు, ఏమేమి చట్టాలు చేశారు అని మాజీ ముఖ్యమంత్రులను అడిగితే చెప్పే పరిస్థితి ఉందా?

చట్టం గురించి చెప్పాల్సిందెవరు?

భారతదేశం వంటి అధిక జనాభా ఉన్న దేశాలలో ఎడాపెడా చట్టాలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. అమలు చేయగలిగిన స్థితిలో ఉన్నప్పుడే చట్టాలను చేయాలి. అలా జరిగితేనే ప్రజల్లో అవగాహన ఏర్పడుతుంది. ఏదైనా జరిగినప్పుడు ప్రజలను సంతృప్తిపరిచేందుకు చట్టాలు చేస్తే పరిస్థితి ఇలాగే ఉంటుంది. గేమింగ్ యాప్‌ల విషయంలో పోలీసులు ఇప్పుడు కేసులు నమోదు చేసి సినిమా వాళ్లను పిలుస్తున్నారు. దీంతో ఇప్పుడు ఇది ప్రధాన వార్తగా మారింది. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ప్రచారం చేసిన వారిపై పోలీసులు అప్పుడే ఎందుకు కేసులు పెట్టలేదు? ఇప్పుడు మాత్రమే ఎందుకు హడావిడి చేస్తున్నారు? చట్టాలను అమలు చేయని అధికారులపై కూడా చర్యలు ఉండాలి కదా? చట్టాలంటే ప్రజల్లో భయం ఉండాలి. చట్టాలను ఉల్లంఘిస్తే శిక్ష పడుతుందన్న భయం ఉండాలి. అలా కాకుండా గిట్టని వారిని ఇబ్బంది పెట్టేందుకు... మూలన పడి ఉన్న చట్టాలను దుమ్ము దులిపి అమలు చేయాలనుకోవడం వల్లనే తంటా అంతా. ఈ కారణంగానే ప్రజల్లో చట్టాలపట్ల భయం, గౌరవం లేకుండా పోయింది. పలుకుబడి ఉంటే చట్టాలు చుట్టాలుగా మారిపోతున్నాయి. ప్రజలు కూడా చట్టాల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలి. లేని పక్షంలో తమను ఇబ్బందులపాలు చేయడానికి సదరు చట్టాలను దుర్వినియోగం చేస్తారని గ్రహించాలి. ఉదాహరణకు ఇటీవల విడుదలైన 'కోర్టు' అనే సినిమాలో చట్టాల గురించి తెలియకపోతే వాటిని ఎంతలా దుర్వినియోగం చేస్తారో చక్కగా వివరించారు. పోక్సో చట్టం గురించి ఈ సినిమాలో చక్కగా చెప్పారు. సదుద్దేశంతో చేసిన చట్టాలను కక్ష సాధింపులకు వాడుకుంటున్నారు. వైవాహిక జీవితంలో మహిళలకు రక్షణ కల్పించడం కోసం రూపొందించిన చట్టంలోని 498ఏ సెక్షన్‌ను విస్తృతంగా దుర్వినియోగం చేస్తున్నారని వింటున్నాం, చూస్తున్నాం. చిన్న పిల్లలను లైంగికంగా వేధించే వారిని కఠినంగా శిక్షించడానికి రూపొందించిన పోక్సో చట్టాన్ని అడ్డుపెట్టుకొని పద్దెనిమిదేళ్లు నిండటానికి కొద్ది రోజులే మిగిలి ఉన్న యువతిని ప్రేమించిన పాపానికి ఒక యువకుడిని కేసు పెట్టి వేధించిన తీరును 'కోర్టు' చిత్రంలో చక్కగా చూపించారు. పసి పిల్లలను కూడా వదలకుండా లైంగికంగా వేధిస్తున్న కేసులు వెలుగుచూడటంతో పోక్సో చట్టాన్ని తెచ్చారు. ఈ చట్టం ప్రకారం పద్దెనిమిదేళ్లు నిండని యువతిని ప్రేమించడం నేరం అన్నట్టుగా 'కోర్టు' చిత్రంలో ఒక యువకుడిపై కేసు పెట్టి చిత్రహింసలు పెడతారు. పోక్సో చట్టం ప్రకారం బెయిల్ కూడా లభించదు. ఇలాంటి చట్టాల విషయంలో అయినా ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై లేదా? చట్టసభలలో సంఖ్యా బలంతో చట్టాలు చేశాం, వాటి గురించి మీరే తెలుసుకోండి అని ప్రభుత్వాలు చెప్పడం ఎంత వరకు సమంజసం? మన దేశంలో ఇంకా నిరక్షరాస్యత ఉంది. కొండ కోనల్లో జీవిస్తున్న గిరిపుత్రులకు నాగరిక ప్రపంచంతో సంబంధాలు ఉండటం లేదు. అలాంటి వారు చట్టాల గురించి ఎలా తెలుసుకుంటారు? ఈ కారణంగా Ignorance of law is not an excuse అని మరో చట్టంలో ఉన్న విషయం చెప్పి శిక్షిస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో నిజంగా నగదు లభించి ఉంటే Ignorance of law అని చెప్పలేరు కదా? ఆయన నేరానికి శిక్ష పడాల్సిందే!

> **న్యాయవ్యవస్థ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వెలువడిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు వార్తతో సదరు వ్యవస్థపై ప్రజలలో నమ్మకం మరింత సన్నగిల్లింది. ఈ ఉదంతంతో పలు మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోట్ల కట్టలు ఈ నెల 14న బయటపడగా, వారం రోజుల వరకు అది వెలుగు చూడకపోవడానికి కారణం ఏమిటి? ఆ నోటా ఈ నోటా ఈ ఉదంతం వెలుగులోకి రావడం ఏమిటి? సదరు న్యాయమూర్తిని కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకోవడం ఏమిటి? లెక్కల్లో చూపని నగదు దొరికినప్పుడు హడావిడి చేసే ఈడీ, ఆదాయపు పన్ను శాఖలు మౌనంగా ఉండటం ఏమిటి? ఈ సంఘటనపై సమాచారం సుప్రీంకోర్టు కొలీజియంకు నిజంగానే ఆలస్యంగా తెలిసిందా? లేక ఈ వ్యవహారం గాలివానగా మారడంతో విధిలేని పరిస్థితుల్లో సుప్రీంకోర్టు కొలీజియం స్పందించిందా?**

స్వాతంత్ర్య సమరంలో యువవీరులు

షహీద్ దివస్.. నేడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల అమర త్యాగాలకు దేశం గర్విస్తోంది. భరతమాతను దాస్యశృంఖలాల నుంచి విడిపించడానికి అసమాన పోరాటం చేసిన ఆ ముగ్గురు వీరులను నాటి వలస పాలకులు అన్యాయంగా ఉరికంబం ఎక్కించారు.

చిన్న వయసులోనే ఆ ముగ్గురు వీరులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఉరిని కూడా ఆనందంగా స్వీకరించి బలిదానం చేసిన రోజు మార్చి 23. ఆ వీరులు ప్రాణత్యాగం చేసిన నాటి రోజునే వారి జ్ఞాపకార్థం షహీద్ దివస్‌గా జరుపుకుంటున్నాం. ఆ ముగ్గురూ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్ థాపర్, శివ్‌రామ్ రాజ్‌గురులు. బ్రిటిష్ పాలన అంతంకావాలని పరాయి పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టి 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన ఈ ముగ్గురు వీరులు నాటి తరానికే కాదు, నేటి యువతకు కూడా ఆదర్శం. ఉరికంబం ఎక్కడానికి ముందు కూడా తమ ముఖంలో చిరునవ్వు చెరగనివ్వని ఈ యోధులు, చావును కూడా ఎంతో ఆనందంగా స్వీకరించారు. 1931 మార్చి 23న ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న పంజాబ్ హుస్సైన్‌వాలా ప్రావిన్స్ జైల్లో ఈ వీరులను ఉరికంబానికి బలిచ్చారు. భరతమాతను బ్రిటీషర్ల చెర నుంచి విడిపించి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారుల్లో భగత్‌సింగ్ ఒకరు. అందుకే ఆ విప్లవ వీరుడ్ని షహీద్ భగత్‌సింగ్‌గా పిలుస్తారు. 1907 సెప్టెంబరు 28న ప్రస్తుత పాకిస్థాన్‌లోని లాహోర్‌లో జన్మించిన భగత్‌సింగ్ చిన్న వయసులోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. తనకు వివాహం చేయాలన్న తల్లిదండ్రుల నిర్ణయం తెలుసుకున్న భగత్, ఆ ప్రయత్నాన్ని మానుకోమని ఉత్తరం రాసిపెట్టి ఢిల్లీకి చేరారు. దైనిక్ అర్జున్, ప్రతాప్ లాంటి పత్రికల్లో కొంతకాలం పనిచేసిన భగత్‌సింగ్‌కు ఆ సమయంలోనే గణేశ్ విద్యార్థి, బటుకేశ్వరదత్ లాంటి విప్లవకారుల సహచర్యం లభించింది.

విప్లవం ద్వారా మాత్రమే స్వాతంత్ర్యం సిద్ధించగలదని భావించిన భగత్‌సింగ్ 'నౌ జవాన్ భారత్ సభ'ను 1924లో స్థాపించారు. భగత్‌సింగ్, సుఖదేవ్, భగవతీచరణ్‌లు ఆ సమయంలో తమ రక్తంతో ప్రమాణపత్రంపై సంతకం చేశారు. అప్పుడే కాన్పూర్‌లో వరదలు రావడంతో, సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్న భగత్‌సింగ్‌కు చంద్రశేఖర్ ఆజాద్‌తో పరిచయం ఏర్పడింది. తరువాతి కాలంలో వారు ప్రాణస్నేహితులుగా మారారు. నౌ జవాన్ భారత సభ ద్వారా యువతను ఆకర్షించడమే కాకుండా వారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. చిన్నతనంలో ఐరోపా విప్లవ ఉద్యమాల గురించి చదివి అరాజకవాదం, సామ్యవాదాలకు ఆకర్షితుడయ్యాడు. ఈ స్ఫూర్తితో హిందూస్థాన్ గణతంత్ర సంఘంలో ముఖ్య నాయకుల్లో ఒకడుగా ఎదిగారు. ఆ తర్వాత ఈ సంస్థను హిందూస్థాన్ సామ్యవాద గణతంత్ర సంఘంగా మార్చారు. రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జైలులో 64 రోజుల నిరాహారదీక్షను చేపట్టడం ద్వారా భగత్‌సింగ్ అఖండ భారతావని మద్దతును కూడగట్టుకున్నాడు. పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ మరణానికి కారణమైన పోలీస్ అధికారి స్కాట్స్ హత్యకు భగత్‌సింగ్ వేసిన పథకం విఫలమైంది. స్కాట్స్ అనుకుని మరో ఎస్ఐ సాండర్స్‌ను హత్య చేశారు. 1929 ఏప్రిల్ 8న పార్లమెంట్ హాల్‌లో పొగ బాంబు విసరడంతో భగత్‌సింగ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగిపోయింది. తమ స్వాతంత్ర్య కాంక్షను తెలియజేయడానికే బాంబు వేశాం తప్ప, ఎవరినీ హత్య చేయడానికి కాదంటూ ధైర్యంగా న్యాయస్థానంలోనే ఆయన ప్రకటించారు. భగత్‌సింగ్‌తో పాటు సుఖదేవ్, రాజ్‌గురులు కూడా ఈ దాడిలో పాల్గొన్నారు. పార్లమెంట్ హాల్లో మనుషులు లేని ప్రదేశంలో బాంబు విసిరి భారతీయుల మనోగతాన్ని తెలియజేయాలన్నదే ఈ వీరుల ప్రధానోద్దేశం. అయితే దీన్ని మాత్రం తీవ్రంగా పరిగణించిన బ్రిటిష్ ప్రభుత్వం విచారణ త్వరగా పూర్తిచేసి ఉరిశిక్షను అమలు చేసింది. తన కొడుకును కేసు నుంచి బయటపడేయడానికి భగత్‌సింగ్ తండ్రి చాలా ప్రయత్నించారు. అయితే తండ్రి ప్రయత్నాలను వారించిన భగత్‌సింగ్ దాని వల్ల ప్రయోజనం ఉండదని ఖండితంగా చెప్పాడు. మమ్మల్ని విడిచిపెట్టే ఉద్దేశం బ్రిటిష్ ప్రభుత్వానికి లేదు కాబట్టి దీనిపై దొంగ సాక్ష్యాలను సృష్టించి విచారణను వేగంగా పూర్తిచేయడానికి ఏర్పాటు చేస్తుందంటూ తెల్లదొరల అంతరంగాన్ని ముందే పసిగట్టి తండ్రికి తెలియజేశారు భగత్‌సింగ్.

> **బ్రిటిష్ పాలన అంతంకావాలని పరాయి పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టి 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ నాటి తరానికే కాదు, నేటి యువతకూ ఆదర్శం. ఉరికంబం ఎక్కడానికి ముందు కూడా తమ ముఖంలో చిరునవ్వు చెరగనివ్వని ఈ యోధులు, విప్లవం ద్వారా మాత్రమే స్వాతంత్రం సిద్ధించగలదని భావించిన దార్శనికులు.**



అనుకున్నట్టుగానే ఈ ముగ్గురు వీరుల్ని బ్రిటిష్ ప్రభుత్వం దోషులుగా నిర్ధారించి ఉరికంబం ఎక్కించింది. మార్చి 23న సెంట్రల్ జైలులో సాయంకాలం 7.33 గంటలకు విప్లవ వీరులను ఉరి తీశారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ఉరితాడును ముద్దాడి, ప్రాణత్యాగం చేశారు. నిబంధనల ప్రకారం ఆ సమయంలో ఉరి శిక్ష అమలు చేయకూడదు. అందుకే వారి మృతదేహాలను జైలు వెనుక గోడలు పగులగొట్టి రహస్యంగా తీసుకెళ్లి సట్లెజ్ నది తీరాన దహనం చేశారు. మృతదేహాలు ప్రజల కంటబడితే ఉపద్రవం ముంచుకొస్తుందనే ఇలా చేశారు. ఈ యువకిశోరాల త్యాగం ఎప్పటికీ వృథా కాదు. అమరవీరుల్లారా, ఎల్లవేళలా మీరు ప్రతి భారతీయ గుండెల్లో ఉంటారు.

■ నరేష్ జాటోత్

(నేడు షహీద్ దివస్)

కాళోజీ వర్సిటీని ప్రక్షాళన చేయరూ..

ఆరోగ్య విశ్వవిద్యాలయానికి సమస్యల జబ్బు



వీసీ నందకుమార్‌రెడ్డి

- పీజీ సీట్ల కేటాయింపులో అక్రమాలు
- దంత వైద్యుడికి కీలక బాధ్యతలు
- ప్రశ్నాపత్రాల తారుమారుతో అప్రతిష్ట
- రిటైర్డు ఉద్యోగులకు పునరావాస కేంద్రంగా వర్సిటీ!
- పీఆర్‌వో, గ్రీవెన్స్ ఏమైనట్లో?
- కొత్త వీసీ నందకుమార్‌రెడ్డి పరిస్థితులను గాడిలో పెట్టేనా?
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఎదురుచూపు

వరంగల్ మెడికల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నూతన ఉప కులపతికి ఇవి స్వాగతం పలుకుతున్నాయి. పదేళ్లగా విశ్వవిద్యాలయం అనేక సమస్యలతో సతమతమవుతోంది. చివరికి పరీక్షల నిర్వహణలో కూడా అభాసుపాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి. విశ్వవిద్యాలయంలో ఒక వర్గం కోటరీగా ఏర్పడి పెత్తనం చెలాయిస్తున్నట్లు బహిరంగంగానే విమర్శలు ఎదుర్కొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు కొన్నేళ్లుగా అనేక కష్టాలు ఎదుర్కొన్నారు.

పర్యవేక్షణ లోపమే కారణం

గత ప్రభుత్వం 2016 నుంచి ఆరోగ్య విశ్వవిద్యాలయం పర్యవేక్షణ చేయకపోవడంతో పాలన గాడి తప్పిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. విశ్వవిద్యాలయంలో 150 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, కేవలం 20 మంది రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 15 మంది జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఒక రిజిస్ట్రార్ ఉన్నారు.

పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తం

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎంబీబీఎస్, పీజీ పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పాత ప్రశ్నపత్రాలు తిరిగి ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. నిర్ణీత షెడ్యూల్‌లో పరీక్షలు నిర్వహించడం, ఫలితాలు ఇవ్వడంలో యూనివర్సిటీ వైఫల్యం ఎదుర్కొంది. సర్టిఫికెట్ల జారీలో కూడా జాప్యం జరుగుతోంది. ఇక సర్టిఫికెట్లలో తప్పులు జరిగితే సరిద్దేందుకు చుక్కలు కనబడాల్సిందేనని విద్యార్థులు వాపోతున్నారు.

పీజీ సీట్ల కేటాయింపులో అక్రమాలు

పీజీ సీట్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు కొన్నేళ్లుగా వస్తున్నాయి. ఇందుకు 2022లో జరిగిన గోల్‌మాల్ ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) విచారణ చేపట్టగా విశ్వవిద్యాలయంలో కొందరు అధికారులు సహకరించడం లేదని ప్రచారం జోరుగా సాగుతోంది.

హెల్ప్‌లైన్ సెంటర్ అవసరం

వివిధ అవసరాల నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులకు గ్రీవెన్స్‌సెల్ లాంటి హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం కాళోజీ విశ్వవిద్యాలయంలోనికి కూడా అనుమతించరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ఆరోగ్య విశ్వవిద్యాలయానికి పీఆర్‌ఓ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

పునరావాస కేంద్రంగా యూనివర్సిటీ

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉద్యోగ విరమణ పొందిన వారికి, ఫారిన్ సర్వీసెస్‌పై వచ్చే ఉద్యోగులకు పునరావాస కేంద్రంగా మారింది. ఫలితంగా వారిలో జవాబుదారీతనం లోపించడంతో వైద్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి.. ఎగ్జామినేషన్ కంట్రోలర్‌గా నియమించి

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో దంత వైద్య విభాగంలో హెచ్‌ఓడీగా పని చేస్తున్న డాక్టర్ మల్లేశ్వర్‌ను కాళోజీ విశ్వవిద్యాలయానికి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చి ఎగ్జామినేషన్ కంట్రోల్‌గా నియమించారు. ఇది నిబంధనలకు వ్యతిరేకమైనా అప్పటి కోటరీలో భాగంగా అందరినీ పక్కన పెట్టి నియామకం చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంబీబీఎస్, పీజీ చేసిన వైద్యులను మాత్రమే నియమించాల్సి న ఈ కీలకపోస్టులో దంత వైద్యుల నియా మకం వెనుక అంతర్యం ఏమిటో ఎవరికీ అంతు చిక్కడం లేదు. పైగా ఈ అధికారే ఫైనాన్స్ అధికారిగా కూడా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ప్రక్షాళన చేయాలి..

సమస్యలతో సతమతమవుతున్న కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని నూతన వీసీ డాక్టర్ నంద కుమార్‌రెడ్డి ప్రక్షాళన చేయాలని వైద్య విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. జవాబుదారీతనం సిబ్బందిలో లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విశ్వవిద్యాలయంలోనికి అనుమతించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పారదర్శకమైన పాలన కోసం వివిధ సమస్యలపై విశ్వవిద్యాలయానికి వచ్చే వారిని లోనికి అనుమతించాలని వైద్య విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా పాలక కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): క్షయ వల్ల కలిగే పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతీ విద్యార్థిపై ఉందని, టీబీ మహమ్మారిని అంతం చేయడానికి కృషి చేయాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. శనివారం హనుమకొండలోని ప్రభుత్వ ఛాతి, టీబీ హాస్పిటల్ సెమినార్ హాలులో అడ్వకసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా టీబీ వల్ల ఏటా 4వేల మంది ప్రాణాలు కోల్పోతుండగా, ఏటా 2800 మంది మహమ్మారి బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోందన్నారు. క్షయవ్యాధికి లింగ వివక్ష ఉండదని ఎవరికైనా సోకుతుందన్నారు. కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సంపూర్ణ సురక్ష కేంద్రం ఆవశ్యకతను బాధితులకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. సెక్స్ వర్కర్లకు ఉచిత పరీక్షలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. టీబీ హాస్పిటల్ ఉన్న ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమం లో సూపరిం టెండెంట్ డాక్టర్ పంతం సునీత, జీఎంహెచ్ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మీ, డీటీసీఓ హిమ బిందు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీల్‌దత్,దివ్య, మెడికల్‌ఆఫీసర్ శ్రీనివాస్, సౌమ్యా, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నకిలీ, కాలం చెల్లిన పురుగుమందుల డబ్బాలు, నిందితులను చూపుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

నకిలీ పురుగులమందుల విక్రయ ముఠా అరెస్టు

- ఐదుగురి అరెస్టు, ఒకరు పరార్, మరొకరు ఇప్పటికే జైలులో..
- రూ.78.63లక్షల మందులు స్వాధీనం
- నిందితులపై పీడీ యాక్టు నమోదుకు చర్యలు
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

6

సహకార సంఘాల పట్ల చైతన్యం కలిగించాలి

జిల్లా సహకారాధికారి సంజీవ రెడ్డి

హనుమకొండ, మార్చి22 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘ సభ్యులకుసహకార సంఘాలపై అవగాహన, చైతన్యం కల్పించాలని జిల్లా సహకారాధికారి బి.సంజీవరెడ్డి అన్నారు.ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరం ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోనిజిల్లా సహకారాధికారి కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా సహకారాధికారి బి.సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సహకార సంఘాలు స్వయం సహాయం, పెట్రోల్ పంపులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణలో పాలుపంచుకునేలా ప్రోత్సహించాలని కోరారు. మహిళా సహకార సంఘాల్లోని మహిళలు సామాజికంగా, ఆర్థికంగా సాధికారత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సహకార ఆడిట్ అధికారి కె.కోదండరాములు మాట్లాడుతూ.. సహకార సంఘాల మధ్య సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కల్పలత సూపర్ బజార్ ఎం.డి. జగన్‌మోహన్‌రావుమాట్లాడుతూ.. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని సహకార సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కేసీటీసీ ప్రిన్సిపాల్ యాకూబ్ నాయక్, హ్యాండ్లూం డెవలప్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్‌రావు, విజయాడెయిరీ, మత్స్య పారిశ్రామిక, పశు సంవర్థక, అబ్కారీ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో సంజీవరెడ్డి

సౌరశక్తితో ఆదాయ వనరుల పెంపు

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సౌర శక్తిని ఉత్పత్తి చేసి తద్వారా ఆదాయం పెంచుకునే సువర్ణావకాశం ఉందని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. పీఎం కుసుమ పథకం కింద సోలార్ పవర్ ప్లాంట్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు శనివారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈ కార్యాలయాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. దరఖాస్తుదారులతో సీఎండీ హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. సోలార్ ద్వారా ఉత్పత్తి చేసిన ప్రతీ యూనిట్ రూ.3.13 ఇస్తామని, ప్రతీనెల రైతు ఖాతాలో జమ చేస్తామన్నారు. అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద రెండు కోట్ల వరకు 6 శాతం వడ్డీతో షెడ్యూల్డ్ బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు.

దరఖాస్తు చేసుకున్న రైతులు ఈనెల 28 వరకు రూ.లక్ష పూచీకత్తు సొమ్మును డిపాజిట్ చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పూచీకత్తు సొమ్ము తిరిగి చెల్లిస్తామన్నారు. 25 ఏళ్ల అగ్రిమెంట్‌తో రైతులు లాభాలతో కూడిన నిలకడ ఆదాయం పొందొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఈలు వెంకటరమణ, రాజు చౌహాన్, జీఎంలు మల్లికార్జున్, టీజీ రెడ్కో డీజీ యం.వెంకటరమణ పాల్గొన్నారు.

రెండో రోజూ పది పరీక్ష ప్రశాంతం

- విధుల్లో ఇద్దరు ఉపాధ్యాయుల అలసత్వం
- వరంగల్ కలెక్టర్ ఆదేశాలతో సస్పెన్షన్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం నిర్వహించిన హిందీ పరీక్షకు వరంగల్ జిల్లాలో 9,224 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 9,208 మంది హాజరు అయ్యారు. 16 మంది విద్యార్థులు గైర్హాజరవగా మొత్తంగా 99.83 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. హనుమకొండ జిల్లాలో 11,971కిగాను, 11,967 హాజరయ్యారు. 4గురు గైర్హాజరవగా మొత్తంగా 99.97 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రాష్ట్ర పరిశీలకుడు ఎస్.శ్రీనివాసచారి వివిధ కేంద్రాలను సందర్శించి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. డీఈవోలు జ్ఞానేశ్వర్, వాసంతి పలు కేంద్రాలను సందర్శించి విద్యార్థులను పరీక్షలు రాస్తున్న తీరును అడిగి తెలుసుకున్నా రు. రెండు జిల్లాల్లో నాలుగేసి తనిఖీ బృందాలు వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. మొత్తానికి రెండోరోజు హిందీ పరీక్ష ప్రశాతంగా ముగిసినట్లు వారు పేర్కొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలు

పదో తరగతి పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉపాధ్యాయులు మూల్యం చెల్లించారు. శుక్రవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షల్లో తొలి రోజు వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ధర్మారం జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో సీఎస్, డీవోలుగా విధులు నిర్వర్తిస్తున్న హెడ్మాస్టర్ పి.రవీందర్, స్కూల్ అసిస్టెంట్ ఎం.డి. జలీల్‌లను పరీక్షల విధుల నుంచి తొలగించడమే కాకుండా సస్పెండ్ చేశారు. పరీక్షల మొదటి రోజు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన క్రమంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీరిద్దరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా డీఈవోను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హెడ్మాస్టర్ రవీందర్‌ను ఆర్జేడీ, స్కూల్ అసిస్టెంట్ జలీల్‌ను డీఈవో సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సస్పెన్షన్ విషయాన్ని డీఈవో జ్ఞానేశ్వర్ గోప్యంగా ఉంచడాన్ని ఉపాధ్యాయవర్గాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

అంగన్వాడీ కేంద్రాల్లో పనులను పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి22(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం అంగన్వాడీ కేంద్రాల భవనాల లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్ మరమ్మతు పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రాలలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, ఇతర వసతుల కల్పనకు సంబంధించిన పనుల పురోగతి, పనులను పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత శాఖల అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులపై డాక్యుమెంట్ చేయాలని ముగ్గురు సీడీపీఓలను ఆదేశించారు. పురోగతిలో ఉన్న పనులను వేగవంతం చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఆలస్యం చేయకుండా పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో మరమ్మతులు, కనీస సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందజేస్తే నిధులు మంజూరు అవుతాయన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఇతర శాఖల అధికారులు, సీడీపీఓలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

మిషన్ వాత్సల్య పథకంపై సమీక్ష

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి అర్హుల ఎంపికై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శనివారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో 216మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు తెలిపారు.పథకానికి 7కేటగిరిలలో ఎంపిక చేశామని, ఎంపిక ప్రక్రియ గ్రామస్థాయిలో అంగన్వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ప్రాజెక్టు స్థాయిలో ఐసీడీఎస్ సీడీపీఓ సూక్ష్మప రిశీలన, సామాజిక దర్యాప్తు నివేదిక అనంతరం నివేదికను, సంబంధిత అర్హులను బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టి, జిల్లాస్థాయి స్పాన్సర్ షిప్ కమిటీ ఆమోదించగా అర్హులను ఎంపిక చేశామని ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడు తూ.. మిషన్ వాత్సల్య పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అర్హులైన వారిని గుర్తించి ఈ పథకానికి ఎంపిక చేశారా? అని అడిగారు. ఎంపిక చేసిన జాబితాలో తల్లిదండ్రు లు లేని బాలబాలికలకు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రులు, తల్లి లేదా తండ్రి, ఇద్దరు వదిలేయగా సంరక్షకు ల వద్ద ఆశ్రయం పొందుతున్న వారికి, వితంతు మహిళలు, రక్షణ సంరక్షణ విద్యా వైద్య పోషకాహార అవసరాలు ఉన్న బాలబాలికలను గుర్తించి అర్హులుగా ఎంపిక చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీ పురుగుమందుల విక్రయ ముఠా అరెస్టు

- ఐదుగురి అరెస్టు, పరారీలో ఒకరు, మరొకరు జైలులో ..
- రూ.78.63 లక్షల మందులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గడువు తీరిన వాటితో పాటు నకిలీ పురుగుమందులను విక్రయిస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. నిందితుల నుంచి రూ.78లక్షల 63వేల విలువ గల నకిలీ పురుగుల మందులు, విత్తనాలు, మందులు తయారీ చేసే మిషన్, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ ముఠా సభ్యుల వివరాలను వెల్లడించారు. మట్టెవాడ బొడ్రాయి ప్రాంతంలో ఇరుకుళ్ల వేదప్రకాశ్ ఇంట్లో నకిలీ పురుగుల మందులు భారీగా నిల్వ చేశారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులతో పాటు వ్యవసాయాధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. అక్కడ పెద్ద మొత్తంలో నకిలీ పురుగుల మందులను స్వాధీనం చేసుకొని వేదప్రకాశ్‌ను పోలీసులు విచారించారు.

విచారణలో వేదప్రకాశ్ సులువుగా డబ్బు సంపాదించేందుకు స్థానిక



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వ్యాపారుల వద్ద గడువు తీరిన పురుగుల మందులను కొనేవాడు. వరంగల్ లక్ష్మీపురానికి చెందిన పురుగుల మందుల కంపెనీ ప్రతినిధి సిద్దిక్ వద్ద గడువు తీరిన పురుగుల మందులతో పాటు ప్రకాశం జిల్లా మడుగుకు చెందిన ఆళ్లచెరువు శేఖర్, విష్ణువర్ధన్‌ల నుంచి ప్రముఖ కంపెనీలైన దునూక, టాటా, రైల్స్, బెయర్, అడ్మాతో పాటు మరికొన్ని కంపెనీల పేర్లతో తయారు చేసిన నకిలీ మందులు కొనుగోలు చేసేవాడు. ఇలా కొనుగోలు చేసిన నకిలీ, గడువు తీరిన మందులను కరీంనగర్‌కు చెందిన యల్లం సదాశివుడు, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలానికి చెందిన ఎం.డి. రఫీక్, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన నూక రాజేష్, హైద్రాబాద్‌కు చెందిన ముద్దగుల ఆదిత్య, వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన పొదిళ్ల సాంబయ్యలకు విక్రయించేవాడు. వాళ్లు మార్కెట్‌లో రైతులను నమ్మించి అంటగట్టే వారు. కాగా, ఈ దందాలో పాల్గొన్న ఇరుకుల్ల వేదప్రకాశ్, సిద్దికీ, నూక రాజేష్, రఫీక్, ఆళ్లచెరువు శేఖర్‌లను అరెస్టు చేయగా విష్ణు వర్ధన్ పరారీలో ఉన్నాడని సీపీ పేర్కొన్నారు. అలాగే ముఠాలో ప్రధాన నిందితుడైన వేదప్రకాశ్‌పై కరీంనగలో 3 కేసులు ఉన్నాయ న్నారు. నూక రాజుపై వరంగల్ పోలీస్‌కమిషనరేట్‌లో 8 కేసులు, సదాశివుడిపై గీసుగొండలో కేసు నమోదైందన్నారు. అదే విధంగా ఆదిత్యపై కేసు నమోదు కాగా ప్రస్తుతం హైదరాబాద్‌లో జైలులో ఉన్నా డని సీపీ తెలిపారు. నిందితులు ఇలాంటి దందాలు చేసేందుకు వీలు లేకుండా పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పరిమితమయ్యేలా చేస్తామ న్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీలు మధు సూదన్, నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్ గోపి, రాజు, ఎస్సైలు వంశీకృష్ణ, నవీన్, ఆర్ఎస్సై భానుప్రకాశ్, ఏఏఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్స్ సురేశ్, సురేందర్, సాంబరాజు, శ్రీనువాస్, సతీష్‌కుమార్, నాగరాజులను సీపీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను అందజేశారు.



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారు ఆభరణాలతో సీపీ, అధికారులు

పోలీసులకు చిక్కిన ముగ్గురు చైన్ స్నాచర్లు

- ఒకరి నుంచి 77.750 గ్రాముల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, కాజీపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఒకరి నుంచి రూ.4 లక్షల 90 వేల విలువ చేసే 77.750 గ్రాముల బంగారం, మరో ఇద్దరి నుంచి రూ.15వేల విలువ చేసే బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.

హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీలో ఈనెల 11న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి పుస్తెలతాడు లాక్కొని పరారుకాగా, సీసీఎస్, స్థానిక పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేయగా వరంగల్ కోటకు చెందిన ల్యాండ్రీ షాపు నిర్వహించే చాపర్తి రాజేశ్ అని తేలింది. శనివారం ఉదయం పెద్దమగడ్డ ఏరియాలో సంచరిస్తున్నాడనే సమాచారం మేరకు ఆదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు ఇదే తరహాలో గతంలో కేయూసీ పరిధిలో రెండు, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో ఒకటి చొప్పున చైన్ స్నాచింగ్ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి సీసీఎస్ పోలీసులు రూ.4 లక్షల 75 వేల విలువ చేసే బంగారంతో పాటు రూ.పది వేలు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీపీ తెలిపారు. అదేవిధంగా కాజీపేట పీఎస్ పరిధిలో ఈనెల 21న ఐనవోలుకు చెందిన ఆటోడ్రైవర్ తాళ్లపల్లి సంపత్‌కుమార్, నడికూడకు చెందిన చుక్క మురళి కిరాణంలో షాపులో బిస్కెట్లు కొనుగోలు చేస్తున్నట్లుగా నటించి షాపు యజమానురాలి మెడలోని రోల్డ్‌గోల్డ్ గొలుసును లాక్కొని అక్కడి నుంచి ఆటోలో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులను కాజీపేట ఫాతిమా సెంటర్‌లో అరెస్టు చేసి రోల్డ్‌గోల్డ్ గోలుసుకు ఉన్న సుమారు రూ.15 వేల విలువ గల 2.750 గ్రాముల బంగారంతో పాటు ఆటో, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. ఈసమావేశంలో సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా, క్రైం డీసీపీ జనార్ధన్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, తిరుమల్ సీఐలు సతీష్, బాలాజీ వరప్రసాద్ పాల్గొన్నారు.

చోరీ చేసిన డ్రైవర్ అరెస్టు

కారు యజమానిని నమ్మించి కారులోని రూ.8లక్షల నగదును దొంగలించిన కారు డ్రైవర్ కార్తీక్‌ను కేయూసీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సీపీ శనివారం వివరాలు వెల్లడించారు. హోటల్ వ్యాపారం చేసే హైద్రాబాద్‌కు చెందిన స్వాతి కిరణ్ వద్ద కర్నాటక చెందిన కార్తీక్ రెండేళ్లుగా కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 18న తన వ్యాపార భాగస్వామి అయిన గూడమల్ల వినయ్‌కుమార్‌తో కాజీపేటకు వచ్చారు. రాత్రి సేదతీరేందుకు కేయూ పీఎస్ పరిధిలో ఓ హోటల్‌కు వచ్చారు. ఈ క్రమంలో భోజనానికి వెళ్తున్నాని చెప్పిన డ్రైవర్.. కారులో భద్రపరిచిన రూ.8 లక్షలు తీసుకొని పారిపోయాడు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని హైద్రాబాద్‌లోని వనస్థలిపురంలో శనివారం ఆదుపులోకి తీసుకొని అరెస్టు చేశామని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ సీఐ రవికుమార్, ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

నిఖార్సైన రాజకీయాలతోనే దేశ సమగ్రాభివృద్ధి

- కాకతీయ వర్సిటీ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- ముగిసిన రాజనీతిశాస్త్ర జాతీయ సదస్సు



రాజనీతిశాస్త్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, శ్రీనివాసులు, వెంకట్ తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిఖార్సైన రాజకీయాలతోనే దేశ సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో రెండు రోజులు 'భారత సమాజంలో సంక్లిష్ట ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై జరిగిన సదస్సు ముగిసింది. కేయూ సెనెట్ హాల్‌లో రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయాలు నిస్వార్థంగా ఉండాలన్నారు. భారతదేశ వైవిధ్యభరితమైన సమాజానికి సంకీర్ణ రాజకీయాలు అవసరమన్నారు. మంచి సమాజానికి రాజనీతిశాస్త్ర విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు దిశానిర్దేశం చేయాలన్నారు. మానవ సమాజాన్ని నిర్వచించడం కష్టతరమన్నారు. రాజకీయాలను శాస్త్రీయ దృక్పథంలో అధ్యయనం చేసి విశ్లేషించాలన్నారు. సంకీర్ణ రాజకీయాలు ప్రజల ఐక్యతకు ప్రతీక అని అభివర్ణించారు

ఉస్మానియా వర్సిటీ సోషల్ సైన్స్ రిటైర్డు ప్రొఫెసర్, ఐసీఎస్ఎస్ఆర్ సీనియర్ ఫెల్లో ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఏకపార్టీల్లో అధికారం కేంద్రీకరణ, సంకీర్ణ ప్రభుత్వాల్లో అధికార వికేంద్రీకరణ జరుగుతోందన్నారు. సంకీర్ణ రాజకీయాల్లో శాసన, న్యాయ, కార్యనిర్వాహక శాఖల అధికారులకు రక్షణ లభిస్తోందన్నారు. ఏక పార్టీ పాలనలో సీబీఐ, ఈడీ, ఎలక్షన్ కమిషన్‌తో పాటు ఇతర రాజ్యాంగ బద్ధమైన సంస్థలు కీలుబొమ్మలుగా మారే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపద పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళుతోందని చెప్పారు. సంపద, అధికారం ప్రజలందరికీ చెందాలని, లేకపోతే సంక్షోభం తలెత్తే ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడి అభివృద్ధివైపు నడిపించాలే కానీ శక్తిహీనులుగా మార్చొద్దన్నారు. రాజకీయాల్లో సత్‌విమర్శలుండాలని పేర్కొన్నారు. అసభ్యకరమైన భాష మంచిది కాదన్నారు.

ఇంకా సదస్సులో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ యూజీసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, మద్రాస్ వర్సిటీ రాజనీతిశాస్త్ర ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడారు. వ్యాసాల పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రొఫెసర్లు, స్కాలర్లు, విద్యార్థులు పలు అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సదస్సులో బీవోఎస్ చైర్మన్ డాక్టర్ జి.కృష్ణయ్య, రిటైర్డు ప్రొఫెసర్ జి.వీరన్న, హరిప్రసాద్, సత్యనారాయణ, నాగరాజు, లక్ష్మినారాయణ, లలితకుమారి, సంజీవ్, విజయ్‌కుమార్, సునీల్, భాగ్యమ్మ, కల్లెపల్లి ప్రశాంత్, అంకిళ్ల శంకర్, రుబీనా, సోమలింగం, సురేశ్, రఘురాంరెడ్డి, మాధవి, డాక్టర్ మామిడి లింగయ్య, పాలమాకుల కొమురయ్య, డాక్టర్ వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ ప్రతిష్టను పెంచాలి

వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కేయూ ప్రతిష్టను చాటేందుకు సరైన వేదికగా నిలిచే యూత్ పార్లమెంట్‌కు ఎంపికై వర్సిటీ పేరు నిలపాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కేయూ కామర్స్ సెమినార్ హాల్‌లో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ అధ్యక్షతన జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు యువత ముందుకు రావాలని కోరారు. యూత్ పార్లమెంట్ కార్యక్రమం యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తోందన్నారు. శాస్త్రీయ దృక్పథంతో పాటు టెక్నాలజీ, సామాజిక న్యాయాన్ని సమన్వయం చేసుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు. ప్రిన్సిపాల్ మనోహర్ మాట్లాడుతూ.. యువత సమాజానికి మార్గనిర్దేశకులుగా నిలవాలని అన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. యూత్ పార్లమెంట్‌లో దేశవ్యాప్తంగా వేలాది కళాశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. వర్సిటీ పరిధిలోని వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాల విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. సమావేశంలో క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్, శ్రీనివాస్, రాధిక తిప్పాని, యూత్ పార్లమెంట్‌కు ఎంపికైన యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

జనగామ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతులకు 50 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యంత్రీకరణలో భాగంగా మహిళా రైతులకు ఎస్ఎంఎఎం పథకం ద్వారా పనిముట్లు అందించడం జరుగుతుందన్నారు. బ్యాటరీ పం పులు, లైవాన్ పంపులు, రోటవేటర్లు, విత్తనాలు నాటే మిషన్లు, కేజీ వీల్స్, కలుపు తీసే యంత్రాలు, గడికట్టె యంత్రాలు, డ్రోన్లు, ట్రాక్టర్లు, నగలి, పవర్ టిల్లర్ పరికరాలు మంజూరు కావడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన రైతులు సంబంధిత కంపెనీలకు రాయితీ పోను మిగతా డబ్బులు డీడీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. నేటి నుంచి దరఖా స్తులను స్వీక రించాలని మండల వ్యవసాయ అధికారులను సూచించడం జరుగు తుందని, ఈనెల 25 లోపు దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల నిర్వహణ భేష్

- ఆదర్శంగా అక్కపల్లిగూడెం గ్రామం
- ఎన్ఆర్ఈజీఎస్ డ్రాఫ్టింగ్ మెంబర్ జాన్ డ్రీజ్



అక్కపల్లిగూడెంలో కొబ్బరి మొక్కను పరిశీలిస్తున్న జాన్ డ్రీజ్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల నిర్వహణ అద్భుతంగా ఉందని, పనుల వినియోగంలో అక్కపల్లిగూడెం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని ఎన్ఆర్ఈజీఎస్ డ్రాఫ్టింగ్ మెంబర్, ఎకనా మిస్ట్, రాంచీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాన్‌డ్రీజ్ ప్రశంసించారు. శనివారం అక్కపల్లిగూడెంలో ఎన్ఆర్ఎజీఎస్‌లో భాగంగా జరిగిన అభివృద్ధి పనులను పంచాయతీ సెక్రటరీ భారత అవినాష్‌తో కలిసి పర్యవేక్షించారు. ఐదేళ్లలో నిరుపయోగంగా ఉన్న సుమారు 15 ఎకరాలను ఉపాధి పథకం పనులతో సాగులోకి తేవడం అభినందనీయమన్నారు. ఝార్ఖండ్ రాష్ట్రంలో ఉపాధి పనులు కాంట్రాక్టర్లు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోరిక మేరకు ఓపెన్‌వెల్ బావులను ఏర్పాటు చేయడానికి ఎస్టిమేషన్స్ సంబంధిత డిపార్టుమెంట్ ద్వారా తయారు చేయించి అమలులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పెండ్లి రమేష్, కుమారస్వామి, పెండ్లి రాజు, అనుమల యాకన్న, బొమ్మగల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆర్ఎం విజయభాను, ఆర్టీసీ అధికారులు

ఆర్టీసీ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలి

వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను

హనుమకొండ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రీజినల్ పరిధిలోని 9 డిపోల పరిధిలో పనిచేస్తున్న ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది వేసవిలో జాగ్రత్తలు పాటించాలని రీజినల్ మేనేజర్ డి.విజయభాను సూచించారు. శనివారం హనుమకొండ బస్టాండ్‌లోని రీజినల్ కార్యాలయంలో వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై కరపత్రాన్ని హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరమ్‌సింగ్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ.. డ్రైవర్లు, కండక్టర్లు క్రమం తప్పకుండా విధులు నిర్వర్తిస్తూ వారి ఆరోగ్యంపై పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిపో మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆర్ఎం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, అధికారులు రవీందర్‌రావు, పి.అర్పిత, డీఎంలు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

నేడు గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు

దామెర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం(జేబీడీ) ఆధ్వర్యంలో ఆదివారం గో ఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జేబీడీ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సరికొండ తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో సరికొండ తిరుపతిరావు విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9గంటలకు హనుమకొండ జిల్లా దామెర మండలం దుర్గంపేట శివారులోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో గోఆధారిత వ్యవసాయంపై అవగాహన సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో వినూత్న రీతిలో పంట ఉత్పత్తులను సాగుచేస్తున్న పలువురు ఆదర్శ రైతులకు ఉగాది పురస్కారాలను అందచేయనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త లోపెల్లి జలపతిరావు, గౌరవ అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కాగా, రైతులకు అవసరమైన సేంద్రియ, సహజ, గో ఆధారిత, స్వదేశీ, గ్రామీణ, చేతి వృత్తుల తయారీదారులు ఎవరైనా ఉచితంగా స్టాల్స్ ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లోని ఆసక్తి కలిగిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అవగాహన సదస్సును విజయవంతం చేయాలని తిరుపతిరావు కోరారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెం డెంట్ జి.వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాం తీయ ఆస్పత్రి, పాలకుర్తి, జఫర్‌గడ్, బచ్చన్న పేట సామాజిక ఆరోగ్య కేంద్రాలలో గైనకాలజీ, పిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మత్తు, నేత్ర వైద్యులకు సంబంధిత విభాగంలో అర్హత కలిగిన వైద్యుల నుంచి, సీఏఎస్/జీడీఎంవో కొరకు ఎంబీబీఎస్ అర్హత గల వారిని కాంట్రాక్టు పద్ధతిలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత గలవారు ఈనెల 26 లోగా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్టు)కు నెలకు రూ.లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌కు, జీడీఎంవోకు రూ.52,351 వేతనం ఉంటుందని వెల్లడించారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధికి..

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ బి.విక్రమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థికసాయం కోసం అర్హులైన వారు ఏదైనా నాలుగు సంవత్సరాల డిగ్రీ చదివిన లేక చివరి సంవత్సరం చదువుతున్న వారి నుంచి దరఖాస్తులను అహ్వానించడం జరుగుతుందన్నారు. అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా మొదలుగు దేశాలలో ఉన్నత చదువు చదివేందుకు వెళ్లేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం ,చేసుకోవాలన్నారు. అభ్యర్థులు జీమార్కు, గ్రీ ఇంగ్లీష్ ప్రొఫైసిన్సీ టెస్ట్ పాసు ఉండాలని వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 5లక్షల లోపు కలిగి ఉండాలన్నారు.

యువ వికాసం కోసం..

- రాష్ట్ర ప్రభుత్వ కొత్త పథకంపై యువత ఆసక్తి
- దరఖాస్తు విధానంపై అవగాహన లేక అవస్థలు
- కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం పరుగులు
- ఎనిమిదేళ్లుగా కార్పొరేషన్ రుణాల కోసం బీసీ యువత ఎదురుచూపు

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు యువత ఆసక్తి చూపుతోంది. అయితే ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడంలో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 17న ప్రారంభమైన అప్లికేషన్ల ప్రక్రియ నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు కొనసాగనుంది. కానీ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు ఎదురవుతుండటంతో దరఖాస్తుదారులకు తిప్పలు తప్పడంలేదు. ఇక దరఖాస్తు విధానంపై ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ యువతకు అవగాహన కల్పించాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే దరఖాస్తుకు ఆదాయ, కుల ధ్రువపత్రాలు తప్పనిసరి కావడంతో తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు లక్షమంది యువతకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరననున్నట్టు అంచనా.

తహసీల్దార్ కార్యాలయాల వైపు పరుగులు

రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తుచేసుకునేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తప్పని సరి చేయడంతో యువత తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తు న్నారు. ముఖ్యంగా మీసేవా కేంద్రాల వద్ద యువత దరఖాస్తు చేసేందుకు బారులు తీరుతున్నారు. ఇదే అదనుగా కొందరు మీసేవా కేంద్రాల నిర్వాహ కులు సర్టిఫికెట్లు తొందరగా వచ్చేలా చేస్తామంటూ రూ.2వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.



రేషన్ కార్డుల్లో పేరు లేకపోతే ఎలా ?

రాజీవ్ యువ వికాసం పథకం ప్రభుత్వం రేషన్‌కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది యువత ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొంత మందికి ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరుచేయగా మరి కొందరివి వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో రేషన్ కార్డుల్లో పేరులేని వారి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. నూతన రేషన్ కార్డులు మంజూరుచేసిన తరువాతే ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

అవగాహనేదీ ?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన రాజీవ్‌యువ వికాస్ పథకంపై ప్రజలకు అవగా హన కల్పించడంలో అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారు. ప్రకటనలతో సరిపెడుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో పథకం ప్రాముఖ్యాన్ని వివరించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ,ఎస్సీఎస్టీ,మైనార్టీ యువతకు స్వయం ఉపాధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకొస్తే ఆయా సంక్షేమశాఖల అధికారులు ఇప్పటివరకు పథకం తీరుతెన్నులపై ప్రజలకు అవగాహన కల్పించింది లేదు. కుల సంఘాల ముఖ్యుల జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో కుల సంఘాలతో మమేకం అవుతున్న అధికారులు అవే కులాల్లోని యువతకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుంటే మాత్రం ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు శూన్యం. ఇప్పటికైన అధికారులు కుల సంఘాలతో సమావేశాలు నిర్వహించి పథకం అమలుపై అవగాహన కల్పించి అర్హులైన వారికి పథకం ద్వారా లబ్ధిచేకురేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎనిమిదేళ్లకు అవకాశం

బీసీ కార్పొరేషన్ రుణాలను గత ప్రభుత్వం నీరుగార్చడంతో కార్పొరేషన్ రుణాల ద్వారా స్వయం ఉపాధి పొందుదాం అనుకున్న బీసీ యువత ఆశాలు అడియాశాలయ్యాయి. 2023 ఎన్నికల ముంగిట బీసీల్లో కొన్ని కులాలకు రూ.లక్షపేరిట సాయం చేసే ప్రభుత్వం చేసిన అప్పటి ప్రభుత్వం.. ఆపథకం పూర్తి స్థాయిలో అమలుకాకపోవడంతో చాలా మందికి నిరాశే ఎదురైంది. దాదాపు ఎనిమిదేళ్లగా మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పేరిట స్వయంఉపాధి పథాకానికి అంకురార్పణ చేయడంతో బీసీ యువత పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకుంటున్నారు.

పథకానికి అర్హులు వీరే..

రాజీవ్ యువవికాసం పథకానికి రూ. 6వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం అర్హుల ఎంపికకు నిర్ధిష్ట విధానాలను ప్రకటించింది. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ యువకులను అర్హులుగా పేర్కొంటూ.. మూడు రంగాల్లో యువతను ప్రోత్సహించనుంది. వ్యవసాయం, పశుపోషణ, వ్యాపార రంగంలో స్వయం ఉపాధి పొందే యువతకు సాయం అందించనుంది. ఈపథకానికి ఎంపికైన యువకులు ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.4 లక్షల వరకు రుణాన్ని అందించనుంది. ఆ రుణాన్ని బట్టి 60 శాతం నుంచి 80 శాతం వరకు సబ్సిడీ భరిస్తోంది. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్‌కార్డ్, శాశ్వత నివాసం (డొమిసిల్), కులం, ఆదాయం సర్టిఫికెట్లు, బ్యాంక్ ఖాతా, రేషన్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఇక ఆన్‌లైన్‌లో https://tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలి. రేషన్‌కార్డులో ఒకరిని మాత్రమే పథకంలో అర్హులుగా

పండగలకు.. ధరల ఘాటు!

- మండుతున్న మామిడి, నూనె, కారం
- ఇదే బాటలో డ్రైఫ్రూట్స్, సేమియా, ముడి సరుకులు
- విపరీతంగా పెరిగిన పండ్ల ధరలు
- 30న ఉగాది, 31న రంజాన్ పండుగలు

మహబూబాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అసలే మార్చి.. మండుతున్న ఎండలకు తోడు.. నిత్యావసర సరుకుల ధరలూ సుర్రుమంటున్నాయి. నిత్యావసరాల్లో అతికీలకమైన బియ్యం, అల్లం, వెల్లుల్లి, కూరగాయల ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఈ నెల 30న తెలుగు సంవత్సరాది ఉగాది, 31న ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ జరుపుకోనుండగా సలసలా కాగుతున్న ధరలు దడపుట్టిస్తున్నాయి. నిత్యావసరాల్లో అతికీలకమైన బియ్యం, అల్లం, వెల్లుల్లి, కూరగాయల ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఈ నెల 30న తెలుగు సంవత్సరాది ఉగాది, 31న ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ జరుపుకోనుండగా సాధారణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తెలిసిన వారు లేదంటే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి.. చే బదులుగానో.. వడ్డీకో డబ్బులు సమకూర్చుకుంటున్న పరిస్థితి ఉంది. ముఖ్యంగా నూనెల ధర సలసలకాగుతున్నాయి. పామాయిల్ లీటర్ ధర రూ.130 కాగా, వివిధ బ్రాండ్ల లీటర్ నూనె ప్యాకెట్లు రూ.150కి తగ్గకుండా విక్రయిస్తున్నారు. మిల్లు నుంచి పల్లీనూనె ధర కిలోకు రూ.240 వరకు లభిస్తోంది. సన్‌ఫ్లవర్ మిల్లునూనె ధర రూ.350కు పైగానే విక్రయిస్తున్నారు. ఈ సారి అల్లం వెల్లుల్లి ధరలు కొంత మెరుగ్గానే కన్పిస్తున్నాయి. మార్కెట్‌లో కిలో అల్లం రూ.70 కాగా, ఎల్లిపాయలు మాత్రం రూ.120కి విక్రయిస్తున్నారు. ధనియాల ధర కిలో రూ.150 పలుకుతోంది. చింతపండు కిలో రూ.130, మెంతులు, అవాలు 100 గ్రాములకు రూ.20 చొప్పున లభిస్తున్నాయి. తెలుగు ప్రజలు ఉగాది వెళ్లగానే మామిడి పచ్చళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆలస్యంగా మామిడిపూత రావడం, పచ్చడి కాయలకు ఇంకా పలు ప్రాంతాల్లో పిక్క ముదరకపోవడం తదితర కారణాలతో అడపదడపా వస్తున్న మామిడి ధర మండిపోతోంది. ఎర్రమిర్చి కారం ధర రూ.150 నుంచి రూ.200 వరకు లభిస్తోంది.

రంజాన్ మాసం చివరాంకంలో..

దాదాపు నెలరోజుల పాటు ఉపవాసాల దీక్ష నిర్వహించే ముస్లింల రంజాన్ మాసం పూర్తి కావొస్తోంది. ఆకాశన్నింటిన ధరలతో నిత్యం విరివిగా వినియోగించే పండ్లు, ఫలహారాలు, డ్రైఫ్రూట్స్ సేమియాల ధరలతో పేద ప్రజలు వాటికి కొంత దూరమవుతున్నారు. ఇవి సామాన్య కుటుంబాలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. రంజాన్ అనగానే వివిధ రకాల పండ్లతో పాటు సేమియా పాయసంగా పిలుచుకునే షీర్‌ఖుర్మా అంటే తెలియని కుటుంబాలు ఉండవు. కటిక పేద ఇళ్లలో సైతం అందుబాటులోని తియ్యటి వంటకంగా సేమియా పాయసంపై ఆశలు పెంచుకుంటారు. కొన్నేళ్లుగా రేషన్ షాపుల్లో ఇచ్చే పంచదార ఎత్తేశారు. పూర్వంలో రంజాన్‌కు ముస్లీంల కోసం ప్రత్యేకంగా చెక్కర కోటా ఇచ్చేవారు. ఇది నాటి మాటగానే మిగిలిపోయింది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎంతఉన్నా.. కొనుక్కోక తప్పడం లేదు. ప్రస్తుతం కిలో పంచదార రూ.40కి పైనే పలుకుతోంది.

మండుటెండల్లో పండ్ల ధరల మంట..

ఉపవాసాల మాసం రంజాన్‌లో ఎక్కువగా తీసుకునే ఖర్జురా పండ్లతో పాటు వివిధ రకాల పండ్ల ధరలు కొండెక్కాయి. మండుటెండల్లో వేడి నుంచి ఉపశమనం కోసం ప్రతీ ఒక్కరు తీసుకునే వివిధ రకాల జ్యూస్‌లను సాధారణ ప్రజలు కొనే పరిస్థితి లేదు. ప్రధానంగా మార్కెట్‌లో విరివిగా లభించే నెంబర్ వన్ రకం ఖర్జూర ధర కిలో గతేడాది రూ.500 ఉండగా ప్రస్తుతం రూ.600కు పెరిగింది. కిమియా అరకేజీ బాక్స్ ధర రూ.350 ఉండగా రూ.450 పెరిగింది. సౌదీ ఖర్జూరం రూ.800 విక్రయిస్తున్నారు. మరికొన్ని బ్రాండెడ్ ఖర్జూరాలు రూ.600 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. రెగ్యులర్ ఖర్జూర ధర రూ.120కే కేజీ లభిస్తోంది. అరచేతిలో ఇమిడే చిన్నసైజు దానిమ్మపండు కేజీ రూ.100 లభిస్తోంది. చిన్న సైజు యాపిల్ రూ.110 నుంచి రూ.120కి నాలుగు వరకు ఇస్తున్నారు. చిన్న తెల్లద్రాక్ష కేజీ రూ.80, కాగా, సీడ్‌లెస్ నల్లద్రాక్ష రూ.200లకు కేజీ విక్రయిస్తున్నారు. అరటి పండ్ల ధరలు సైజును బట్టి డజనుకు రూ.80నుంచి 120కి విక్రయిస్తున్నారు. జామపండ్లు కేజీ రూ.50 నుంచి విక్రయిస్తున్నారు. పైనాపిల్‌ను సైజుల వారీగా కాయ రూ.70నుంచి రూ.80చొప్పున విక్రయిస్తున్నారు. పసుపు రంగు ఖర్బూజ కిలో రూ.60 నుంచి రూ.70 వరకు, వాటర్‌లెమన్ ఖర్బుజ కిలో రూ.25 నుంచి రూ.30 వరకు అమ్ముతున్నారు. బొప్పాయి కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య విక్రయిస్తున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న పండుగ ముడి సరుకులు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

ధరాభారంతో విక్రయాలు అంతంతే..



మహ్మద్ అబ్దుల్ రహీం, రంజాన్ సామగ్రి దుకాణం వ్యాపారి, మహబూబాబాద్

పెరిగిపోతున్న ధరలతో విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. రంజాన్ ప్రత్యేక దుకాణాలకు ముడిసరుకులు, డ్రైఫ్రూట్స్‌ను హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ విక్రయాలు చేపడుతున్నాం. గతేడాది పండుగతో పోలిస్తే పండుగ సమీపిస్తున్నా ఇంకా మార్కెట్ జోరందుకోలేదు. నెల చివర్లో పండుగ రావడంతో బాడుగ (ఉద్దెర) బేరాలు కొంత వర కు నడుస్తున్నాయి. లాభాల మాట అలా ఉంచితే తెచ్చిన సరుకులు అమ్ముడుపోతాయా.. లేదా అన్న సందేహం వస్తుంది.

షీర్ ఖుర్మా.. బిర్యానీ వంటకాల ధరలిలా..

రంజాన్ నెలరోజుల పాటు అతిప్రియంగా భుజించే సేమియా పాయసంగా పిలుచుకునే షీర్‌ఖుర్మాలో ముడి సరుకైన పిండితో చేసే సేమియాలు, డ్రైఫ్రూట్‌ల ధరలు పెరిగిపోయాయి. రోస్టెడ్ సేమియా కిలో రూ.150 విక్రయిస్తున్నారు. పెరిగిన రేట్లతో వైట్ సేమియా రూ.130కి విక్రయిస్తున్నారు. అహ్మదాబాద్ సేమియా రూ.160 నుంచి రూ.180కి పెరిగింది. హాల్‌హాల్ సేమియా రూ.180 నుంచి రూ.200 వరకు, పేనీ నెయ్యి సేమియా రూ.400కు అమ్ముతున్నారు. పాలు లీటర్ ధర రూ.80, పాయసంలో వేసే చిరంజి కిలో ధర గతేడాది రూ.1800 ఉండగా ప్రస్తుతం రూ.2500విక్రయిస్తున్నారు. జీడిపప్పు నెంబర్-1 కిలో రూ.900కు, బాదంపప్పు రూ.900, ఎండు ఖర్జూర రూ.500, కిష్‌మిస్ రూ.400, తర్బూజ గింజలు రూ.800, ఎండు కొబ్బరి రూ.400, పంచదార రూ.45, నెయ్యి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సేమియా పాయసం రుచి చూడకముందే ధరలతో పేదోళ్లకు చేదెక్కుతోంది. బిర్యానీ వంటకానికి వాడే ముడిసరుకుల్లో 100 గ్రాములకు ధరలు ఇలా ఉన్నాయి. జాజికాయ రూ.100, జాపత్రి ధర రూ. 300, అనాసపువ్వు రూ.100, మరాటి మొగ్గ రూ.60కి, ఇలాచి రూ.400, లవంగాలు రూ.100, దాల్చిన చెక్క రూ.60, సాజీరా రూ.110, బాస్మతి రైస్ కేజీ రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు.

సంప్రదాయ పండితుడు లక్ష్మణమూర్తి

- పెరుంబుదురు అస్తమయంపై సాహితీలోకం దిగ్భ్రాంతి
- నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు



లక్ష్మణమూర్తి (ఫైల్)

హనుమకొండ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ సంప్రదాయ పండితుడు, బహుభాషా గ్రంథకర్త కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆంగ్లశాఖలో ఆచార్యుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన శ్రీ పెరుంబుదురు లక్ష్మణమూర్తి (85) ఇక లేరన్న వార్త ఓరుగల్లు సాహితీలోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయనకు భార్య డాక్టర్ జయశ్రీ ఏవీవీ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని చిన్న కుమార్తె వద్ద ఉంటున్న ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిశారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో 1940 జూలై 20న జన్మించినా.. ఉద్యోగపర్వమంతా సుమారు మూడున్నర దశాబ్దాలపాటు కాకతీయ విశ్వవిద్యాలయంలో కొనసాగడంతో హనుమకొండ విద్యారణ్యపురిలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. వైష్ణవ సంప్రదాయం, వైదిక ధర్మాసక్తి, సాంస్కృతిక భాషకు ఆవాసమైన పండిత కుటుంబంలో జన్మించడం వల్ల ఆయన చిన్నప్పటి నుంచే తెలుగుభాషతోపాటు ఆంగ్లం, సంస్కృత భాషల్లోనూ అపార పాండిత్యాన్ని కలిగి ఉండేవారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు ఈయన ఆత్మీయ శిష్యుడు. కేయూలో ఆంగ్ల జర్నల్‌కు సంపాదకుడిగా పనిచేశారు.

శ్రీకృష్ణుడి మీద భక్తిప్రపత్తులతో గోపిక వల్లభ శతకంతోపాటు ఇతర భాషాల్లోనూ అనేక గ్రంథాలను ప్రకటించారు. తెలుగు తెలియని విదేశీయులు ఎవరొచ్చినా అద్భుత అనువాదకుడిగా లక్ష్మణమూర్తి వ్యవహరించేవారు. స్వామి వివేకానంద అంటే ఆయనకు అపారమైన భక్తిభావం. తన శిష్యులందరికీ వివేకానందుడి బోధనలు అనుసరించేలా మార్గదర్శనం చేసేవారు. రామాయణ, భాగవత, భగవద్గీత ఉపనిశత్తులపై సాధికారికంగా అనేక సభల్లోనూ రెండు తెలుగు రాష్ట్రాల్లో పాల్గొన్నారు. చిన్నజీయర్‌స్వామి శిష్యుల్లో ఒకరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ ఆచార్యుడిగా సత్కారం అందుకున్నారు. నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామితో స్వర్ణ కంకణ సత్కారాన్ని అందుకోవడం లక్ష్మణమూర్తి ప్రతిభా పాండిత్యానికి నిదర్శనం. అనేక మందికి ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడపాలంటూ ఇతోక్తులు చేసిన అందరితో సహృదయంగా సవినయంగా భాసిల్లిన లక్ష్మణమూర్తి ఇక లేరన్న విషయాన్ని ఓరుగల్లు సాహితివేత్తలు, ఆయన శిష్యగణం జీర్ణించుకోలేకపోతున్నారు. కాగా, ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

తీరనిలోటు

ఆచార్య లక్ష్మణమూర్తి మృతి చెందడం శ్రీ వైష్ణవ సంప్రదాయినికి తీరని లోటని, ఆయన మృతితో ఓరుగల్లు ఒక గొప్ప పండితుడిని కోల్పోయిందని కాళోజీ ఫౌండేషన్ చైర్మన్ నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్.విద్యార్థి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేవారు. అదే విధంగా ఆయనతో సాన్నిహితంగా మెదిగే ఆచార్య కె.దామోదర్‌రావు, ఆర్‌పి.పరాంకుశం, రాజేశ్వరశాస్త్రి, మలహలరావు, గోనారెడ్డి, వాసిరెడ్డి కృష్ణారావు, కొండా సత్యనారాయణ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్‌వీఎన్.చారి, గిరిజా మనోహర్, కుందావజ్జుల కృష్ణమూర్తి, సముద్రాల శఠగోపాచార్య తదితర ప్రముఖులు లక్ష్మణమూర్తి మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



ఓ ఈవెంట్‌లో హీరో మంచు మనోజ్, నటుడు సంపూర్ణేష్ బాబుతో సంజోష్



బేవర్స్ సినిమాలోని ఓ సన్నివేశంలో నటుడు రాజేంద్ర ప్రసాద్‌తో సంజోష్



సంజోష్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న సంజోష్ (ఫైల్)

అటు సినీ రంగం.. ఇటు సేవా గుణం

- ప్రత్యేకతను చాటుకుంటున్న యువ హీరో, బేవర్స్ ఫేం సంజోష్
- సినిమాల్లో నటిస్తూనే సామాజిక సేవలో..
- 'మన జిల్లా హీరో.. మన కోసం' పేరుతో సాయం
- సంజోష్ ఫౌండేషన్ ద్వారా అనేక కార్యక్రమాలు

ఏటూరునాగారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు పేదరికాన్ని జయించి.. వెండితెరపై రాణిస్తున్నాడు. యువహీరోగా తన ప్రయాణాన్ని కొనసాగించడమే కాకుండా సమాజ సేవలతోనూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. అలా అతి తక్కువ సమయంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నాడు. సంజోష్. 'బేవర్స్' సినిమాతో విజయాన్ని అందుకుని తెలుగుచిత్ర సీమలో రాణించిన సంజోష్ ఏప్రిల్‌లో సోదరా అనే మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన హరి సంజోష్ ములుగులోని ప్రేమనగర్ వివేకానంద పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన తర్వాత హైదరాబాబాద్‌లో ఇంటర్, సీఎంఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. చిన్నతనం నుంచే సినీ రంగమంటే ఆసక్తి ఉన్న సంజోష్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి వీరాభిమాని. సినిమాలపై ఆసక్తితో 2016లో పరిశ్రమలోకి వెళ్లి తొలుత పలు సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. అక్కడితో ఆగకుండా హీరో అవ్వాలన్న లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించి ప్రముఖ సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్ ముఖ్య పాత్రలో నటించిన బేవర్స్ సినిమాలో హీరోగా తొలి అవకాశం దక్కించుకున్నాడు. 2018లో విడుదలైన ఆ సినిమాలో సంజోష్ నటన ఆకట్టుకుంది. ప్రస్తుతం సోదరా అనే సినిమాలో సంజోష్ హీరోగా నటిస్తున్నారు.

సంజోష్ ఫౌండేషన్ పేరుతో పేదలకు అండగా..

సినీ రంగంలో రాణిస్తూనే.. 'మన జిల్లా హీరో.. మన కోసం అనే' నినాదంతో సంజోష్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసుకొని ఆ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నాడు సంజోష్. గొత్తికోయగూడేలు, ఆదివాసీ గ్రామాల్లో పర్యాటిస్తూ వారికి వైద్యం, విద్య, నిత్యవసర వస్తువులు అందజేస్తున్నారు. అదేవిధంగా ఆపన్నులను ఆర్థికంగా ఆదుకుంటూ ఆదర అభిమానాలు పొందుతున్నాడు. తాజాగా ఏటూరునాగారం మండలానికి వచ్చిన సమయంలో ఆయన మండలంలోని రామన్నగూడెం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలతో పాటు మండలంలోని పలు పాఠశాలాల నిరుపేద విద్యార్థులకు చేయూతనందించారు. సుమారు 150 మంది విద్యార్థులకు ఉచితంగా టై, బెల్ట్, షూస్, నోట్ బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్సిల్స్ తదితర వస్తువులను అందించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలోని 96 మంది పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష కిట్స్‌ను పంపిణీ చేశారు. దీంతో పాటు రామన్నగూడెం జడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి ఇటీవల నేషనల్ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున నగదును ప్రోత్సాహకంగా అందించారు. పేద విద్యార్థులకు తన ఫౌండేషన్ ద్వారా ఎల్లప్పుడూ అండగా ఉంటానని, నలుగురు విద్యార్థులను తన సొంత ఖర్చులతో చదివిస్తున్నానని సంజోష్ ఆ సందర్భంగా వెల్లడించారు.



ఆదివాసీలకు భోజనం వడ్డిస్తున్న సంజోష్ (ఫైల్)

హోరెత్తించిన టెక్నో సాంస్కృతిక సంబురాలు

- ఆటపాటలతో ఇంజనీరింగ్ విద్యార్థులు జోరు
- వైభవంగా ముగిసిన రూబీజెస్టు-25 వేడుకలు

కేయూ క్యాంపస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులు సాంస్కృతిక సంబరాలతో హోరెత్తించారు. కేయూ ఆడిటోరియంలో మూడు రోజులుగా జరుగుతున్న రూబీజెస్టు-2025 ఉత్సవాల్లో భాగంగా అఖరు రోజున శనివారం 'వైబ్రేన్స్ కార్నివాల్' నిర్వహించారు. గ్రామీణ సంబంధాలను జానపద గేయ నృత్య ప్రదర్శనలు చేశారు. ప్రాంతీయ స్థితిగతులను తెలిపే సినీ పాటలతో డ్యాన్స్‌లు చేశారు. సాంకేతిక, క్రీడలతో విద్యార్థులలో సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాలను కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. విద్యార్థులు జీవితంలో సక్సెస్ సాధిస్తే రోజు పండుగేనని చెప్పారు. కన్వీనర్ కందుల సాయితరుణ్ మాట్లాడుతూ. టెక్నికల్ ఫెస్ట్, థీమ్‌డే, కల్చలర్ ఫెస్ట్‌లు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమాల కోఆర్డినేటర్లుగా ఎల్.సాత్విక, పోలు వర్షిత, జాహ్నవి, సాహితీ, అకాంక్షతో పాటు అధ్యాపకులు వీణ, వాణిశ్రీ, స్వప్న, వెంకటేశ్, సురేందర్, కిరణ్‌కుమార్, యశస్విని, దీప్తి, శ్రీజ, రచన, కిషన్, శ్రీనివాస్, రామాజ్యోతి, శ్రీవిద్య, జోత్స్న, అనూష, రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, దేవేందర్, సూపరింటెండెంట్ వీరునాయక్, మల్లేశం, జగన్, సంజయ్, యాదగిరి, ఫిరోజ్, సుజాత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది



• ఎవరూ చూడలేదు కదా..



• ఇటెవరూ లేరు కదా..



• ఎవరూ లేరులే లాగించేద్దాం

భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన మొక్కజొన్నలను రాసిగా పోసి విక్రయించుకునే వారి నుంచి శనివారం ఓ వానరం ఓ కంకిని దొంగిలించింది. ఆ పక్కనే ఉన్న ఓ గుడిసె పైకి ఎక్కి.. తాను తస్కరించిన దృశ్యాన్ని ఎవరైనా చూశారా? అన్నట్టుగా ఇదిగో ఇలా అటూ ఇటూ చూసి.. చివరకు ఆ కంకిని ఆరగించేసింది.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీఓ)రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనని జగన్‌మోహన్‌రావు అన్నారు. టీజీఓ కార్యవర్గ సమావేశం హనుమకొండలోని టీజీఓ భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో సామరస్యంగా ఉంటూ పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, డీసీఓ సంజీవరెడ్డి, వరంగల్ శాఖ జాయింట్ సెక్రెటరీ పాక శ్రీనివాస్, టీజీఓ హనుమకొండ జిల్లా అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షులు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫణికుమార్, టీజీఓ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మడికొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయలైన ఘటన మడికొండలో జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... మడికొండ వడ్డెర కాలనీకి చెందిన బోస్ నరేష్ కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం మెట్టుగుట్ట ద్వారం వద్ద నడుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. ఈక్రమంలో కాజీపేట వైపునుంచి వస్తున్న ద్విచక్ర వాహనం నరేష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్‌కు యాగాలు కాగా, స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

హసన్‌పర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో అన్యాంక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను శనివారం అంతర్జాతీయ మానవ హక్కుల చైర్మన్ రాంబాబుతో పాటు హైకోర్టు న్యాయవాది అనిల్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్థులు వారిని కలిసి గ్రామంలో అన్యాక్రాంతమవుతున్న భూములకు రక్షణ కల్పించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు సహకరించాలని ఐదేళ్లుగా గ్రామస్థులంతా కలిసి పోరాటం చేస్తున్నప్పటికీ ఫలితం లేదని తెలిపారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ వారు కబ్జాదారులకు వంతపాడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్థులు సంబంధిత పత్రాలతోకూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

ప్రభుత్వ భూములు, ఇనాం భూముల కబ్జాలకు పాల్పడుతున్న వారికి న్యాయం స్థానంలో శిక్ష పడేవిధంగా చేస్తామని చైర్మన్ రాంబాబు, హైకోర్టు న్యాయవాది గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని కలిసిన వారిలో గ్రామస్థులు మోతె లింగారెడ్డి, దుర్గాప్రసాద్, పాషా, నేదునూరి సునిల్, కుమారస్వామి తదితరులున్నారు.

జాతీయ రహదారుల పనులు పూర్తిచేయాలి

» హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి 765 డీజీ పరిధిలో జిల్లాకు సంబంధించి నిర్మాణంలో ఉన్న రహదారి పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం సిద్దిపేట - ఎల్కతుర్తి మార్గంలో జాతీయ రహదారి నిర్మాణ పనులపై జాతీయ రహదారుల శాఖల అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. సిద్దిపేట-ఎల్కతుర్తి వరకు 63.64 కిలోమీటర్ల జాతీయరహదారి నిర్మాణ ప్రాజెక్టు ఉండగా, హనుమకొండ జిల్లా పరిధిలో ఉన్న 17.5 కిలోమీటర్లలో ఇప్పటి వరకు 16.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తయిందని జాతీయ రహదారుల శాఖ అధికారులు ఈసందర్భంగా కలెక్టర్‌కు తెలిపారు. ఎల్కతుర్తి - ముల్కనూరు పరిధిలో ఒక కిలోమీటర్ దూరం వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. జిల్లా పరిధిలో ఉన్న ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు మొత్తం మే నెల నాటికి పూర్తవుతాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఏప్రిల్ 30 వరకు ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారి వెంట ఇరువైపులా మొక్కలను నాటడంతో పాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు.

ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

ఎల్కతుర్తి మండల కేంద్రంలో 'కుడా' ఆధ్వర్యంలో చేపట్టిన ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులను ఏప్రిల్ 14వ తేదీ నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరకణ, అభివృద్ధి పనుల పురోగతిపై కుడా, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ, అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ ఎల్కతుర్తి జంక్షన్ చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయడం, పచ్చదనం కోసం లాన్, మొక్కలు నాటడం, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం, డ్రైనేజీ నిర్మాణం తదితర పనులు నాణ్యతగా పూర్తి చేయాలన్నారు.

ఈ సమావేశంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అత్యాధునిక ప్రొస్టేట్ శస్త్రచికిత్స విజయవంతం

• ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

వరంగల్ మెడికల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రొస్టేట్ గ్రంధి వాపుతో వచ్చిన ఇద్దరు వృద్ధ రోగులకు అత్యాధునిక పద్ధతితో ప్రొస్టేట్ శస్త్ర చికిత్సను విజయవంతంగా అందించామని శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్ వైద్యుడు, యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈనెల 21న ఇద్దరు 70ఏళ్ల వయస్సు గల వృద్ధులు తమ ఆస్పత్రికి రాగా, ప్రొస్టేట్ గ్రంధి వాపు ఉందని నిర్ధారించామన్నారు. అదేరోజు రెసుమ్ అనే విధానంతో రోస్ట్ రైడ్‌కు శస్త్రచికిత్స చేసి అదేరోజు డిశ్చార్జ్ చేశామన్నారు. తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో హైదరాబాద్‌లోని రెండు ఆస్పత్రులలో మాత్రమే ఈ తరహా శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నారని తెలిపారు. రూ.కోటి విలువజేసే పరికరంతో మూడు నిమిషాల్లో శస్త్రచికిత్స చేసి రోగులను డిశ్చార్జ్ చేశామన్నారు. ఈ చికిత్సకు ఎలాంటి మత్తు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. చికిత్స పొందిన ఇద్దరు వృద్ధ పేషంట్లు కూడా సంతోషం వ్యక్తం చేశారని, తనతోపాటు డాక్టర్ ప్రభు రామ్, డాక్టర్ సామ్రాట్ పాల్గొన్నట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వర్సిటీ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

కేయూ క్యాంపస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సమస్యల పరిష్కరానికి వర్సిటీ అధ్యాపకుల సంఘం(అకూట్) కృషి చేస్తోందని అకూట్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు స్పష్టం చేశారు. శనివారం కేయూ ఫిజిక్స్ విభాగంలో అకూట్ ఎగ్జిక్యూటీవ్ మొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్న అడ్మినిస్ట్రేషన్‌కు సహకరిస్తూనే అధ్యాపకుల సమస్యలను చర్చలతోనే పరిష్కరించుకుందామని చెప్పారు. అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సు 65కు పెంచిన సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ, స్టేట్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు ప్రకటించారు. వర్సిటీకి అదనపు గ్రాంట్ పెంచిన సీఎం, ఫైనాన్స్ మినిస్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రెగ్యులర్ ఫ్యాకల్టీకి 8 నుంచి 20 క్యాజువల్ లీవ్స్‌ను పెంచిన వీసీ ప్రతాప్‌రెడ్డితో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అకూట్ ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రాము, ట్రెజరర్ డాక్టర్ డి.రమేశ్‌తోపాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేయూ టోర్నమెంట్స్‌లో విద్యార్థులు రాణించాలి

కేయూ క్యాంపస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల టోర్నమెంట్‌లో విద్యార్థులు రాణించి ప్రతిభ చూపాలని కేయూ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ బి.రమలు ఉద్బోధించారు. శనివారం కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంనేతృత్వంలో క్యాంపస్ కళాశాల పీజీ స్టూడెంట్స్‌కు టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల పీడీ డాక్టర్ పి.కుమారస్వామిల నేతృత్వంలో జరిగిన క్యాంపస్ కళాశాల క్రీడల టోర్నమెంట్‌కు పాలక మండలి సభ్యులు సురేశ్‌లాల్, రమలు ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, పీడీ కుమారస్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు. మార్చి 24 నుంచి ట్రాక్ అండ్ ఫీల్డు అథ్లెటిక్స్ క్రీడాంశాలల్లో కేయూ ఫిజికల్ డైరెక్టర్ శేషాల కుమార్ తెలిపారు.

క్రికెట్‌లో విన్నర్ పొలిటికల్ సైన్స్

కేయూ క్రీడామైదానంలో శనివారం క్రికెట్ పురుషుల జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. పొలిటికల్ సైన్స్ వర్సెస్ కంప్యూటర్ సైన్స్ విభాగాలు తుది పోరులో పోరుకు దిగాయి. పొలిటికల్ సైన్స్ స్టూడెంట్స్ విజేతగా నిలిచింది. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

నీటిని పొదుపుగా వాడితేనే మానవ మనుగడ

• జిల్లా భూగర్భ జల అధికారి శైలజమల్లికాదేవి

హసన్‌పర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటిని పొదుపుగా వాడితేనే మానవ మనుగడ సాధ్యమని జిల్లా భూగర్భ జల అధికారి శైలజమల్లికాదేవి అన్నారు. మండలంలోని జయగిరి పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని భూగర్భ జల శాఖ హనుమకొండ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ.. భూ ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీలకు దగ్గరలో పరిమితం చేయాల్సిన అవసరాన్ని ఐక్యరాజ్య సమితి గుర్తించిందన్నారు. వర్షపు నీటిని సంరక్షించాల్సిన విధానాన్ని, ఇంకుడు గుంతలు, సేద్యపు నీటి కుంటలు నిర్మించి నీటిని వినియోగించాల్సిన విధానం గురించి వివరించారు. బావులు ఎండిపోతే వాటిలోని పూడికను తొలగించి వర్షపు నీరు వృథా పోకుండా భూమిలోకి మళ్లించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి నీటి సక్రమ వినియోగం, నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భూగర్భజల శాఖ హైడ్రోలోజిస్టు శృతి, పర్యవేక్షకులు ధరమ్ సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు జలమే జీవనాధారం

వడ్డెపల్లి : మానవ మనుగడకు జలమే జీవనాధారమని ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం అన్నారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ వివేక్ నగర్ కాలనీలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మీసాల రమేష్ అధ్యక్షతన శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథం మాట్లాడుతూ.. జలం లేనిదే జీవం లేదని అన్నారు. సమాజంలోని ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలను నాటి పెంచాలని, ప్రతీ ఇంటికి ఇంకు డు గుంతను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. వర్షం నీరు వృథా కాకుండా సంరక్షించే పద్ధతులను అలవర్చుకుంటే భవిష్యత్తు తరాలకు భూగర్భ జలాలు అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. గోపాల్‌పూర్ ఊరచెరువు ఎఫ్‌టీఎల్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని దశరథం డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక ప్రోగ్రాం కన్వీనర్ అశోక్‌రెడ్డి, కమ్యూనిటీ హాల్ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, తుప్పరి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



జయగిరిలో ర్యాలీలో పాల్గొన్న జిల్లా భూగర్భజల అధికారి శైలజమల్లికాదేవి

ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలి

వడ్డెపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నందగిరి రజినీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయనతో పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ అనుముల రమేష్ మాట్లాడారు. ఉద్యమకారుల న్యాయమైన హక్కుల సాధనకోసం ఈనెల 24న కరీంనగర్ నుంచి హనుమకొండలోని అమరవీరుల స్థూపంవరకు బస్సుయాత్ర రానుందని తెలిపారు. బస్సు యాత్రలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతారని అన్నారు. సమావేశంలో ఓడపల్లి శ్యామ్‌కృష్ణ, జమ్మాల నాగరాజు, ఓడపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జీఎంకు తప్పిన ప్రమాద ఘటనపై విచారణ

• అప్రమత్తమైన ఇంజనీరింగ్ అధికారులు • భిన్న కోణాల్లో దర్యాప్తు

హసన్‌పర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ నూతన రైల్వేలైన్, రైల్వేస్టేషన్ స్థితిగతుల విచారణలో భాగంగా శుక్రవారం ఆయన ప్రయాణం చేస్తున్న ప్రత్యేక రైలుకు తప్పిన ప్రమాద ఘటనపై రైల్వే ఉన్నతాధికారులు విచారణ ప్రారం భించినట్లు తెలిసింది. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ ప్రయాణం చేస్తున్న ప్రత్యేక రైలు కరీంనగర్ నుంచి వరంగల్‌కు వెళ్తుండగా న్యూశాయంపేట రైల్వే గేటు సమీపంలో పెద్ద శబ్దం వచ్చి దుమ్ములేచింది. దీంతో శబ్దం వచ్చిన 372/36-373/14 కిలోమీటరు మధ్య ప్రదేశంలో విరిగిన రైలు పట్టా ముక్కను రైల్వే ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారు. రైల్వే జీఎం ప్రత్యేక రైలుకు తప్పిన ప్రమాద ఘటన విషయంలో అధికారులు ఎవరూ కూడా పూర్తి సమాచారాన్ని ఇవ్వకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఇంజనీరింగ్ అధికారులు మరోపక్క రైల్వే పోలీసులు, ఇంటెలిజెన్స్ విభాగం పలు కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేసినట్లు సమాచారం. ఈవిషయంపై ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావును ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగాఅందుబాటులోకి రాలేదు.

మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం

హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కమీషన్లు, కాంట్రాక్టులతో తన అనుచరులకు రూ.113కోట్ల పనులు ఇప్పించుకున్నారంటూ మంత్రి కొండా సురేఖకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వైరల్ చేస్తున్న వ్యక్తులపై సిటీ సైబర్ క్రైమ్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. ముఖ్యమంత్రి మాట్లాడిన ప్రతీసారి ఫైసలేప్.. ఖజానా ఖాళీ.. అని పాటపాడుతున్నారని, కానీ, మంత్రులు జేబులు నింపుకుంటున్నారంటూ కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఎక్స్‌లో పోస్టు చేశారు. అంతటితో ఆగకుండా శ్రీ సత్యసాయి ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సుస్మితాపటేల్, డాక్టర్ అభిలాష్(కొండా సురేఖ కూతురు, అల్లుడు)లపై అసత్య ప్రచారం చేస్తున్నారు. శరత్-నైనీ అనే ఐడీతో సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పంజాగుట్టకుచెందిన సాగర్‌కుమార్ సిటీసైబర్ క్రైమ్‌లో ఫిర్యాదుచేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

» టౌన్‌ప్లానింగ్ అధికారులతో మేయర్ సుధారాణి


టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంతో పాటు చుట్టుపక్క ప్రాంతాల్లో కమర్షియల్ ప్లాట్లు, లేఔట్ ప్లాట్ల యజమానులు ప్రభుత్వం కల్పించిన రాయితీని ఉపయోగించుకుని ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 2020 ఆగస్టు 26లోపు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 31 వరకు ఫీజులో 25 శాతం రాయితీ కల్పించిందని అన్నారు. అర్హులైన ప్రతీ యజమాని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ సందేశాల కోసం ప్రజలు బల్దియా పరిధిలో ఏర్పాటు చేసిన 12 హెల్ప్‌డెస్క్‌లను సందర్శించి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు 68వేల దరఖాస్తులు ఆమోదం పొందగా, 3వేల మంది ఫీజు చెల్లించారని అన్నారు. ఇంకా 1200 మందికి ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రొసిడింగ్‌లు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఇంకా వారం రోజుల గడువు మాత్రమే ఉందని టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు శ్రీనివాస్ రెడ్డి, ఖలీల్, నస్రీన్, రజిత, టీపీవోలు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలి

వేసవిలో నీటి సమస్య రాకుండా చొరవ చూపాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వరంగల్ నగరంలోని పలు ఫిల్టర్‌బెడ్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌తో పాటు పుప్పాలగుట్ట, చౌర్‌బౌళి ప్రాంతాలలో వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. అక్కడ పనిచేసే సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని 66 డివిజన్‌లలో వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, వరంగల్ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని అన్నారు. వాటర్ ట్యాంకుల ప్రాంతంలో ఉన్న కాలనీలకు చివరి ఇండ్ల వరకు నీటి సరఫరా ఉండాలన్నారు. తర్వాత పోచమ్మ మైదాన్ సమీపంలోని బల్దియా ఈ-సేవా కేంద్రాన్ని సరిశీలించారు. అక్కడి సిబ్బంది పనితీరు తెలుసుకుని రిజిస్ట్రర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బస్వరాజు కుమారస్వామి, ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి, ఏఈలు విజయలక్ష్మి, హబీబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మణమూర్తి మృతి తీరని లోటు

హనుమకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పెరంబుదూరు లక్ష్మణమూర్తి మృతి తీరని లోటని ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మాడభూషి రాజగోపాలాచార్య అన్నారు. ఆచార్య లక్ష్మణమూర్తి మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖను పటిష్టం చేయడంలో, అంగ్లభాషను సుసంపన్నం చేయడంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. కేయూ తొలితరం అధ్యాపకుల్లో ఒక ధృవతార రాలిపోయిందన్నారు. ఆచార్య లక్ష్మణ మూర్తి అంగ్లం, తెలుగు, హిందీ, సంస్కృతం, జర్మన్ తదితర భాషల్లో గొప్ప పండితుడన్నారు. కవి, రచయిత, అనువాదకుడుగా సాహితీ రంగంలో విశిష్టమైన సేవలందించారన్నారు. లక్ష్మణమూర్తి మృతి వ్యక్తిగతంగా తనకు తీరని లోటని పేర్కొన్నారు.

24న ఆర్జేడీ కార్యాలయం ఎదుట టీటీయూ ధర్నా

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): డూప్లికేటు మెమోల కుంభకోణం, అవినీతి అక్రమాలు, ఉపాధ్యాయులపై వేధింపులకు పాల్పడుతున్న ఓ హెడ్మాస్టర్‌పై చర్యలు తీసుకోవడంలో విఫలమైన ఆర్జేడీ చర్యలకు నిరసనగా ఈనెల 24న ఆర్జేడీ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతున్నట్లు తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.నరేందర్, జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సదరు ప్రధానోపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన జయశంకర్ భూపాలపల్లి డీఈవో ఆరోపణలన్నీ నిజమేనని విచారణ నివేదికను ఇచ్చినా ఆర్జేడీ మాత్రం వాటిని బుట్టదాఖలు చేసి ఎలాంటి శిక్ష పడని సెన్సూర్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. హెడ్మాస్టర్‌ను ఆర్జేడీ ఉద్దేశ్యపూర్వకంగానే కాపాడుతున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఆర్జేడీ అక్రమాలకు పాల్పడ్డ హెడ్మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం టీటీయూ ఆధ్వర్యంలో వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నాకు దిగుతున్నామని, ధర్నాను జయప్రదం చేయాలని వారు ప్రకటనలో కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

• జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

వడ్డెపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ కోసం ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని వరల్డ్ వైడ్ ఫండ్(డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఫర్ నేచర్-ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ స్టేట్ డైరెక్టర్ ఫరీదా అధ్యక్షతన నిర్వహించిన ఎర్త్ అవర్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యా వరణాన్ని కాపాడేందుకోసం సోలార్ ప్లాంట్లను వినియోగించుకోవాలని అన్నారు. చెట్లను పెంచి పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించాలని కోరారు. వ్యర్థాలను తొలగించి దూరంగా వేయాలని, భవిష్యత్తు తరాల కోసం భూమిని, పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన అవసరం సమాజంపై ఎంతైనా ఉందన్నారు. రైతులు మానవ మనుగడ కోసం సేంద్రియ ఎరువులను వినియోగించి పంటలను సాగు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.

ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో 100 శాతం పారిశుధ్య పనులను నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, షీల్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ సంజీవరెడ్డి, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కె.అనితారెడ్డి, సీడబ్ల్యూసీ మాజీ చైర్ పర్సన్ మండల పరశురాములు, డబ్ల్యూడబ్ల్యూ-ఇండియా సెక్రటరీజనరల్ రవిసింగ్, డైరెక్టర్ పుల్లూరి వంశీకృష్ణ, ప్రజ్వల్ సంస్థ ప్రతినిధులు అక్కల రమేష్, రైతులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎర్త్ అవర్

హనుమకొండ కలెక్టరేట్: జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు ఉద్యోగులు శనివారం రాత్రి ఎర్త్ అవర్‌ను పాటించారు.



పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన ఎర్త్ అవర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

కలెక్టరేట్ లోని అన్ని కార్యాలయాలు, ప్రభుత్వ ఆఫీసులు రాత్రి 8:30 గంటల నుంచి 9:30 గంటల వరకు గంట పాటు ఎర్త్ అవర్‌ను పాటిస్తూ విద్యుత్ లైట్లను, ఫ్యాన్లను నిలిపివేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎర్త్ అవర్‌ను గంటపాటు పాటించినట్లు అధికారులు తెలిపారు.

కూలీలను పట్టించుకోని కేంద్రంపై ఉద్యమించాలి

న్యూశాయంపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించాలని కూలీలకు బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రాములు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్ల తర్వాత కూడా ఇండ్లు, బతుకు దెరువుకు భూమి లేని పేదలు కోట్లాది మంది ఉన్నారని, ఇది అత్యంత ఘోరమైన విషయమన్నారు. పేదరికం రూపుమాపాల్సిన కేంద్ర ప్రభుత్వం రోజు రోజుకూ గ్రామీణ పేదలకు బడ్జెట్ కేటాయింపులను తగ్గించడమే కాకుండా అంతోఇంతో ఉపయోగపడుతున్న జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత పేదల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల నుంచి క్రమపద్ధతిలో పోరాటాలకు సంఘం రూపకల్పన చేసిందని, అట్టి పోరాటాల్లో వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో మునిగాల భిక్షపతి, మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, రాజయ్య, కొట్టెపాక రవి పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బహుజన విద్యార్థి సంఘం, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకులు మనోహర్, సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం హనుమకొండ వడ్డెపల్లి ఎన్జీవోస్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాల ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు యాజమాన్యాల నుంచి డబ్బులు దండుకుంటున్న విద్యాశాఖాధికారులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఒక చోట అనుమతి, మరో చోట నిర్వహిస్తున్న పాఠశాలను గుర్తించకుండా వారిస్తున్న లంచాలకు అలవాటు పడుతున్న అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నకుమార్, మహ్మద్ అలీమ్, రవి, శివకుమార్, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మిలియన్ డాలర్ సీక్రెట్	రియాల్టీ షో	మార్చి 26విత్
అమెజాన్ ప్రైమ్		
హాలెండ్	ఆంగ్ల చిత్రం	మార్చి 27
జియో హాట్‌స్టార్		
ముఫాసా: ద లయన్ కింగ్	హిందీ చిత్రం	మార్చి 26
జీ5		
విడుదల పార్ట్-2	హిందీ డబ్బింగ్ చిత్రం	మార్చి 28
ఆహా		
ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్	సినిమా(తెలుగు డబ్బింగ్)	మార్చి 26





పారిస్‌లో ఏం జరిగింది?

ధనుష్ నటించిన తొలి హాలీవుడ్ మూవీ 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్'. 'హు ట్రాప్డ్ ఇన్ యాన్ ఐకియా వార్డ్‌రోబ్' అనే ఫ్రెంచ్ నవల ఆధారంగా కెన్ స్కాట్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. హాలీవుడ్ నటులు బెన్ మిల్లర్, హెరిన్ మోరియార్టీ కీలక పాత్రల్లో నటించారు. ముంబైకి చెందిన లవశ్‌పటేల్(ధనుష్) స్ట్రీట్ మెజీషియన్. తనకు మంత్ర శక్తులు తెలుసునని అందరినీ నమ్మిస్తుంటాడు. తల్లి మరణానంతరం... పారిస్‌లో ఉన్న తన తండ్రిని వెతుక్కుంటూ వెళ్తాడు. అక్కడ ఊహించని పరిస్థితుల్లో ఐకియా వార్డ్ రోబ్‌లో చిక్కుకుంటాడు. ఆ తర్వాత ఏమైంది అన్న ఆసక్తికరమైన అంశం చుట్టూ కథ సాగుతుంది.



రెక్కలొచ్చాయని ఎగిరిపోయే స్వభావం కాదు

'నాద సుధార్ణవ' అన్నవరపు రామస్వామి... ఒక గాంధర్వ విశ్వవిద్యాలయం. సంగీత విజ్ఞాన పీఠం. వాయులీన వాద్యానికి తన జీవితాన్ని అంకితం చేసి, అనేక దశాబ్దాలపాటు రసజ్ఞులను తన్మయత్వంలో ముంచెత్తిన సుస్వర జ్ఞాని. ఎంత నేర్చినా, ఎన్ని సాధించినా... "నాదేమీ లేదు గురుకృప, నా తల్లితండ్రుల దీవెన" అంటారు వినయంగా.. నేడు నూరో వసంతంలోకి అడుగు పెడుతున్న ఆయనతో ఇష్టాగోష్ఠి... 'నవ్య'కు ప్రత్యేకం.



ముందుగా మీ స్వస్థలం గురించీ, మీ కుటుంబం గురించీ చెబుతారా?

మాది ఏలూరు సమీపంలో ఉన్న సోమవరప్పాడు అనే కుగ్రామం. చిటికిన వేలు కన్నా చిన్న వేలు... మా ఊరు కన్నా చిన్న ఊరు ఉంటాయని నేను అనుకోను. నా తండ్రి పేరు పెద్దయ్య, తల్లి లక్ష్మీదేవి. మా పెద్దన్న శోభనాద్రి, తరువాత గోపాలం... రేడియోలో ఘట విద్వాంసునిగా పని చేశారు. ఆయన ఒక్క ఘటమే కాదు... డోలు, మోర్సింగ్, తబల, కంజీర కూడా వాయించేవారు. నేను మూడోవాణ్ణి, నాలుగో సోదరుడు వెంకటేశ్వరరావు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేశారు. మరో ఇద్దరు సోదరులు, నలుగురు అక్క చెల్లెళ్ళు.. ఇప్పుడు ఎవరూ లేరు.

ఎంతవరకు చదువుకున్నారు?

(నవ్వుతూ) ఓనమాల వరకూ చదివాను. చాలదా?

సంగీతాభిలాష ఎలా కలిగింది?

మా ఇంట్లో సంగీతం ఎప్పటినుంచో ఉంది. మా తండ్రిగారు నాదస్వరం వాయించేవారు. అన్న గోపాలం డోలు, ఘటం వాయించేవారు. నన్ను పెద్ద విద్వాంసుణ్ణి చేయాలనేది ఆయన కోరిక. మా ఊర్లో మాగంటి జగన్నాథం అనే సంగీతం తెలిసిన మనిషి ఉండేవారు. ఆయనే నా తొలి గురువు. ఆ తరువాత... నాటి ప్రసిద్ధ నాదస్వర విద్వాంసుడు దాలిపర్తి పిచ్చిహరి గారి దగ్గరకు మా అన్నయ్య గోపాలం ఒకసారి నన్ను తీసుకువెళ్ళారు. ఆయన నన్నొక పాట పాడమన్నారు. జగన్నాథం మాస్టారు నేర్పిన పాటొకటి పాడాను. "వీణ్ణి మా గురువు దగ్గర చేర్చు. వృద్ధిలోకి వస్తాడు" అని ఆశీర్వదించారు. ఎవరా గురువు? గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు. అన్నయ్య నన్ను తిన్నగా తీసుకువెళ్ళి, వారి దగ్గర ప్రవేశపెట్టారు. అది నా జీవితంలో గొప్ప మలుపు. వారు పెద్ద మనసుతో నన్ను శిష్యుడిగా స్వీకరించారు. సంగీత భిక్ష పెట్టారు. అక్కడ అంతా గురుకుల పద్ధతి. ఘనాపాఠీలు వేదం ఎలా నేర్పుతారో... మా గురువుగారు సంగీతం అలా నేర్పేవారు. మధూకర వృత్తి చేసుకుంటూ చదువుకున్నాం. అన్నం దొరకని రోజుల్లో గురువుగారి సతీమణి భోజనం పెట్టేవారు.

అక్కడ ఏదైనా వివక్ష ఎదుర్కొన్నారా?

గురువుగారిది నిప్పులు కడిగే బ్రాహ్మణ్యమే కానీ... శిష్యుల విషయంలో ఆ పట్టింపులేవీ ఉండేవి కావు. కుల, మత, వర్గాలకు అతీతంగా అందరితో అమిత ఆదరంగా ఉండేవారు. బయటకూడా అందరూ నన్ను గౌరవించారు.

మీరు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ సహాధ్యాయులా?

అవును. ఇద్దరం పంతులుగారి దగ్గరే చదువుకున్నాం. బాలమురళి చిన్నతనంలోనే చాలా అద్భుతంగా పాడేవారు. పంతులుగారి శిష్యరికంలో మరింత పదును తేలారు. సక్రమమైన సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే... నవీన దృష్టితో, నూతన కల్పనలతో సంగీతాన్ని కొత్త పుంతలు తొక్కించారు. దాదాపు అన్ని సభల్లో వారికి వయొలిన్ వాద్య సహకారం అందించాను.

ఎవరెవరి సభల్లో సహకారం అందించారు?

ఒకరా, ఇద్దరా! ఉత్తరం, దక్షిణం అనే భేదం లేకుండా దాదాపు అందరూ... సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్, టి.ఆర్. మహాలింగం, బాలమురళి, ఎస్.బాలచందర్, ముక్త, నూకల, మహారాజపురం విశ్వనాథయ్యర్, అరియకుడి రామానుజయ్యంగార్, పండిట్ భీమసేన్ జోషీ, పండిట్ జస్‌రాజ్, పండిట్ వినాయకరావ్ పట్వర్ధన్... ఇలా ఎందరో నన్ను కావాలనుకొనేవారు.

మీరు కొన్ని కొత్త రాగాలు, తాళాలు కనిపెట్టారని, కీర్తనలు రచించారని విన్నాం..!

ఇన్నాళ్ళూ బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో ఉన్నాను కదా... అందుకు కృతజ్ఞతగా 'దుర్గ' అనే రాగం, 'వందన' అనే మరో రాగం రూపొందించాను. ఇక తాళం పేరు 'వేదాది'. వేదాలు నాలుగు కదా... అందుకని నాలుగు వేదాల నుంచి నాలుగు జాతులు... త్రిశ, చతురస్ర, మిశ్ర, ఖండ జాతుల సమాహారంగా ఉంటుందది. ఇక ఒక కొత్త వర్ణం... పేరు 'హిందోళం'. 'గురుని పొగడ తరమా'... మా గురువుగారిని స్మరించుకుంటూ ధన్యాసి రాగంలో ఒక కీర్తన, గణపతిని, శారదాంబను, దక్షిణామూర్తిని భజిస్తూ మరొకటి రాశాను.

ఇన్నేళ్ళ సంగీత జీవితంలో ఎన్నో ప్రశంసలు పొందారు. వాటిలో మీరు మరచిపోలేనివి..?

ప్రశంసలన్నీ తియ్యగానే ఉంటాయి. కానీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారు, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్‌ల ప్రశంసలు నా మనసులో స్థిరంగా నిలిచిపోయాయి. "నా తరువాత దేశంలో చాలాకాలం నిలబడేది అన్నవరపు ఒక్కడే" అన్న ద్వారం వారి మాటలు వమ్ము కాకూడదని నేను చేయని సాధన లేదు. అలాగే టీవీలో నా ప్రదర్శన చూసిన సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ వెంటనే మంగళంపల్లికి ఫోన్ చేసి "తిరుక్కోడికావల్ కృష్ణయ్యర్ బాణీ పట్టుకున్నాడు రామస్వామి... ఇక తిరుగులేదు" అని ముచ్చట పడ్డారట. కృష్ణయ్యర్ ఒకప్పుడు ఘనత వహించిన వాయులీన విద్వాంసుడు. "కృష్ణయ్యర్ వయొలిన్ వాయిస్తూ ఉంటే... ఆ ఆరోహణలు, అవరోహణలు... రెక్కలను ఆడించకుండా, శ్రమ పడకుండా, ఠీవిగా, ఆకాశంలో పక్షులు ఎగురుతున్నట్టు ఉండేవి. ఆ గాంభీర్యం, ఆ సంగీత నైపుణ్యం రామస్వామికి అబ్బింది. రామస్వామి చాలా పైస్థాయికి వెళ్ళి, స్వర ప్రస్థానం చేసినా... రాగంలో స్వరశుద్ధికి ఏ మాత్రం భంగం వాటిల్లలేదు" అని సెమ్మంగుడి మెచ్చుకున్నారట. ఇంతకు మించిన ప్రశంసలేముంటాయి?

> నిరాధార వాద్యంగా, పక్కవాద్యంగా పేరుపడిన వయొలిన్‌కు స్వతంత్రవాద్యంగా స్వయం ప్రతిపత్తినీ, గౌరవాన్నీ కల్పించి, అపురూపమైన వాద్యంగా మలచింది ద్వారం వెంకట స్వామి నాయుడు గారైతే... ఆ గౌరవాన్ని పరిరక్షిస్తూ వచ్చినవారిలో రామస్వామి గారు ముందుంటారు. రామస్వామి గారి వయొలిన్ వాదనంలో కచ్చితత్వం, సున్నితమైన శైలి, శృతిలయల సౌందర్యం ప్రధానంగా కనిపిస్తాయి. మంద్ర, మధ్యమ తార స్థాయిలు మూడిటిలోనూ రామస్వామిగారి నాదం సమతూకంలో ఉంటుందనేది సంగీతం రుచి తెలిసినవారు అనే మాట. 1948లో... విజయవాడ ఆకాశవాణి కేంద్రం ప్రారంభమైన తొలినాళ్ళలో, నిలయ విద్వాంసుడిగా చేరిన రామస్వామి.. సుమారు మూడున్నర దశాబ్దాలపాటు అక్కడ పనిచేశారు. అత్యుత్తమ సంగీత విద్వాంసుడిగా రసజ్ఞుల మెప్పు పొందారు.

సంగీత విద్వాంసుల్లో చాలామంది చెన్నై వెళ్లి స్థిరపడ్డారు. మరి మీరెందుకు వెళ్ళలేదు?

'రెక్కలు వచ్చాయి కదా' అని ఎగిరిపోవడం నా స్వభావం కాదు. నేను విజయవాడకు వచ్చాను. ఇక్కడే గురువుగారి దగ్గర విద్య నేర్చుకున్నాను. ఇక్కడే రేడియోలో ముప్పై ఏళ్ళకు పైబడి పని చేశాను. ఇక్కడి నుంచే ఎన్నో దేశాలకు వెళ్ళాను. మా గురువుగారి పద్ధతిలో పైసా తీసుకోకుండా సంగీతం చెప్పాను. ఉన్న ఊరునూ, కన్నతల్లిని వదిలెయ్యకూడదని ఇక్కడే ఉన్నాను.

అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ తదితర అనేక దేశాల్లో... వందలాది కార్యక్రమాల్లో తన ప్రజ్ఞను రామస్వామి ప్రదర్శించారు. సంగీతం అఖండమనీ, దేశ, కాల, జాతులకు అతీతమైనదనీ నిరూపించారు. భారత ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారం, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం, మద్రాస్ మ్యూజిక్ అకాడమీ వారి టి.టి.కె.మెమోరియల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న అవార్డు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ గౌరవ పురస్కారం... ఆయన పొందిన గౌరవాల్లో కొన్ని.



అలసట లేకుండా మెట్లు ఎక్కి, దిగుతున్నారు. మీ ఆరోగ్య రహస్యం ఏమిటి?

సంగీత సాధన, గురుభక్తి, శిష్యుల పురోభివృద్ధి చూడడం, చేతనైనంతలో పదిమందికీ సాయం చేయడం... ఇవన్నీ నాకు బలాన్ని ఇస్తున్నాయి. నాకు దేశ, విదేశాల్లో ఎంతోమంది శిష్య ప్రశిష్యులు ఉన్నారు. శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్‌రెడ్డి లాంటి ఆత్మీయ అభిమానులు ఉన్నారు. నేను ఇప్పటికీ సాధన చేస్తున్నాను. పాఠాలు చెబుతున్నాను.

● ప్రయాగ రామకృష్ణ

సినిమా.. నా మనసు దోచింది

తెలుగులో తొలి చిత్రం 'నన్ను దోచుకుందువటే'తో కుర్రకారు మనసును దోచేశారు నభా నటేష్. 'ఇస్మార్ట్ శంకర్', 'డార్లింగ్స్' తదితర చిత్రాలతో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రమాదంతో కొంత కాలం సినిమాలకు దూరమైనా.. ఇటీవలే మళ్లీ ముఖానికి రంగు వేసుకున్నారు. ప్రస్తుతం పాన్ ఇండియా చిత్రాలు 'స్వయంభూ', 'నాగబంధం'లో నటిస్తున్న నభా... 'నవ్య'తో ముచ్చటించారు.

'స్వయంభూ' చిత్రంలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

ఇది ఒక పీరియాడిక్ చిత్రం. భారీ బడ్జెట్‌తో పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఎక్కడా ఆగకుండా వేగంగా సాగిపోయే ఈ సినిమా కథలో చాలా లేయర్స్ ఉంటాయి. భరత్ కృష్ణమాచారికి ఇది తొలి సినిమా అయినా, ఎక్కడా తడబడ లేదు. సినిమా అద్భుతంగా ఉండబోతోంది. నిఖిల్ చాలా కష్టపడ్డాడు. యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకున్నాడు. ఇందులో నేను క్లాసికల్ డ్యాన్సర్‌గా కనిపిస్తా. ఇటీవలే విడుదల చేసిన నా లుక్‌కు మంచి ప్రశంసలు వచ్చాయి.

మీకు ఇంతకుముందే డ్యాన్స్ వచ్చా? లేక ఈ చిత్రం కోసమే నేర్చుకున్నారా?

నేను చిన్నప్పుడే భరతనాట్యం నేర్చుకున్నాను. అది నాకు ఇప్పుడు చాలా హెల్ప్ అయ్యింది. ప్రత్యేకంగా ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. ఇప్పటివరకు నేను చేసిన క్యారెక్టర్లలో నాకు అత్యంత ఇష్టమైనది ఇదే. ఇందులో నా నటన ప్రేక్షకులకు చాలా కాలం గుర్తుండిపోతుంది.

మీ షూటింగ్ పార్ట్ అయిపోయిందా? ఇందులో మీకు యాక్షన్ సీన్స్ ఉన్నాయా?

అవును, పూర్తయ్యింది. సినిమా షూటింగ్ కూడా దాదాపు పూర్తైపోయింది. గత ఏడాది జనవరిలో షూటింగ్ మొదలైంది. త్వరలోనే విడుదల తేదీనీ ప్రకటిస్తారు. ఇందులో నాకు యాక్షన్ సీన్స్ లేవు.



'నాగబంధం' గురించి చెప్పండి?

అభిషేక్ నామా దర్శకత్వంలో సోషియో ఫాంటసీ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఆద్యంతం మలుపులతో కూడిన ఈ చిత్రం ప్రేక్షకులకు అద్భుత అనుభూతిని ఇస్తుంది. ఇందులో నా పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమాను మలుపు తిప్పే పాత్ర నాది.

వరుస ప్రాజెక్టులతో హ్యాపీగా సాగిపోతున్న మీ కెరీర్‌ను యాక్సిడెంట్ దెబ్బతీసింది. ఆ సమయంలో మీరు ఎదుర్కొన్న సమస్యలు?

నా జీవితంలో అదో ఊహించని సినిమాటిక్ ట్విస్ట్. అంతా సజావుగా సాగుతున్న సమయంలో ఆ యాక్సిడెంట్ జరగడం చాలా బాధాకరం. కోలుకోవడానికి దాదాపు రెండేళ్లు పట్టింది. ఆ సమయంలో మానసికంగా చాలా లోగా ఫీల్ అయ్యేదాన్ని. నేను పూర్తిగా రికవర్ కావడంలో కుటుంబ సభ్యుల తోడ్పాటు మరిచిపోలేనిది.

కమ్‌బ్యాక్ తర్వాత ఎదుర్కొన్న సవాళ్లేంటి?

నా అభిమానులకు స్క్రీన్‌పై నేను చూపించే ఎనర్జీ లెవెల్స్, చలాకీదనం ఎంతో ఇష్టం. వాటిని తిరిగి నటనలో చూపాలంటే మొదట్లో చాలా కష్టమయ్యేది. మొత్తానికి ఇప్పుడంతా ఓ.కే.

అప్పటిలా వరుస సినిమాలు చేయకుండా కేవలం సెలక్టివ్‌గా చేయడానికి కారణం?

వరుసగా సినిమాలు చేస్తేనే ప్రేక్షకులకు గుర్తుంటాం అనేది అపోహ. మంచి సినిమాల్లో నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేస్తే కచ్చితంగా గుర్తిండిపోతాం. అందుకే సెలక్టివ్‌గా సినిమాలను ఎంపిక చేసుకుంటున్నాను.

సినిమా ఫీల్డ్‌లో పోటీ ఎక్కువ. ముఖ్యంగా హీరోయిన్లకి. మీరు ఆ పోటీని తట్టుకుని ఎలా మీ ప్రత్యేకతను నిలబెట్టుకుంటారు?

ఇదో పోటీ ప్రపంచం. ప్రతీ ఫీల్డ్‌లో పోటీ అనేది చాలా సహజం. నేను దాని గురించి అస్సలు పట్టించుకోను. అదో అవరోధం. ఎవరి ప్రత్యేకత వారిది. మన పని మనం చేసుకుంటూ ముందుకు సాగడమే మన చేతుల్లో ఉంటుంది.

నటిగా మీకు ఛాలెంజ్ విసిరిన సినిమాలు? మీ డ్రీం రోల్?

'డార్లింగ్స్' సినిమాలో పాత్ర. అందులోని పాత్ర కోసం బోలెడు వేరియేషన్స్ చూపించాల్సి వచ్చేది. డ్రీం రోల్స్ అంటే చాలా ఉన్నాయి. ఓ నటిగా అన్ని రకాల పాత్రలూ చేయాలనుంది.

సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటారా? దాని వల్ల కొంత ప్రతికూలత కూడా ఉంది. దానిపై మీ అభిప్రాయం?

యాక్టివ్‌గా ఉంటాను. అభిమానులతో టచ్‌లో ఉండడానికి అదో మార్గం. యాక్టింగ్ కెరీర్‌కు సహకరించే మార్గాల్లో సోషల్‌మీడియా ఒకటి. ప్రతీ దాంట్లో మంచి, చెడూ ఉంటాయి. అది మనం వాడే కోణాన్ని బట్టి ఉంటుంది. టూమచ్‌గా ఏది చేసినా హానికరమే కదా.

మీకు పెయింటింగ్ అంటే ఇష్టం కదా. ఈ మధ్య వాటికి తీరిక దొరికిందా?

నటిగా మారాక అంత టైమ్ ఉండేది కాదు. కానీ యాక్సిడెంట్ తర్వాత పెయింటింగ్ కోసం చాలా టైమ్ వెచ్చించా.
అలానే, ట్రావెలింగ్ అంటే నాకు చాలా ఇష్టం. అప్పుడప్పుడూ రెండు నెలలు విరామం తీసుకుని యూరప్ అలా తిరిగివస్తుంటాను. అక్కడ కూడా వీలుచూసుకుని పెయింటింగ్స్ వేస్తుంటాను.

మీ కోస్టార్స్ చాలా మంది స్పెషల్ సాంగ్స్ చేస్తున్నారు. మీరు కూడా అవి చేయడానికి సిద్ధమేనా?

ఇప్పుడు వస్తున్న సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ కామన్ అయిపోయాయి. ఒకవేళ మంచి సినిమాలో అవకాశం వస్తే ఆలోచిస్తాను.

మీ 'నన్ను దోచుకుందువటే' సినిమా ఉంది కదా. అలా మీ మనసు దోచినవారు ఎవరయినా ఉన్నారా?

అవును, ఉన్నారు. సినిమా నా మనసును దోచేసింది. దాంతో పాటు నా ఫ్యామిలీ మెంబర్స్, ఫ్రెండ్స్, ఫ్యాన్స్... వీరంతా నా మనసును గెలిచినవారే.

సినిమాల విషయంలో మీ కుటుంబ సభ్యుల సపోర్ట్?

నేను చేసే ప్రతీ సినిమా విషయంలో వారి ప్రోత్సాహం తప్పకుండా ఉంటుంది. నేను చేసే సినిమాల్లో నా నటన గురించి మొదట వారే రివ్యూ ఇస్తారు.



సినిమాల ఫలితం మిమ్మల్ని ప్రభావితం చేస్తుందా?

హిట్, ఫ్లాప్స్‌ను పట్టించుకోవడం అనేది చాలా మందికి ఉన్న సమస్యే. హిట్ వస్తే హ్యాపీ ఫీలవుతాం. ఫెయిల్యూర్ వస్తే దిగాలుపడిపోతాం. కానీ వీటిని అధిగమించి ముందుకు సాగాలి. సినిమా అనేది ఒక్కరి చేతుల్లో ఉండే పని కాదు. 24 క్రాఫ్ట్స్ కలసికట్టుగా పనిచేయాలి, అప్పుడే అనుకున్నవి సాధిస్తాం. నా వరకూ, సినిమాలో నేను చేసిన పాత్రకు ఎన్ని మార్కులు పడ్డాయి. నటిగా ఎంత ఇంప్రూవ్ అయ్యాను అనే విషయాలను మాత్రమే పట్టించుకుంటా.

రోజూ సినిమాలు చూస్తారా? తెలుగులో మీ ఫేవరెట్ హీరోలు ఎవరు?

విడుదలయ్యే సినిమాలన్నీ దాదాపు కవర్ చేస్తా. ఒక్కరంటూ ప్రత్యేకంగా ఎవరూ లేరు. అందరూ ఇష్టమే.

మీ బ్యూటీ సీక్రెట్? ఆరోగ్యం గురించి ఎలాంటి శ్రద్ధ తీసుకుంటారు?

ప్రతీ రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేస్తాను. టైమ్‌కు రెస్ట్ తీసుకోవడం. మంచి ఆహారం తీసుకుంటాను. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటాను. హైదరాబాద్ బిర్యానీ చూస్తే నోరూరిపోతుంది.

● వినాయకరావు


తైలంతో తరగని అందం

సౌందర్య చికిత్సల్లో తైలాలది ప్రత్యేక స్థానం. ఏ తైలాన్ని ఎలా వాడుకోవాలో తెలుసుకుని మసలుకుంటే, తరగని అందాన్ని సొంతం చేసుకోవచ్చు.

గ్రీన్ టీ ఆయిల్: గ్రీన్ టీ ఆకులు, ఆలివ్ ఆయిల్‌ను ఒక జాడీలో వేసుకుని, ఎండచొరబడని, చల్లని ప్రదేశంలో నెల రోజుల పాటు ఉంచితే, గ్రీన్ టీ ఆయిల్ సిద్ధమవుతుంది. ఈ నూనె వెంట్రుకలకు తేమను అందించి, మృదువుగా మార్చి, ఆరోగ్యమైన పెరుగుదలకు తోడ్పడుతుంది. పొడి చర్మం తేమ సంతరించుకోవాలంటే గ్రీన్ టీ నూనెను ముఖానికి పూసుకుని మర్దన చేయాలి.

పసుపు నూనె: కొబ్బరి నూనెకు పసుపు ముద్దను కలిపి, చిన్న మంట మీద ఉడికించాలి. చల్లారిన తర్వాత సీసాలో నిల్వ చేసుకుని ఉపయోగించుకోవాలి. ఈ నూనెతో ముఖం మీద మచ్చలు మటుమాయమవుతాయి. మంగు మచ్చలు కూడా తొలగిపోతాయి. వయసు పైబడే ఛాయలు అదుపులోకి వస్తాయి. నల్లబడిన పెదవులు గులాబీ రంగులోకి మారతాయి.

క్యారట్ ఆయిల్: నచ్చిన నూనెలో క్యారెట్ ముక్కలను వేసి, నూనె రంగు మారే వరకూ చిన్న మంట మీద ఉడికించి, చల్లార్చి సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ నూనె కుదుళ్లకు పూసుకుంటే వెంట్రుకలు పెరుగుతాయి. ఎండకు దెబ్బతిన్న, కమిలిన చర్మం తిరిగి జీవం సంతరించుకోవాలంటే ఈ నూనెను అప్లై చేసుకోవాలి.



కాఫీ ఆయిల్: కొబ్బరినూనెలో కాఫీ పొడి కలిపి, చిన్న మంట మీద ఉడికించాలి. తర్వాత వడగట్టి వాడుకోవచ్చు. ఈ నూనెను వెంట్రుకలకు పూసుకుంటే జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. కళ్ల కింద నలుపు తగ్గడం కోసం రాత్రి నిద్రకు ముందు ఈ నూనును కళ్ల దిగువన అప్లై చేసుకోవాలి. అలాగే స్ట్రెచ్ మార్క్స్‌ను వదిలించడం కోసం ఆయా ప్రదేశాల్లో ఈ నూనె అప్లై చేసి మర్దన చేయాలి.





తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



విక్రమ్, దుషార విజయన్ జంటగా ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీర ధీర శూర'. హెచ్. ఆర్. పిక్చర్స్ బ్యానర్‌పై రియా శిబు నిర్మించారు. ఎస్.జె.సూర్య, సూరజ్ వెంజరాముడు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ని ఎస్.వి.ఆర్ సినిమా దక్కించుకుంది. ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో విక్రమ్ మాట్లాడుతూ 'మాస్ సినిమాలు చేస్తున్నాను కానీ రస్టిక్‌గా ఉండే సినిమా చేసి చాలా రోజులైంది. యాక్షన్‌తో పాటు మంచి ఎమోషన్ ఉన్న సినిమా ఇది. డైరెక్టర్ అరుణ్ చాలా అద్భుతంగా తెరకెక్కించాడు. ఫస్ట్ షాట్ నుంచే కథ మొదలవుతుంది. థియేటర్లలో ఆట ప్రారంభాని కంటే ఐదు నిమిషాల ముందే సీట్లలో కూర్చోవాలని ప్రేక్షకులను కోరుతున్నా. తెలుగులో అన్ని రకాల సినిమాలు అద్భుతమైన విజయాన్ని సాధిస్తున్నాయి' అని అన్నారు. నటుడు ఎస్.జె.సూర్య మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఎక్కడున్నా సరే తెలుగు ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. 'రంగస్థలం' లాంటి రా అండ్ రస్టిక్ సినిమా ఇది. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అని అన్నారు. నిర్మాత ఎస్.వి.ప్రసాద్ మాట్లాడుతూ 'మహారాజా' తర్వాత తెలుగులో చేస్తున్న సినిమా ఇది. కచ్చితంగా హిట్ అవుతుంది. ప్రేక్షకులు కోరుకుంటున్న ఎలిమెంట్స్ అన్నీ ఇందులో ఉన్నాయి' అని అన్నారు.

అది నా అదృష్టం

తమన్నా




హీరోయిన్ తమన్నా భాటియా ప్రధాన పాత్రలో అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఓదెల-2'. సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదల కానుంది. శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తమన్నా మాట్లాడుతూ "ఓదెల-2' చిత్రం ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఈ సినిమాలో భైరవి పాత్రలో నటించడం నా అదృష్టం' అని అన్నారు. సంపత్ నంది మాట్లాడుతూ 'ఓదెల గ్రామంలో ఒక కష్టం వస్తే ఆ ఊరిలో ఉన్న ఓదెల మల్లన్న నాగ సాధు క్యారెక్టర్ ద్వారా ఎలా పరిష్కరించారనేది ఈ చిత్ర కథ' అని తెలిపారు. నిర్మాత డి.మధు మాట్లాడుతూ 'కంటెంట్‌ని నమ్ముకొని ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని నిర్మించాం' అని చెప్పారు.

ఏదైనా సాధించొచ్చని నిరూపించేలా..



డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'దీక్ష'. కిరణ్, అలేఖ్య రెడ్డి హీరోహీరోయిన్లు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉన్న ఈ చిత్రం గురించి దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణ మాట్లాడుతూ "దీక్ష, పట్టుదలతో పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చని నిరూపించే చిత్రమిది. ఈ చిత్రం కచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది" అని చెప్పారు. "ఈ చిత్రం నా కెరీర్‌ను మలుపు తిప్పుతుంది" అని కథానాయకుడు కిరణ్ చెప్పారు.



మూడో భాగంతో మళ్లీ వస్తాం

మోహన్ లాల్

మలయాళ నటుడు మోహన్ లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్2:ఎంపురాన్'. ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించారు. ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో మోహన్‌లాల్ మాట్లాడుతూ సినీ ప్రయాణంలో తెలుగు చిత్ర సీమతో ఎంతో అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావుతో నటించే అదృష్టం నాకు దక్కింది. పృథ్వీరాజ్ ఈ చిత్రంతో తెరపై అద్భుతం చేశారు. 'లూసిఫర్‌'ను మూడు భాగాలుగా తీయాలని అనుకున్నాం. 'ఎంపురాన్' విజయవంతమైతే మూడో భాగంతో మళ్లీ వస్తాం. పాలిటిక్స్, యాక్షన్, ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి' అని తెలిపారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ 'ఇది ఎక్కడా డబ్బింగ్ చిత్రంలా అనిపించదు. నా దృష్టిలో మంచి సినిమా చెడ్డ సినిమా అనేది మాత్రమే ఉంటుంది. చిన్న సినిమా పెద్ద సినిమా అనేది ఉండదు. నేను మంచి సినిమా తీశానని నమ్ముతున్నాను' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'పృథ్వీరాజ్ సుకుమారన్ పాన్ ఇండియా డైరెక్టర్ కాబోతున్నారు. అన్ని భాషల్లో ఈ చిత్రం పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

హ్యాకింగ్ మోసాలపై...



ప్రపంచాన్ని వణికిస్తున్న హ్యాకింగ్ మోసాలపై నూతన దర్శకద్వయం నరేశ్ దోనే, మణివరన్ ఓటీటీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రావూరి సురేశ్ బాబు నిర్మాత. ఈ సందర్భంగా తెనాలిలో జరిగిన విలేకరుల సమావేశంలో 'మా-ఏపీ' వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా చిత్ర విశేషాలను పంచుకున్నారు. దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ పోలీసులకు హ్యాకింగ్ మోసాలు సవాలుగా మారినందువల్లనే ఈ నూతన కథాంశాన్ని ఎంపిక చేసుకున్నామని చెప్పారు. ఈ ఓటీటీ చిత్రాన్ని తమిళం, కన్నడ, హిందీ భాషల్లోకి డబ్బింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిత్ర దర్శకులు నరేశ్ దోనే, మణివరన్ మాట్లాడుతూ 'మనకు తెలియకుండానే మన బ్యాంక్ అకౌంట్ హ్యాకింగ్‌కు గురై డబ్బు పోగొట్టుకోవడం ఈ చిత్ర ప్రధాన కథాంశం' అని తెలిపారు.










దిశా పటాని

అంగరంగ వైభవంగా..


శ్రేయా ఘోషల్

కోల్‌కతా: బాలీవుడ్ సూపర్ స్టార్ షారుక్ ఖాన్, క్రికెట్ కింగ్ విరాట్ కోహ్లీ స్టెప్పులు, హుషారెత్తించిన శ్రేయా ఘోషల్ పాటలు..మైమరపించిన దిశా పటాని డ్యాన్స్.. వెరసి ఐపీఎల్ ప్రారంభోత్సవం ఉర్రూతలూగించింది. షారుక్ ఖాన్ ప్రసంగంతో కార్యక్రమం మొదలుకాగా..మా తుఝే సలామ్ అన్న పాటను ఘోషల్ ఆలపించగానే 'వందేమాతరం' అంటూ స్టేడియం యావత్తు ఊగిపోయింది. ఇక..విరాట్ కోహ్లీని వేదికపైకి ఆహ్వానించిన షారుక్ అతడితో కలిసి పఠాన్ సినిమాలోని 'మేరీజాన్' పాటకు నృత్యం చేశాడు. 'లట్ పుట్ గయా' అన్న పాటకు రింకూసింగ్‌తో కలిసి షారుక్ కాలు కదిపాడు. ర్యాప్ సింగర్ కరణ్ ఔజా తన గాత్రంతో ఫ్యాన్స్‌లో జోష్ నింపాడు. అదిరే డ్రెస్‌తో.. కళ్లు చెదిరే డ్యాన్స్‌తో దిశా పటాని ఫ్యాన్స్‌ను మరో లోకంలోకి తీసుకెళ్లింది. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధూమల్ సహా ఇతర అతిథులను షారుక్ వేదికపైకి ఆహ్వానించాడు. 18 ఏళ్లుగా ఒకే జట్టుకు ఐపీఎల్ ఆడుతున్న విరాట్‌కు మెమెంటోను బిన్నీ ప్రదానం చేశాడు.

ఆర్‌సీబీ బోణీ అదిరింది

- కోహ్లీ, సాల్ట్ హాఫ్ సెంచరీలు
- 7 వికెట్లతో కోల్‌కతా చిత్తు
- రహానె శ్రమ వృథా
- క్రునాల్‌కు 3 వికెట్లు


క్రునాల్ పాండ్యా (3/29)


కోహ్లీ (59 నాటౌట్)

కోల్‌కతా: ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అదిరే బోణీ చేసింది. విరాట్ కోహ్లీ (36 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 59 నాటౌట్), ఫిల్ సాల్ట్ (31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సలతో 56) ధనాధన్ అర్ధ శతకాలతోపాటు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' క్రునాల్ పాండ్యా (3/29) తిప్పేయడంతో.. శనివారం జరిగిన లీగ్ ఆరంభ మ్యాచ్‌లో బెంగళూరు 7 వికెట్లతో డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)ను చిత్తు చేసింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 174/8 స్కోరు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానె (56), సునీల్ నరైన్ (44) రాణించారు. హాజెల్‌వుడ్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో బెంగళూరు 16.2 ఓవర్లలో 177/3 స్కోరు చేసి గెలిచింది. సారథి రజత్ పటీదార్ (34) ధాటిగా ఆడాడు.

బాదేసిన సాల్ట్: ఛేదనలో బెంగళూరు ఓపెనర్లు సాల్ట్, కోహ్లీ చెలరేగడంతో వార్ వన్‌సైడ్‌గా మారింది. బౌండ్రీతో ఖాతా తెరిచిన సాల్ట్.. మూడో ఓవర్‌లో వైభవ్ బౌలింగ్‌లో 20 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాతి ఓవర్‌లో వరుణ్ బౌలింగ్‌లో 4,6,4,4తో 21 పరుగులు పిండుకొన్న సాల్ట్ టీమ్ స్కోరును ఫిఫ్టీ దాటించాడు. కోహ్లీ కూడా వీలుచిక్కినప్పుడల్లా బ్యాట్‌కు పని చెప్పడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి బెంగళూరు 80/0తో గెలుపు దిశగా దూసుకెళ్లింది. అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సాల్ట్‌ను వరుణ్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్ (10)ను నరైన్ అవుట్ చేశాడు. అనంతరం వచ్చిన పటీదార్‌తో కలసి కోహ్లీ మూడో వికెట్‌కు 44 రన్స్ జోడించడంతో గెలుపు సులువైంది. బౌండ్రీతో కోహ్లీ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. పటీదార్‌ను వైభవ్ పెవిలియన్ చేర్చాడు. అయితే, విజయానికి 27 బంతుల్లో 13 రన్స్ అవసరమవగా.. లివింగ్‌స్టోన్ (15 నాటౌట్) 4,6,4తో బెంగళూరు 22 బంతులు మిగిలుండగానే గెలిచింది.

రహానె మెరిసినా..: రహానె, నరైన్ రెండో వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యంతో భారీ స్కోరుకు బాటలు వేసినా.. కీలక వికెట్లను పడగొట్టిన క్రునాల్ కోల్‌కతా జోరుకు బ్రేకులు వేశాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా.. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ డికాక్ (4) వికెట్ కోల్పోయింది. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన రహానె.. మరో ఓపెనర్ నరైన్‌తో కలసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆరో ఓవర్‌లో యశ్ బౌలింగ్‌లో రహానె 4,6,4తో 20 రన్స్ పిండుకోవడంతో పవర్‌ప్లేలో కోల్‌కతా 60/1 స్కోరు చేసింది. సుయాష్ వేసిన 9వ ఓవర్‌లో రహానె అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. నరైన్ 6,4తో ఆ ఓవర్‌లో మొత్తం 22 రన్స్ లభించాయి. అయితే, వరుస ఓవర్లలో నరైన్, రహానె అవుటవడంతో కోల్‌కతా బ్యాటింగ్ కుదుపునకు లోనైంది. నరైన్‌ను సలామ్, రహానెను క్రునాల్ అవుట్ చేయడంతో కోల్‌కతా 11 ఓవర్లలో 110/3తో నిలిచింది. ఈ దశలో బెంగళూరు స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులను కట్టడి చేశారు. వెంకటేష్ అయ్యర్ (6), రింకూ సింగ్ (12)ను కూడా క్రునాల్ వెనక్కిపంపగా..రస్సెల్ (4)ను సుయాష్ బౌల్డ్ చేయడంతో డెత్ ఓవర్లలో కోల్‌కతా 29 పరుగులే చేయగలిగింది. రఘువంశీ (30)ను యశ్.. హర్షిత్(5)ను హాజెల్‌వుడ్ అవుట్ చేశాడు. దీంతో నైట్‌రైడర్స్ కష్టంగా 170 పరుగుల మార్క్ దాటింది.

3 కోల్‌కతాపై వెయ్యికి పైగా పరుగులు చేసిన మూడో ఆటగాడిగా కోహ్లీ. డేవిడ్ వార్నర్ (1093 పరుగులు), రోహిత్ (1070) విరాట్ కంటే ముందున్నారు.

స్కోరుబోర్డు

కోల్‌కతా: డికాక్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 4, నరైన్ (సి) జితేశ్ (బి) రసిఖ్ 44, రహానె (సి) రసిఖ్ (బి) క్రునాల్ 56, వెంకటేశ్ (బి) క్రునాల్ 6, రఘువంశీ (సి) జితేశ్ (బి) యశ్ దయాల్ 30, రింకూ (బి) క్రునాల్ 12, రస్సెల్ (బి) సుయాశ్ 4, రమణ్‌దీప్ (నాటౌట్) 6, హర్షిత్ (సి) జితేశ్ (బి) హాజెల్‌వుడ్ 5, స్పెన్సర్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 174/8; వికెట్ల పతనం:** 1-4, 2-107, 3-109, 4-125, 5-145, 6-150, 7-168, 8-173; **బౌలింగ్:** హాజెల్‌వుడ్ 4-0-22-2, యశ్ దయాల్ 3-0-25-1, రసిఖ్ సలామ్ 3-0-35-1, క్రునాల్ పాండ్యా 4-0-29-3, సుయాశ్ శర్మ 4-0-47-1, లివింగ్‌స్టోన్ 2-0-14-0.

బెంగళూరు: సాల్ట్ (సి) స్పెన్సర్ (బి) వరుణ్ 56, కోహ్లీ (నాటౌట్) 59, పడిక్కళ్ (సి) రమణ్‌దీప్ (బి) నరైన్ 10, పటీదార్ (సి) రింకూ (బి) అరోరా 34, లివింగ్‌స్టోన్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 16.2 ఓవర్లలో 177/3; వికెట్ల పతనం:** 1-95, 2-118, 3-162; **బౌలింగ్:** వైభవ్ అరోరా 3-0-42-1, స్పెన్సర్ జాన్సన్ 2.2-0-31-0, వరుణ్ చక్రవర్తి 4-0-43-1, హర్షిత్ రాణా 3-0-32-0, సునీల్ నరైన్ 4-0-27-1.

ఉప్పల్‌లో దంచుడేనా?

- ఫేవరెట్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్
- రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ నేడు

మధ్యాహ్నం 3.30 నుంచి


ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్, హెడ్

హైదరాబాద్: విధ్వంసకర బ్యాటర్లు, అనుభవజ్ఞులైన బౌలర్లతో బలంగా ఉన్న గతేడాది రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తాజా సీజన్‌ను విజయంతో ఆరంభించాలనుకొంటోంది. ఉప్పల్ స్టేడియంలో ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. హెడ్, అభిషేక్ శర్మ, క్లాసెన్, ఇషాన్ కిషన్‌లాంటి పవర్ హిట్టర్లతో ప్రత్యర్థులను బెంబేలెత్తించే బ్యాటింగ్ లైనప్ ఉంది. గాయం నుంచి కోలుకొన్న ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలున్నాయి. కెప్టెన్ కమిన్స్, షమి పేస్ భారాన్ని మోయనుండగా.. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా జంపాకు చాన్స్ లభించవచ్చు. సన్‌రైజర్స్‌తో పోల్చితే రాజస్థాన్ కొంత బలహీనంగా కనిపిస్తోంది. రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ వేలికి గాయమైంది. దీంతో అతడి స్థానంలో పరాగ్ జట్టును నడిపించనున్నాడు.

ఆనవాయితీని బ్రేక్ చేస్తారా?

- చెన్నైతో ముంబై ఢీ
- రాత్రి 7.30 నుంచి



చెన్నై: చెపాక్ స్టేడియంలో ఆదివారం జరిగే బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌లో మాజీ చాంపియన్లు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ తలపడనున్నాయి. మెగా లీగ్‌లో తొలి మ్యాచ్‌లో ఓడే ఆనవాయితీని బ్రేక్ చేయాలని ముంబై పట్టుదలతో ఉండగా.. సొంత మైదానంలో ఘన విజయంతో సీజన్‌ను ఆరంభించాలని చెన్నై భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు ధోనీ ప్రధాన ఆకర్షణ. మరోవైపు హార్దిక్ పాండ్యాపై ఒక మ్యాచ్ బ్యాన్ విధించడంతో తాత్కాలిక కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ వ్యవహరించనున్నాడు. రోహిత్, తిలక్ వర్మ, రికెల్టన్‌తో ముంబై బ్యాటింగ్ ప్రత్యర్థికి దీటుగా ఉంది.

ప్రణతి కంచు మోత

జిమ్నాస్టిక్స్ వరల్డ్‌కప్ వాల్ట్ ఫైనల్స్‌లో పతకం



న్యూఢిల్లీ: భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటింది. టర్కీలోని అంటాల్యాలో శనివారం జరిగిన వరల్డ్‌కప్ వాల్ట్ ఈవెంట్ ఫైనల్స్‌లో కాంస్య పతకం సాధించింది. వాల్ట్ ఫైనల్స్‌లో ప్రణతి మొత్తం 13.417 పాయింట్లు స్కోరు చేసి మూడోస్థానంలో నిలిచింది. అమెరికా జిమ్నాస్టులు జేలా హాంగ్ (13.667)కు స్వర్ణం, క్లైయిర్ పీస్ (13.567)కు రజతం దక్కాయి. కోల్‌కతాకు చెందిన 29 ఏళ్ల ప్రణతికి ఇది ప్రపంచకప్‌లో రెండో పతకం. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఈజిప్టులో జరిగిన వరల్డ్‌కప్‌లోనూ వాల్ట్ ఈవెంట్‌లో కాంస్యం నెగ్గింది. ఇక, 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లోనూ ప్రణతి కాంస్య పతకాలు కైవసం చేసుకుంది.

గాయత్రి జోడీకి నిరాశ

శంకర్ కూడా.. స్విస్ ఓపెన్

బాసెల్: స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ పోరు పూర్తిగా ముగిసింది. బరిలో మిగిలిన సింగిల్స్ షట్లర్ శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్, డబుల్స్ జోడీ పుల్లెల గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ పోరాటానికి తెరపడింది. శనివారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 9వ ర్యాంకర్ ద్వయం గాయత్రి/ట్రీసా 21-15, 15-21, 12-21తో చైనాకు చెందిన ప్రపంచ నెంబర్‌వన్ జోడీ లూ షెంగ్ షూ/టాన్ నింగ్ చేతిలో పరాజయం పాలైంది. ఇక పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించిన తమిళనాడు కుర్రాడు శంకర్ అదేజోరును తర్వాతి రౌండ్ కొనసాగించలేకపోయాడు. క్వార్టర్‌ఫైనల్లో శంకర్ 10-21, 14-21తో ఫ్రాన్స్‌కు చెందిన పొపోవ్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

విశాఖలో మహిళల వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్

సాగరతీరంలో డిసెంబరులో దక్షిణాఫ్రికాతో పురుషుల వన్డే

ముంబై: వచ్చే సెప్టెంబరులో భారత్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ తొలి మ్యాచ్ విశాఖపట్నంలో నిర్వహించనున్నామని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించాడు. విశాఖతోపాటు గువాహటి, ములన్‌పూర్ (పంజాబ్), తిరువనంతపురం, ఇండోర్‌లో టోర్నీ జరగనుంది. అలాగే పన్నెండేళ్ల తర్వాత వెస్టిండీస్ పురుషుల జట్టు టెస్టు సిరీస్ ఆడేందుకు భారత్ రానుంది. అక్టోబరులో విండీస్‌తో 2 టెస్టులు, నవంబరు-డిసెంబరులో దక్షిణాఫ్రికాతో 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20లను స్వదేశంలో భారత్ ఆడనుంది. డిసెంబరు 6న విశాఖలో మూడో వన్డే జరగనుంది.

దులీప్ ట్రోఫీ మళ్లీ పాత పద్ధతిలో.. జోనల్ విధానంలో నిర్వహణ

కోల్‌కతా: దులీప్ ట్రోఫీలో సంప్రదాయ జోనల్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని బీసీసీఐ శనివారం నిర్ణయించింది. దాంతో 2025-26 సీజన్‌లో సౌత్, నార్త్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, నార్త్-ఈస్ట్ జోన్లు ఈ ట్రోఫీకోసం తలపడనున్నాయి. 1961 నుంచి 2014 వరకు దులీప్ ట్రోఫీని జోనల్ విధానంలోనే నిర్వహించారు. కొవిడ్ వల్ల 2020, 2021లో దులీప్ ట్రోఫీ జరగలేదు. 2022, 2023 తిరిగి జోనల్ విధానంలో నిర్వహించారు. కానీ 2024లో.. ఎ,బి,సి,డి జట్లతో దులీప్ ట్రోఫీ జరిగింది.

ఖేలో గేమ్స్‌లో దీప్తికి స్వర్ణం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా పారా గేమ్స్ రెండో రోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చెరో మూడు పతకాలను కైవసం చేసుకున్నాయి. న్యూఢిల్లీలో శనివారం జరిగిన పోటీల్లో తెలంగాణ అథ్లెట్లలో దీప్తి జివాంజి 400 మీటర్ల పరుగులో స్వర్ణం, శిరీష 100 మీటర్ల పరుగులో రజతం, కన్నప్ప లాంగ్‌జంప్‌లో కాంస్యం సాధించారు. ఆంధ్ర అథ్లెట్లలో లలితకు 400 మీటర్ల పరుగులో రజతం, 400 మీటర్ల రేసులో నవీన్‌కు రజతం, భవానికి లాంగ్ జంప్‌లో కాంస్యం లభించాయి.


కోల్‌కతాలో జరిగిన ఐపీఎల్ ఆరంభ వేడుకల్లో బీసీసీఐ కార్యదర్శి సైకియా, కోశాధికారి భాటియాతో పాలకమండలి సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్

ఈఎంఐ చెల్లించలేదా..?

మీ క్రెడిట్ స్కోర్ ధమాల్!

అప్పును అర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు నిర్దేశిత గడువులోగా తిరిగి చెల్లించడమూ ముఖ్యమే. రుణగ్రహీతలు నెలవారీ వాయిదాల (ఈఎంఐ) ను క్రమం తప్పకుండా చెల్లించాలి. ఈఎంఐ చెల్లింపు జాప్యమైనా, విఫలమైనా మీ క్రెడిట్ స్కోర్‌కు గండి పడుతుంది. భవిష్యత్‌లో మళ్లీ అప్పు పుట్టడం కష్టమవుతుంది. ఎందుకంటే, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఎవరికైనా రుణం ఇచ్చే ముందు ఆ వ్యక్తి పరపతి స్థాయిని క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే మదిస్తాయి. తర్వాతే ఆ వ్యక్తికి రుణం ఇవ్వాలా..? వద్దా..? అని నిర్ణయం తీసుకుంటాయి. అంతేకాదు, రుణంపై ఎంత వడ్డీ వసూలు చేయాలనేదీ మీ క్రెడిట్ స్కోర్‌పైనే ఆధారపడి ఉంటుంది.



క్రెడిట్ స్కోర్‌పై ప్రభావమెంత?

ఈఎంఐ చెల్లింపు 30 రోజుల పాటు జాప్యమైతే మీ క్రెడిట్ స్కోర్ 90-100 పాయింట్ల మేర, ఒక్కోసారి అంతకుపైగా తగ్గే ప్రమాదం ఉంది. అంతేకాదు, ఆ జాప్య లావాదేవీ మీ క్రెడిట్ హిస్టరీలో ఓ మరకగా మిగిలిపోతుంది. ఒక్క తప్పు భవిష్యత్‌లో మళ్లీ మీకు రుణం లభించడాన్ని దుర్లభంగా మార్చవచ్చు. అలాగే, ఈఎంఐ చెల్లింపులో విఫలమైతే, ఆనక ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈఎంఐ చెల్లింపుల్లో తరచుగా విఫలమైతే, రుణదాత ఆలస్య రుసుము విధించడంతో పాటు వడ్డీ రేటును కూడా పెంచే అవకాశాలుంటాయి. ఈఎంఐ చెల్లింపులను పూర్తిగా నిలిపివేస్తే, రుణదాత నుంచి న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు తనఖా రుణం తీసుకుంటే, తాకట్టులో ఉన్న ఇళ్లు లేదా వాహనాన్ని రుణదాత జప్తు చేసుకోవచ్చు.

15 రోజులకోసారి స్కోర్ అప్‌డేట్

ఇంతక్రితం క్రెడిట్ బ్యూరో రికార్డులు నెలకోసారి అప్‌డేట్ అయ్యేవి. ఈ ఏడాది జనవరి 1 నుంచి రికార్డులను 15 రోజులకోసారి అప్‌డేట్ చేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. తద్వారా రుణగ్రహీతల కార్యకలాపాలు, వారి రుణ నిర్వహణ సమాచారం మరింత వేగంగా అప్‌డేట్ అవుతూ వస్తోంది. అంటే, మీరు ఈఎంఐ చెల్లించడంలో ఏమాత్రం జాప్యమైనా ఆ సమాచారం మీ క్రెడిట్ హిస్టరీలో వెంటనే రికార్డు అవుతుంది. తత్ఫలితంగా మీ స్కోర్ కూడా తగ్గుతుంది.

చెల్లింపు జాప్యమైతే ఏం చేయాలి?

ఆకస్మిక ఆర్థిక అత్యయిక పరిస్థితి కారణంగా సమయానికి ఈఎంఐ చెల్లించడం ఒక్కోసారి సాధ్యపడకపోవచ్చు. అలాంటప్పుడు, మీ పరిస్థితి గురించి రుణదాతకు వెంటనే సమాచారం అందించి, సర్దుబాటుకు అదనపు గడువు ఇవ్వాలని కోరడం మేలు. మీరు చెప్పిన కారణం సరైనదని అనిపిస్తే, రుణదాత మీ అభ్యర్థనను మన్నించే అవకాశం ఉంటుంది. తద్వారా, ఆ జాప్య చెల్లింపును మీ క్రెడిట్ హిస్టరీలో అప్‌డేట్ కాకుండా, స్కోర్ తగ్గకుండా నివారించేందుకు అవకాశం ఉంటుంది.

క్రెడిట్ స్కోర్‌ను పెంచుకోండిలా..

తగ్గిన క్రెడిట్ స్కోర్‌ను పెంచుకోవడానికి సమయం పడుతుంది. ఇందుకు నిలకడ, ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరం. భవిష్యత్‌లో ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులను నిర్దిష్ట గడువులోగా తూ.చ తప్పక చెల్లించాలి. అంతేకాదు, క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించి ఉపయోగించకుండా జాగ్రత్తపడాలి. కార్డు పరిమితిలో 30 శాతానికి మించి వినియోగించుకుంటున్నట్లయితే, సకాలంలోనే బిల్లు చెల్లించినప్పటికీ క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. ఎందుకంటే, మీరు జీవితంలో రుణాలపైనే అధికంగా ఆధారపడుతున్నారనడానికి అది సంకేతం. సకాలంలో చెల్లింపులతో పాటు మీ క్రెడిట్ రిపోర్టును అప్పుడప్పుడూ చెక్ చేసుకోండి. రికార్డుల్లో ఏవైనా తప్పులుంటూ సంబంధిత క్రెడిట్ బ్యూరోకు వెంటనే ఫిర్యాదు చేయండి. సకాలంలో స్పందించడంతో పాటు ఆర్థిక క్రమశిక్షణతో క్రెడిట్ స్కోర్‌ను మళ్లీ మెరుగుపర్చుకోవడం సాధ్యమే.

బిజినెస్ ప్లస్

ఈ నెలాఖరుతో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇందుకు మరికొన్ని రోజులే మిగిలి ఉంది. మార్చి 31 డెడ్‌లైన్ ఈ ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్ను ఆదా చేసేందుకు చివరి అవకాశం కూడా. ఇందుకు మీ ముందున్న ఐదు మార్గాలు..

పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడులు: అధికాదాయం కలిగిన వారు పన్ను రాయితీ ప్రయోజనాలందించే ఆర్థిక పథకాల్లో పెట్టుబడులు పెట్టడం మేలు. ఎందుకంటే, ఆదాయం పన్ను చట్టంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు పన్ను మినహాయింపులను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందుకు ఈక్విటీ అనుసంధానిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్‌పీఎస్ పెట్టుబడులపైన 80సీసీడీ(1బీ) కింద అదనంగా రూ.50,000 మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వీలుంటుంది. అద్దెకు ఉంటున్న వారిలో ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) ప్రయోజనాలు లభించనివారు సెక్షన్ 80జీజీ కింద అదనపు మినహాయింపు సైతం క్లెయిమ్ చేసుకోవచ్చు.

మార్చి 31 కౌంట్‌డౌన్ షురూ..

పన్ను ఆదా చర్యలు చేపట్టారా మరి..?

రిటర్నులు అందించని పెట్టుబడులకు స్వస్తి: ఈ ఆర్థిక సంవత్సరం ఈక్విటీ ఇన్వెస్టర్లకు అంతగా కలిసిరాలేదు. 2024-25లో నిఫ్టీ కేవలం 3 శాతం వృద్ధిని మాత్రమే కనబరిచింది. ఇలాంటి ప్రతికూల సమయాల్లో అంతగా రిటర్నులు పంచని లేదా నష్టాల్లో ఉన్న ఈక్విటీ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా అధిక ప్రతిఫలాలు లభించిన ఆస్తులపై చెల్లించాల్సిన పన్ను (క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్)ను తగ్గించుకోగలిగే అవకాశాలను సద్వినియోగం చేసుకోండి. అలాగే, పన్ను చెల్లింపుదారులు స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్ల విక్రయంపై రూ.లక్ష వరకు దీర్ఘకాలిక మూలధన ఆర్జన పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోగలిగే అవకాశాలను పరిశీలించండి. తద్వారా పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఈ పెట్టుబడులపై లాభాలను స్వీకరించవచ్చు.

సకాలంలో ముందస్తు పన్ను చెల్లింపులు: రూ.10,000కు పైగా పన్ను చెల్లించాల్సిన వారు ముందస్తుగా పన్ను చెల్లించడం తప్పనిసరి. ప్రతి త్రైమాసికానికి ఒకసారి చొప్పున నాలుగు విడతల్లో ముందస్తు పన్ను చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. చివరి విడత గడువు మార్చి 15. ఒకవేళ తక్కువగా చెల్లిస్తే, మార్చి 31 నాటికి మిగతా మొత్తాన్ని జమ చేయవచ్చు. ఈ గడువు దాటితే, చెల్లింపులు జరిపే వరకు లేదా ఆదాయం పన్ను రిటర్నులు (ఐటీఆర్) సమర్పించే వరకు నెలకు 1 శాతం వడ్డీ పెనాల్టీ కట్టాల్సి ఉంటుంది.

ఉద్యోగం మారిన పక్షంలో ఆదాయ వివరాల అప్‌డేట్: ఐటీ చట్టంలో నిబంధన 26ఏ ప్రకారం.. ఆర్థిక సంవత్సరం మధ్యలో ఉద్యోగం మారిన వారు గత సంస్థ నుంచి అందుకున్న ఆదాయాన్ని ఫామ్ 12బీ ద్వారా కొత్తగా చేరిన కంపెనీ మేనేజ్‌మెంట్‌కు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. కొత్త యాజమాన్యం మీ జీతం నుంచి సరైన పన్ను మొత్తాన్ని మినహాయించేందుకు ఇది దోహదపడుతుంది. సకాలంలో ఫామ్ 12బీ సమర్పించడం ద్వారా ఆ ఏడాది ఆదాయం వెల్లడిలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, రిటర్నుల ఫైలింగ్ సంక్లిష్టం కాకుండా జాగ్రత్తపడవచ్చు.

ఆరోగ్య బీమా కొనుగోలు: ఆరోగ్య బీమా పథకం కొనుగోలుతో వైద్య అత్యవసరాల్లో కవరేజీ లభించడంతో పాటు పన్ను కూడా ఆదా అవుతుంది. సెక్షన్ 80డీ ప్రకారం.. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కోసం చెల్లించిన ప్రీమియంలో సాధారణ వ్యక్తులు రూ.25,000, సీనియర్ సిటిజన్లు రూ.50,000 వరకు పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	440
వరంగల్	422	గోదావరి	420
చిత్తూరు	470	విశాఖపట్నం	420
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	విజయవాడ	105
వరంగల్	101	గుంటూరు	103
కరీంనగర్	101	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	82
కర్నూలు	101	నెల్లూరు	87
విశాఖపట్నం	99	అనంతపురం	87
గోదావరి	105		


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,780 ▼	82,300 ▼	1,10,000 ▼
విజయవాడ	90,800 ▼	85,000 ▼	1,00,000 ▼
విశాఖపట్నం	88,170 ▼	80,820 ▼	98,050 ▼
రాజమండ్రి	89,780 ▼	82,300 ▼	1,00,300 ▼
ప్రొద్దుటూరు	89,900 ▼	83,200 ▼	99,300 ▼
ముంబై	88,169 ▼	80,763 ▼	97,620 ▼

ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్.. కొత్త నిబంధనలు?

ఇదీ GST


రాంబాబు గొండాల

ముంబై కేంద్రంగా ఉన్న ఒక ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల కంపెనీకి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో శాఖలు ఉన్నాయనుకుందాం. ఆ కంపెనీ తన శాఖలలోని అకౌంట్స్‌ను మెరుగుపరచటానికి ఒక సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను అన్ని శాఖలకు పంపింది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ముంబైలోని ఒక టెక్నాలజీ సంస్థ నుంచి కొనుగోలు చేశారనుకుందాం. ఇది రాష్ట్ర అంతర్గత సరఫరా కాబట్టి కొనుగోలు సమయంలో దీని మీద సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ చెల్లించింది. దీనిపై క్రెడిట్ తీసుకునే సమయంలో రెండు సమస్యలు వస్తాయి. మొదటిది.. ఇది ఏ ఒక్క శాఖకు పరిమితమైనది కాదు కాబట్టి ఇన్వాయిస్ ఏదైనా ఒక శాఖ పేరు మీద ఇస్తే మిగతా వాటికి క్రెడిట్ తీసుకునే అర్హత ఉండదు. అలాగే చెల్లించిన పన్ను మహారాష్ట్రకు సంబంధించిన సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కాబట్టి వేరే రాష్ట్రంలో చెల్లుబాటు కాదు. దీనికి సమాధానమే 'ఇన్‌పుట్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ (ఐఎస్‌డీ). ఐఎస్‌డీ అనేది సర్వీసులకు సంబంధించి పొందిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను వివిధ శాఖలకు పంచడానికి ఉపకరిస్తుంది. ఒక వ్యాపార సంస్థ మామూలు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌తో సంబంధం లేకుండా ఐఎస్‌డీ కింద విడిగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. సాధారణంగా హెడ్ ఆఫీస్ పేరుతో రిజిస్ట్రేషన్ తీసుకుంటారు. అయితే ఈ ఐఎస్‌డీ విధానం, దీనికి సంబంధించిన విధి, విధానాలు వ్యాపార వర్గాలకు కొత్తేమీ కాదు. ఈ విధానాన్ని వివిధ వ్యాపార వర్గాలు ఇప్పటికే ఉపయోగించుకుంటుండగా.. ప్రభుత్వం కొత్తగా ఈ విధానంలో కొన్ని మార్పులు చేసింది. ఆ వివరాలు మీ కోసం.

ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం ఐఎస్‌డీ రిజిస్ట్రేషన్ అనేది తప్పనిసరి కాదు. వ్యాపార వర్గాలు తమ సౌలభ్యం ప్రకారం నిర్ణయం తీసుకోవచ్చు. కానీ, కొత్తగా ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం ఏదేనీ కంపెనీకి లేదా సంస్థ ఒకే పాన్ సంఖ్యతో ఒకటికి మించి రిజిస్ట్రేషన్స్ ఉంటే ఆ సంస్థ ఐఎస్‌డీ కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ పొందాలి. జీఎస్‌టీ నియమావళి ప్రకారం ఒక సంస్థ ఎన్ని రాష్ట్రాల్లో ఆఫీస్‌లు, లేదా శాఖలు ఉన్నాయో అన్ని రాష్ట్రాల్లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. ఇలా ఒకే పాన్ సంఖ్యతో రిజిస్ట్రేషన్ పొందిన వాటిని జీఎస్‌టీ పరిభాషలో 'డిస్టింక్ట్ పర్సన్స్' అంటారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్త నిబంధన ప్రకారం ఇలాంటి వ్యాపార సంస్థలు అన్ని కచ్చితంగా ఐఎస్‌డీ కింద రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. అలాగే కామన్‌గా ఉపయోగించే సర్వీసులు అన్ని తప్పనిసరిగా ఐఎస్‌డీ పేరు మీదే పొందాలి. ఇక ఈ ఐఎస్‌డీ, తన పేరు మీద వచ్చిన ఇన్వాయిస్‌లకు సంబంధించిన క్రెడిట్‌ను వివిధ శాఖలకు పంచవలసి ఉంటుంది. దీనికి ఒక పద్ధతి ఉంది. పొందిన సర్వీస్, సంస్థకు సంబంధించిన ఏదైనా ఒక శాఖలో మాత్రమే వాడితే క్రెడిట్ మొత్తం ఆ శాఖకే బదిలీ చేయాలి. అలా కాకుండా ఒకటి కంటే ఎక్కువ శాఖల్లో సర్వీస్‌ను వాడితే గత ఆర్థిక సంవత్సరంలో ఆయా శాఖలు వాటి సంబంధిత రాష్ట్రాల్లో లేదా కేంద్ర పాలిత ప్రాంతంలో జరిపిన టర్నోవర్ మీద ఆధారపడి అదే నిష్పత్తిలో పంచాల్సి ఉంటుంది (గత ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి కార్యకలాపాలు లేకుంటే గడిచిన త్రైమాసికం తీసుకోవాలి). ఇలా పంచే క్రెడిట్.. ఐజీఎస్‌టీ అయితే అన్ని శాఖలకు ఐజీఎస్‌టీ రూపంలోనే పంచాలి. అలాకాకుండా సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ అయితే అదే రాష్ట్రంలోని శాఖలకు సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ రూపంలో పంచాలి. వేరే రాష్ట్రంలోని శాఖలకు ఐజీఎస్‌టీ రూపంలో పంచాలి.

అంటే పైన చెప్పిన కంపెనీ ఉదాహరణగా తీసుకుంటే ఆ సంస్థ ప్రధాన కార్యాలయం ముంబైలో ఉంది కాబట్టి.. ఐఎస్‌డీ రిజిస్ట్రేషన్ కూడా ముంబై ప్రధాన కార్యాలయం మీద తీసుకుని.. కొనుగోలు చేసిన సాఫ్ట్‌వేర్ ఇన్వాయిస్ ఈ అడ్రస్ మీద తీసుకుందని అనుకుందాం. సరఫరాదారుడు కూడా ముంబైకి చెందిన వ్యక్తి అనుకుంటే, కొనుగోలు సమయంలో చెల్లించిన సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ మహారాష్ట్రలోని శాఖకు పంచేటప్పుడు సీజీఎస్‌టీ/ఎస్‌జీఎస్‌టీ రూపంలోనే పంచాలి (ఐఎస్‌డీ, ఆ శాఖ రెండు మహారాష్ట్రలోనే ఉన్నాయి కాబట్టి). మహారాష్ట్ర వెలుపలి శాఖలకు పంచే క్రెడిట్ ఐజీఎస్‌టీ రూపంలో పంచాలి. అలాగే వేరే ఏదేనీ రాష్ట్రంలోని శాఖకు రిజిస్ట్రేషన్ లేకున్నా.. ఆ మేర ఇతర శాఖలకు సర్దుబాటు చేయరాదు. ఇకపోతే ఈ ఐఎస్‌డీ కొంతకాలం తర్వాత సరఫరాదారుని నుంచి క్రెడిట్ నోట్ లేదా డెబిట్ నోట్ పొంది క్రెడిట్ సర్దుబాటు చేయాల్సి వస్తే, ఆయా క్రెడిట్ నోట్, డెబిట్ నోట్స్‌ను కూడా క్రెడిట్‌ను ఏ నిష్పత్తిలో పంచారో అదే నిష్పత్తిలో వివిధ శాఖలకు పంచాల్సి ఉంటుంది.

అయితే పైన నియమ నిబంధనలు ఇప్పటికే అమల్లో ఉండగా.. తప్పనిసరిగా ఐఎస్‌డీ రిజిస్ట్రేషన్ పొందాలనే నిబంధన 2025 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

దశల వారీగా ఫీజు బకాయిలు చెల్లిస్తాం

- పదిహేను నెలల్లో రూ.829 కోట్లు చెల్లించాం
- మరో రూ.1200కోట్లకు టోకెన్ నంబర్లు ఇచ్చాం
- బీఆర్ఎస్ హయాం నాటి బకాయిలే 4341 కోట్లు
- ప్రస్తుతం రూ.5520కోట్లకు పెరిగాయి: మంత్రి సీతక్క
- ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పండి: ఎమ్మెల్యే కూనంనేని
- మేము సకాలంలోనే చెల్లించాం: ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశల వారీగా చెల్లిస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు. గత 15 నెలల్లో రూ.829.12కోట్లను చెల్లించామని వెల్లడించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా శనివారం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబు చెప్పారు. ఇప్పటికే రూ.1200కోట్ల చెల్లింపుల కోసం టోకెన్ నంబర్లు ఇచ్చామని, త్వరలోనే మరిన్ని బకాయిలు చెల్లిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.4,341కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ బకాయిలు రూ.5520.60కోట్లకు పెరిగాయని తెలిపారు. విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దని కాలేజీలను కోరామని, బకాయిలన్నీ దశలవారీగా విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ విషయమై హరీశ్‌రావు మాట్లాడుతూ నోట్ల రద్దు, కరోనా వంటి పరిస్థితులను ఎదుర్కొంటూనే బీఆర్ఎస్ పాలనలో ఫీజు బకాయిలను సకాలంలో చెల్లించామని తెలిపారు. ఏటా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో బకాయిలు చెల్లించేవారమని గుర్తు చేశారు. బకాయిలు చెల్లించకపోతే కాలేజీలు ఆగమైపోతాయని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన నాటికి రూ.1508కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, ఏటా ఫీజులకు రూ.2300కోట్లు అవుతాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. ఇదిలాగే కొనసాగితే కాలేజీలు మూతపడే పరిస్థితి వస్తుందన్నారు. ఫీజు బకాయిలను ఎప్పట్లోగా, ఎన్ని వాయిదాల్లో చెల్లిస్తారో చెప్పాలని సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, చిన్న కాలేజీలకు జీవన్మరణ సమస్యగా మారిందన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- 500 ఎస్‌హెచ్‌జీలకు ఫ్యాక్టరీలను అందిస్తాం: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. తెలంగాణ రైజింగ్‌లో మహిళలకు అవకాశం ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శనివారం శాసనసభలో మహిళా పారిశ్రామికవేత్తలపై జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబు చెప్పారు. సూక్ష్మ పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా, చిన్న పరిశ్రమలను మధ్యతరహా పరిశ్రమలుగా, మధ్య తరహా పరిశ్రమలను భారీ పరిశ్రమల స్థాయికి తీసుకెళతామని చెప్పారు. ట్రిలియన్ డాలర్ ఎకానమీని సాధించాలనేది కష్టతరమైన సాధన, కానీ అది తమ ప్రభుత్వ కల అని పేర్కొన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మినీ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తామని, తొలి విడతలో 20 పార్కులు పెడతామని, రెండు, మూడేళ్లలో వీటి ఏర్పాటు పూర్తవుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో 500 స్వయం సహాయక సంఘా(ఎస్‌హెచ్‌జీ)లకు ప్లాట్ ఆన్ కాంప్లెక్స్ విధానంలో ఫ్యాక్టరీలు కట్టి, వారి చేతికి ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు. ఫ్యాక్స్‌కాన్ ఫ్యాక్టరీలో 18-21 ఏళ్లలోపు అవివాహితులకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలనే నిబంధన ఉందని, దీన్ని సడలించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కోరారు. ఫ్యూచర్ సిటీలోనూ 100 ఎకరాలు మహిళా పారిశ్రామికవేత్తలకు కేటాయించాలన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై త్వరలో నిర్ణయం: దామోదర



హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించేందుకు వాడే హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) టీకాలు అందించే విషయంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలో క్యాన్సర్ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆ రోగులకు చికిత్స అందించేందుకు ఉమ్మడి జిల్లాల్లో రీజినల్ క్యాన్సర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. ఇప్పటికే క్యాన్సర్ మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. శనివారం శాసనసభలో ఆరోగ్య పద్దుపై జరిగిన చర్చలో రాజనర్సింహ మాట్లాడారు. జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి అసంక్రమిత రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. రోగులకు వైద్యం అందించేందుకు ప్రతి జిల్లాలో ఎన్‌సీడీ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సుమారు 50లక్షల మంది రోగులకు ఈ క్లినిక్‌ల ద్వారా వైద్యం అందుతోందని చెప్పారు. ప్రస్తుతం గుండె మార్పిడి వంటి ఖరీదైన చికిత్సలు కూడా ఉచితంగా అందుతున్నాయంటే ఆనాడు ఆరోగ్యశ్రీని తీసుకరావడంలో తమ ప్రభుత్వ ముందు చూపే కారణం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోగుల సంఖ్యకు అనుగుణంగా డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని.. అందులో భాగంగా కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేసినట్లు తెలిపారు. 'రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు కాపాడుకునేలా రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం 15 నిమిషాల వ్యవధిలో రోగులను ట్రామాకేర్ సెంటర్‌కు తరలించి, చికిత్స అందించేలా ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది' అని మంత్రి వివరించారు.

రుణమాఫీ రూ.2 లక్షల వరకే!

- అంతకన్నా ఎక్కువ ఉంటే మాఫీయే లేదు
- 25 లక్షల కుటుంబాలకు రుణమాఫీ పూర్తి
- గత ప్రభుత్వం చేసిన మాఫీ 3500 కోట్లే: తుమ్మల



హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీకి సంబంధించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. రూ.2 లక్షల వరకు రుణం ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ చేస్తామని చెప్పామని, వారందరికీ పూర్తి చేశామని అన్నారు. రూ.2 లక్షలకు పైన రుణం ఉన్న వారికి రుణమాఫీ ఉండదని చెప్పారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ, 'రైతుల అప్పులు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మా ప్రభుత్వం రుణమాఫీ నిర్ణయం తీసుకుంది. రుణమాఫీపై ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రత్యేకంగా చెప్పదలచుకున్నాను. అదేంటంటే.. రూ.2 లక్షల వరకే రుణమాఫీ. దీనికి సంబంధించి 25 లక్షల కుటుంబాల లెక్కలు మా దగ్గరకు చేరాయి. వారికి రూ.20,616 కోట్ల మాఫీ నిధులు జమ చేశాం. రూ.2 లక్షలకుపైన రుణమాఫీ లేదు" అని అన్నారు.

పాత్రికేయులకు కనీస భద్రత లేదు: కూనంనేని

పాత్రికేయులకు కనీస భద్రత లేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు రెండు కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని చెప్పారు. అసంఘటిత కార్మికులుగా ఉన్న పాత్రికేయులకు కనీస భద్రత లేదని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు బీమా ఉన్నా... పంటల బీమా విషయంలో సరైన విధానం లేదని, ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇస్తామని చెప్పిన రూ. 12 వేలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీతక్క జీవన విధానం మారింది

- ఆమె 5ఎకరాల భవనంలో ఉంటున్నారు
- నేను చిన్న 500 గజాల ఇంట్లో ఉంటున్నా
- ఆమె స్థాయి వేరు.. నా స్థాయి వేరు: పాడి
- ప్రభుత్వ క్వార్టర్స్‌పై రాజకీయమా: దుద్దిళ్ల

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్క జీవన విధానం మారిందని, ఆమె ఇప్పుడు ఐదు ఎకరాల విశాల భవనంలో ఉంటున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. సీతక్క మంత్రిగా ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉంటున్నారని, దాన్ని కూడా రాజకీయం చేయడం ఏంటని మంత్రి శ్రీధర్‌బాబు కౌశిక్‌రెడ్డిని ప్రశ్నించారు. ఆయన సీతక్కను అగౌరవపర్చారని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై శనివారం అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. "నేను హుజూరాబాద్‌లో ప్రజాక్షేత్రంలో ఉంటున్నానా.. లేదా.. అని మంత్రి సీతక్క అడుగుతున్నారు. నేను ప్రజల్లోనే ఉంటున్నాను. సీతక్క జీవన విధానమే మారింది. ఆమె ములుగులో తిరుగుతున్నట్లు లేరు. అందుకే ప్రజాక్షేత్రంలో రైతుల సమస్యలు ఆమెకు అర్థం కావడం లేదు. సీతక్క ఇప్పుడు ఐదెకరాల విశాల భవనంలో ఉంటున్నారు. నేను చిన్న, 500గజాల ఇంటిలో ఉంటున్నాను. మీ స్థాయి వేరు. నా స్థాయి వేరు" అని వ్యాఖ్యానించారు. దీనిపై సీతక్క స్పందిస్తూ.. "కౌశిక్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. నేను ఉంటున్న నివాసం ప్రభుత్వం మంత్రులకు కేటాయించిన క్వార్టర్స్. అంతే తప్ప నేను




సొంతంగా నిర్మించుకుంది కాదు. నేనెప్పుడూ ప్రజాక్షేత్రంలోనే ఉంటాను. మీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాళ్లు, గుట్టలున్న 500 ఎకరాల ఆసామికి రైతు బంధు ఇచ్చారు. మీ లైఫ్ స్టైల్ వేరు. నా లైఫ్ స్టైల్ వేరు. నా స్థాయికి ఆ ప్రభుత్వ క్వార్టర్స్ చాలా ఎక్కువ" అని కౌశిక్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు.

పదేళ్లు ఇక్కడే.. ఎక్కడికీ పోం

శాసనసభలో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్య.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రోడ్లే వేయలేదు

- యాగాలు చూడడమే ప్రశాంత్‌రెడ్డి పని
- రోడ్లు, బ్రిడ్జిలు కట్టడం నాపని: కోమటిరెడ్డి
- క్యారెక్టర్ అసాసినేషన్ చేస్తారా: ప్రశాంత్
- సభ నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్
- కోమటిరెడ్డి తప్పుడు సమాధానం ఇచ్చారంటూ స్పీకర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): "మేం అటు ఇటు ఎక్కడికీ పోం. పదేళ్లు ఇక్కడే (అధికారంలో) ఉంటాం. మీ (బీఆర్ఎస్)లాగా ఎక్కువ మాట్లాడం.. పని ఎక్కువ చేస్తాం" అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసెంబ్లీలో అన్నారు. శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి కోమటిరెడ్డి సమాధానమిచ్చే క్రమంలో విమర్శలు, ప్రతివిమర్శలు చోటుచేసుకున్నాయి. కోమటిరెడ్డి మాట్లాడిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం అసెంబ్లీ బయట కూడా వీరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా 'ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో రహదారుల నిర్మాణం' అనే అంశంపై వచ్చిన ప్రశ్నకు మంత్రి కోమటిరెడ్డి సమాధానమిస్తూ.. తాము పీపీపీ విధానంలో కాకుండా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో రోడ్లు వేస్తామన్నారు. ఈ విధానంలో 2016లో జాతీయ హైవేను ప్రారంభించి, ఇప్పటికే 8 రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. అయితే రోడ్ల పనులపై మంత్రి సూటిగా సమాధానం చెప్పాలని, అటు ఇటు పోవద్దని వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దీంతో తాము ఎక్కడికీ పోమని, పదేళ్లు ఇక్కడే ఉంటామని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ఆరేళ్ల క్రితం తాను భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఏ విధంగా ఉందో.. ఈ రోజు కూడా అలాగే




ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క మంచి పని అయినా చేశారేమో చెప్పాలన్నారు.

రోడ్ల మీద ఏమీ రాదని వదిలేశారు..!

"మీ ప్రాధాన్యం కాళేశ్వరం, లిఫ్టులు మాత్రమే. రోడ్ల మీద ఏమీ రాదని.. వాటిని ప్రాధాన్యంలేని జాబితాలో పెట్టారు. ప్రశాంత్‌రెడ్డికేమో సచివాలయం కట్టాలి.. ప్రగతిభవన్, ఫామ్‌హౌస్‌లలో యాగాలు చూసుకోవాలి.. అదే పని. కానీ, నాకు యాగాలు, యజ్ఞాలు లేవు. రోడ్లు వేయాలె.. బ్రిడ్జి కట్టాలె.. ఇవే నా పనులు" అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలను ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. "పదేళ్ల రోడ్లు వేశామా? లేదా? గుంతలు పూడ్చలేదని నా క్యారెక్టర్‌ను అసాసినేట్ చేస్తే ఎలా? సీఆర్ఎఫ్ నిధులు తెచ్చామా? లేదా? ప్రభుత్వ శాఖ నుంచి పత్రాలు తెప్పించుకొని మీరే (స్పీకర్) పరిశీలించండి" అని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొత్తం రోడ్లు, భవనాల శాఖకు చెందిన రోడ్ల పురోగతి మందగించిందన్నారు. గతంలో ప్రారంభించిన రోడ్లు కూడా ఆగిపోయాయని, కాంట్రాక్టర్లు కూడా బిల్లులు రావడం లేదంటున్నారని తెలిపారు. 17 వేల కిలోమీటర్లు రూ.28 వేల కోట్లతో టార్గెట్ పెట్టారని, ఇవన్నీ ఆర్అండ్‌బీ రోడ్లేనా, లేక పంచాయతీ రోడ్లో చెప్పాలని డిమాండ్ చేశారు. తాను యాగాలు చేస్తానని, తనకు భక్తి ఉందని అన్నారు.

హ్యామ్ పేరుతో భారం వేస్తారా?

హ్యామ్ రోడ్లతో పదేళ్లపాటు ఆర్థిక భారం వేస్తారా? రోడ్ల ఎంపిక ఏ విధంగా చేశారు? శాసనసభ్యుల భాగస్వామ్యం ఉందా? అని బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు ప్రశ్నించారు. అయితే, "ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ బ్రిడ్జి కడితే మేం అడ్డం పడుకున్నామా? 57 వేల ఉద్యోగాలు మీరే ఇచ్చామంటున్నారు.. మరి నియామక పత్రాలు ఇవ్వడానికి టైం ఎందుకు దొరకలేదు? బంగారు తెలంగాణ అంటూ మొత్తం నాశనం చేశారు. మామ, అల్లుడు, కొడుక్కి ఆటాక్ చేయడం ఒక్కటే తెలుసు." అంటూ కోమటిరెడ్డి ధ్వజమెత్తారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు.. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం.. రోడ్లు, భవనాల శాఖపై తాము అడిగిన ప్రశ్నకు మంత్రి కోమటిరెడ్డి శాసనసభలో తప్పుడు సమాధానం ఇచ్చారంటూ హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి.. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు వెంకటరెడ్డికి సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. మంత్రి సమాధానం పూర్తిగా అవాస్తవమని పేర్కొంటూ ఆధారాలు సమర్పించారు. శాసనసభలో పచ్చి అబద్ధాలు మాట్లాడినందుకు క్షమాపణ చెప్పాలని ఒక ప్రకటనలో ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. మరోవైపు.. మంత్రి కోమటిరెడ్డి అసెంబ్లీలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. దళితుడిని సీఎంను చేస్తానని లక్షల సార్లు చెప్పి, మాట తప్పిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ రాజకీయాల నుంచి తప్పుకోవాలన్నారు.



అసెంబ్లీ సాక్షిగా రుణమాఫీ కథను ముగించే కుట్ర

- సీఎం రేవంత్ రైతులకు క్షమాపణ చెప్పాలి
- అసెంబ్లీలో హరీశ్‌రావు డిమాండ్



హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం రుణమాఫీ కథను ముగించే కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి మాటలు విని రూ.2 లక్షలకన్నా ఎక్కువున్న రుణాలను రైతులు అప్పులు చేసి వడ్డీతో సహా బ్యాంకులకు చెల్లించారని తెలిపారు. అలాగే రూ.2 లక్షలలోపు రుణాలు తమకెప్పుడు మాఫీ అవుతాయా అని రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. బ్యాంకులు, అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని చెప్పారు. అయితే రూ.2లక్షలపైన ఉన్న రుణాలను మాఫీ చేయబోమంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసెంబ్లీలో చేసిన ప్రకటనతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టయిందన్నారు. రూ.2లక్షలలోపు, రూ.2లక్షల పైన రుణం ఉండి మాఫీ కాని రైతుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి అసంబద్ధ ప్రకటన పట్ల సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు, రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. రైతులను దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని, రేవంత్‌రెడ్డిని ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ నిలదీస్తూనే ఉంటుందని చెప్పారు.

మా కోసం కొట్లాడండి: ఆటో కార్మికులు

'ఆటో కార్మికులను ఆదుకుంటామన్నారు. అధికారంలోకి వస్తే రూ.12 వేల ఆర్థిక సాయం ఇస్తామని నమ్మించారు.. ఇప్పుడు మోసం చేశారు. మాకోసం కాంగ్రెస్ సర్కారుతో కొట్లాడండి' అని హరీశ్‌రావును ఆటో కార్మిక యూనియన్ నాయకులు కోరారు. శనివారం ఆయన నివాసంలో కలిసిన ఆటో కార్మికులు తమ సమస్యలను వివరించారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి బడ్జెట్లో ఆ ఊసెత్తలేదన్నారు. తమ కష్టాల గురించి అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ వారు వినతిపత్రం ఇచ్చారు.

'యువ వికాసం'లో.. దళారుల ప్రమేయం ఉండొద్దు

- ఎక్కడికక్కడ కట్టడి చేయాలి
- పథకానికి నిధుల సమస్య లేదు: భట్టి



హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రాజీవ్ యువ వికాసం' పథకంలో మధ్య దళారుల ప్రమేయం ఉండొద్దని, ఈ విషయంలో అధికారులు ఎక్కడికక్కడ కట్టడి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. యువత జీవితాల్లో మార్పును తీసుకురావడానికి అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. శనివారం ఆయన అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాజీవ్ యువ వికాసం పథకంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 59 వేలకుపైగా ఉద్యోగ నియామక పత్రాలను అందించామని, ఉద్యోగాలు రాని యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ పథకం అమలు విషయంలో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. పథకాన్ని ప్రారంభించడానికి ముందే.. నిధులను సమీకరించుకున్నామని, ఈ దృష్ట్యా నిధుల కొరత అన్న సమస్య ఉత్పన్నం కాదని స్పష్టం చేశారు. బ్యాంకు రుణాలతో కలుపుకొని ప్రభుత్వం రూ.9 వేల కోట్ల వరకు ఈ పథకం కోసం పెట్టుబడి పెడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలను సమన్వయం చేస్తూ.. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి 'రాజీవ్ యువ వికాస్ విజన్'ను ఏర్పాటు చేస్తున్నామని, ఈ మిషన్ బాధ్యతలను సీనియర్ ఐఏఎస్ అధికారికి అప్పగిస్తామని చెప్పారు. శాఖల వారీగా ఈ పథకాన్ని పర్యవేక్షించడానికి ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమించుకోవాలని చెప్పారు. పథకానికి సంబంధించి ఏప్రిల్ 5లోగా దరఖాస్తుల స్వీకరణను పూర్తిచేసి, జూన్ 2 నుంచి 9 వరకు లబ్ధిదారులకు పథకం పత్రాలను అందజేస్తామన్నారు. యూనిట్లు పొందిన యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ కార్యాలయానికి నోటీసులు

- స్వయంగా వెళ్లి నోటీసులిచ్చిన పిటిషనర్ల తరఫు న్యాయవాదులు

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ బీఆర్ఎస్ తరఫున సుప్రీం కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఇటీవలే విచారణ జరిపిన ధర్మాసనం ఈ కేసు విషయంలో స్పీకర్ కార్యాలయం ఈ నెల25లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలకనుగుణంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కళ్యాణ్ రావు, అంబాల హరీష్ శనివారం స్పీకర్ కార్యాలయానికి స్వయంగా వెళ్లి నోటీసులు అందించారు.

తెలంగాణ సంపదపై గుంటనక్కల్లా కన్నేశారు

మంచిగ పాలన చేయాలంటే చంద్రబాబు రావాలట.. వచ్చేసారి ఎన్డీయే కూటమి రావాలంటూ కథనాలు

- ఏపీలో కూటమి లేకుంటే చంద్ర బాబు గెలిచేవాడా?
- నన్ను ఓడించి ఇప్పుడు 'కేసీఆర్ అన్నా' అంటే ఎలా!?
- ఆవేదనతోనే సన్నాసులు, దద్దమ్మలు అన్నా
- ఎవరిపైనా వ్యక్తిగత కోపం లేదు: కేసీఆర్

హైదరాబాద్, మర్కుక్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): "బెల్లం ఉన్నచోటకు ఈగలు వచ్చినట్లు.. తెలంగాణను దోచుకునేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ సంపదపై గుంటనక్కల మాదిరిగా కన్నేసి ఉన్నారు. ఇప్పుడున్న పాలకులు సరిగా చేస్తలేరట. మంచిగా పాలన చేయాలంటే చంద్రబాబు రావాలట. తెలంగాణలో వచ్చేసారి ఎన్డీఏ కూటమి రావాలని కొన్ని పత్రికలు కథనాలు రాస్తున్నాయి. ఏపీలో కూటమి లేకుంటే చంద్రబాబు గెలిచేవాడా!?" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకుందని, పదేళ్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలు ఉన్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో 200 మందితో రామగుండం నుంచి ఎర్రవల్లి వరకు 180 కిలోమీటర్ల మేర 'గోదావరి కన్నీటి గోస' పేరిట పాదయాత్ర చేశారు. ఈ బృందంతో శనివారం ఎర్రవెల్లిలో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని, రాష్ట్రంలో సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. "నోటికొచ్చిన హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఒక్క



ఫాంహౌస్‌లో జరిగిన సమావేశంలో కేసీఆర్‌కు నాగలిని బహూకరిస్తున్న కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నేతలు

హామీ కూడా నెరవేర్చడం లేదు. దీనిపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ సర్కార్ హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చేస్తుంటే 'కేసీఆర్ అన్నా ఎక్కడున్నావ్.. రమ్మం'టూ బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రజలు నన్ను ఓడగొట్టి ఇంట్లో కూర్చోబెడితే ఏం చేయాలి? కత్తి ఒకరికిచ్చి నన్ను యుద్ధం చేయమంటే ఎట్లా సాధ్యమవుతుంది? ఆనాడు అధికారం ఇచ్చింది ప్రజలే. ఇప్పుడు అధికారం కాంగ్రెస్ పార్టీకి ఇచ్చింది కూడా ప్రజలే. సరైన పాలకుడిని ఎన్నుకునేటప్పుడే ప్రజలు ఆలోచించాలి. భవిష్యత్తులో ప్రజలు తీర్పు దిశగా ఆలోచించాలి" అని దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని యువతకు పిలుపునిచ్చారు. తెలంగాణ హక్కుల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ శ్రేణులు పోరాడాలని, అందరూ ఒక్కో కేసీఆర్‌లా తయారు కావాలని అన్నారు.


సన్నాసులు, దద్దమ్మలు అన్నది అందుకే

ఇన్నాళ్లూ లేని నీటి గోస ఇప్పుడెందుకు వచ్చిందని మాజీ సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. తెలంగాణకు నీళ్లివ్వాలనే ప్రాధాన్యాన్ని కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేయడం వల్లే రాష్ట్రంలో సాగు, తాగునీటి సమస్య నెలకొందన్నారు. "ఉమ్మడి రాష్ట్ర పాలకులు మొదటి నుంచీ ఈ ప్రాంత నీటి సమస్యను ఆర్థిక సమస్యగా చూసే అవలక్షణంగా మార్చుకున్నారు. అందుకే తెలంగాణలో సాగునీటి వనరులను కల్పించలేదు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ప్రతిఘటించలేని నాటి నాయకత్వం ఎంతో నష్టం చేసింది. ఆ ఆవేదనతో, వాళ్ల తెలివితక్కువతనం చూసి, ఉద్యమకాలంలో వాళ్లను దద్దమ్మలు, సన్నాసులు అని తిట్టాను. అంతే తప్ప, ఎవరిపైనా నాకు వ్యక్తిగత కోపం లేదు" అని వ్యాఖ్యానించారు. తెలంగాణకు సాగు, తాగునీరు ఎంతో అవసరమని, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుకు వెనకాడకుండా ప్రజలకు నీళ్లు అందించాల్సిందేనని డిమాండ్ చేశారు. తెలంగాణకు ప్రధాన శత్రువు కాంగ్రెస్సేనంటూ సాయుధ పోరాట కాలం నుంచి నేటిదాకా పలు సందర్భాల్లో కాంగ్రెస్ చేసిన మోసాలను వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకి 8 మంది, కాంగ్రెస్‌కు 8 మంది ఎంపీలను ఇచ్చారని, వాళ్లు ఒక్క ఏకానైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. అదే పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలుంటే రాష్ట్ర హక్కులను కాపాడుకునేవారని అన్నారు. ఈ నేలపై ఎవరూ శాశ్వతం కాదని, కేసీఆర్ ఎప్పటికీ ఉండడని, అందరూ ఒక్కొక్క కేసీఆర్‌లా తయారు కావాలని పిలుపునిచ్చారు.

ఇండియా బాగుంటేనే అమెరికా బాగుంటుంది

- పరస్పర ప్రయోజనకరంగానే సుంకాలు
- భారతీయ ప్రతిభను మేం వదులుకోం
- భారత కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టాలి
- ట్రంప్ సలహాదారు బర్న్స్ వ్యాఖ్యలు
- హైదరాబాద్‌లో యుఎస్ జీసీఐ ఇండియా చాప్టర్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇండియా బాగుంటేనే అమెరికా బాగుంటుందని, అదే రీతిలో అమెరికా బాగుంటేనే ఇండియా కూడా బాగుంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సలహాదారు మార్క్ బర్న్స్ చెప్పారు. పరస్పర సహకారంతోనే 2దేశాలూ మహోన్నతంగా ఎదుగుతాయన్నారు. యునైటెడ్ స్టేట్స్ గ్లోబల్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (యుఎస్ జీసీఐ) హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2025లో ఆయన పాల్గొన్నారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో యుఎస్ జీసీఐ ఇండియా చాప్టర్‌ను బర్న్స్ ప్రారంభించారు. ఇండియా సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో 54% అమెరికాకే వస్తున్నాయన్నారు. 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం జరగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇంధన రంగంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నామన్నారు. స్టార్‌లింక్ లాంటి సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నాయని చెప్పారు. జెఎస్‌డబ్ల్యు స్టీల్ లాంటి సంస్థలు యుఎస్‌లో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ఇటీవలే 3 భారతీయ కంపెనీలు యుఎస్‌లో పెట్టుబడులు పెట్టి 3 వేలకు పైగా ఉద్యోగాలను సృష్టించాయని బర్న్స్ తెలిపారు. మరిన్ని భారత కంపెనీలు అమెరికాలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సుంకాల సమస్య పరిష్కారానికి ఇండియా చురుకైన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు చెబుతూ ఈ సంవత్సరం పరస్పర అంగీకారయోగ్యమైన ఒప్పందం జరుగనుందన్నారు. అమెరికాకున్న నిపుణుల కొరతను భారతీయ విద్యార్థులు తీరుస్తున్నారని, భారతీయ ప్రతిభను అమెరికా వదులుకోబోదన్నారు.



ట్రంప్ సలహాదారు డాక్టర్ మార్క్ బర్న్స్

యుఎస్‌లో వాడుతున్న జెనరిక్ ఔషధాలలో 47% భారత్‌వే

అపోలో మెడ్‌స్కిల్స్ సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ రావు పులిజల మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ రంగం ఇప్పుడు మూడు బీల కారణంగా మారుతుందన్నారు. అవి బయాలజీ, బైట్స్, బ్యాండ్ విడ్త్ అని చెప్పిన ఆయన యుఎస్‌లో డాక్టర్లు చేస్తోన్న ప్రతి పది ప్రిస్క్రిప్షన్‌లలో కనీసం 4 భారతీయ ఔషధాలే ఉంటున్నాయన్నారు. అలాగే యుఎస్‌లో వాడుతున్న జెనరిక్ ఔషధాలలో 47% భారతీయ ఫార్మా సంస్థలు రూపొందించినవే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏంజెల్ ఇన్వెస్టర్ జెఏ చౌదరి, యుఎస్ జీసీఐ ఇండియా వ్యవస్థాపకులు డాక్టర్ సోలోమన్ గట్టు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో జతకట్టినా బీఆర్ఎస్ అధికారంలోకి రాదు

- కేసీఆర్.. పగటి కలలు మానుకో: టీపీసీసీ చీఫ్ మహేశ్
- బీఆర్ఎస్ ఎప్పటికీ అధికారంలోకి రాదు: మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని, కేసీఆర్.. పగటి కలలు మానుకుంటే మంచిదని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సింగిల్‌గా కాదు.. ఆ పార్టీ బీజేపీతో జతకట్టినా అధికారం మళ్లీ కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సింగిల్‌గానే అధికారంలోకి రానున్నామంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌గౌడ్ స్పందించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రైజింగ్ తెలంగాణ నినాదంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తోందన్నారు. గత పదేళ్లతో పోలిస్తే తెలంగాణ ఇప్పుడు ప్రగతి పథంలో సాగుతోందన్నారు. ఫాంహౌస్ నుంచి బయటికొచ్చిన ప్రతిసారీ ప్రగల్భాలు పలకడం కేసీఆర్‌కు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీకి కేసీఆర్ దాసోహం కావడం వల్లే కేంద్రం నుంచి తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నిధులు దక్కలేదన్నారు. "మీరు ఫామ్ హౌస్‌లో ఉంటూ.. ఎప్పటికీ అవే కలలు కనండి. మీ కార్యకర్తలనూ ఊహాలోకాల్లోనే ఉంచండి. మీకు అర్థం కాని విషయం ఏంటంటే.. ఇక మీరు ఎప్పటికీ అధికారంలోకి రారు" అని కేసీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ కలలు కంటూ ఫామ్‌హౌస్‌లో ఉంటే.. తాము ప్రజల్లో ఉంటూ మంచి పాలన అందిస్తున్నామన్నారు.

సంజయ్.. చిల్లర మాటలు మానుకో: చామల

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బండి సంజయ్.. చిల్లర మాటలు మానుకోవాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు. .. ఆయన కార్పొరేటర్ కాదు.. కేంద్ర మంత్రి అనే సంగతి తరచు గుర్తు చేస్తుండాలని అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు సీఎం స్టాలిన్ నేతృత్వంలో జరిగిన భేటీని దొంగల ముఠా సమావేశంగా సంజయ్ పేర్కొనడంపై కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల కోసం తాము ప్రధాని మోదీని కలిసినట్లుగానే, నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే హరీశ్‌రావు కలిశారని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సమావేశం నిర్వహించిన స్టాలిన్‌ను పొగుడుతున్న కేటీఆర్.. భట్టి విక్రమార్క, జానారెడ్డి ఆధ్వర్యంలో ఇదే అంశంపైన జరిగిన సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు.

రూ.100 కోట్లతో 'సాగర్'కు సొబగులు !

- పర్యాటక అభివృద్ధికి హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్
- ప్రపంచ స్థాయి ఏజెన్సీ కోసం గ్లోబల్ టెండర్లు

హైదరాబాద్ సిటీ, మార్చి22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర నడిబొడ్డున ఉన్న హుస్సేన్‌సాగర్ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి పర్చేందుకు హెచ్ఎండీఏ సిద్ధమైంది. రూ.100 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)లో అంతర్జాతీయ స్థాయి ఏజెన్సీ కోసం ఇప్పటికే గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. హుస్సేన్‌సాగర్ అభివృద్ధికి సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి ల్యాండ్ మార్క్, ఆర్కిటెక్చర్, రవాణా మార్గాలు, వాణిజ్య, నివాస అభివృద్ధి, పర్యాటక అభివృద్ధి మొదలైన ప్రదేశాలను గుర్తించనుంది. వీధుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ చర్యలు, రవాణ-ఆధారిత అభివృద్ధి, వినోద అంశాలు, పర్యాటక సౌకర్యాలు, స్మార్ట్ స్ట్రీట్ లైటింగ్ నిఘా, భద్రత, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ల్యాండ్‌స్కేప్ డిజైన్ తదితరాలను చేపట్టనుంది. నీటి పైపులు, మురుగునీటి లైన్లు, వర్షపునీటి డ్రెయిన్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తారు. హుస్సేన్‌సాగర్ చుట్టూరా రద్దీని తగ్గించడానికి ప్రత్యామ్నాయ కారిడార్లు, రోడ్లు, వంతెనలు, ప్రజా రవాణా మార్గాలు, నడక మార్గాలు, సైకిల్ ట్రాక్‌లు తదితర ఈ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపర్చనున్నారు. వివరణాత్మకంగా ఆర్కిటెక్చరల్ డిజైన్లను రూపొందించనున్నారు.

సరస్వతీ బ్యారేజీలో ఇసుక నిల్వలపై లైడార్ సర్వే ప్రారంభం

భూపాలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సరస్వతీ (అన్నారం) బ్యారేజీ నుంచి సుందిళ్ల వరకు గోదావరి నదిలో ఇసుక నిల్వల పరిమాణంపై శనివారం డ్రోన్ లైడార్ సర్వే నిర్వహించారు. గోదావరి, మానేరు నదుల్లో రెండేళ్లుగా దాదాపు రూ.2.54 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక పేరుకుపోయినట్లుగతంలో ప్రాథమికంగా నిర్ధారించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పూర్తి స్థాయి సర్వే చేయించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మను ఆదేశించింది. దాంతో ఆ సర్వే నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో మానేరు నదికి సంబంధించి న్యాయపరమైన సమస్యలు ఉన్నాయంటూ అభ్యంతరాలు వ్యక్తం కావడంతో కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో సమావేశమైన రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా గోదావరి నదిలో థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా సర్వే జరిపించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే మానేరు నదికి సంబంధించి సర్వే నిర్వహిస్తారా? లేదా? అనే దానిపై స్పష్టత రాలేదు.

ఐఐటీ జామ్ 2025 టాపర్స్ జాబితా విడుదల

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ జామ్ 2025 టాపర్స్ జాబితాను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-ఢిల్లీ విడుదల చేసింది. ఆల్ ఇండియా టాప్ 10 జాబితాను jam2025.iitd.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ప్రతిష్ఠాత్మకమైన సంస్థల్లో పీజీ కోర్సులకు ఉద్దేశించిన 'ద జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్'ను ఈ ఏడాది ఫిబ్రవరి 2న నిర్వహించారు. బయాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మేథమెటిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు ఈ ప్రవేశ పరీక్ష జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐఎస్సీ, ఎన్ఐటీ, సీఎఫ్‌టీఐల్లోని 2,000 సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు.

గ్రామీణ డాక్ సేవక్ తొలి విడత ఫలితాల వెల్లడి

దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో 21,413 గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగాల భర్తీకి తొలి విడత మెరిట్ లిస్ట్‌ను ఇండియా పోస్ట్ ప్రకటించింది. తెలుగురాష్ట్రాలతో సహా దేశంలోని 22 రాష్ట్రాలకు సంబంధించిన ఈ మెరిట్ లిస్ట్‌ను indiapostgdsonline.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో 1,215, తెలంగాణలో 519 ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం వెల్లడించినది సిస్టమ్ జనరేటెడ్ షార్ట్ లిస్ట్. పదో తరగతిలో సాధించిన మార్కుల వివరాలను అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చేసిన అప్‌లోడ్ ఆధారంగా ఈ షార్ట్ లిస్ట్ జనరేట్ అయింది. ఖాళీలున్న డివిజన్ హెడ్ ఆఫీసులో అభ్యర్థుల డాక్యుమెంట్లను వ్యక్తిగతంగా పరిశీలించిన తర్వాత తుది జాబితాను తయారు చేస్తారు.

రావి శ్రీనివాస్‌కు టీపీసీసీ షోకాజ్ నోటీసు

ఆసిఫాబాద్ జిల్లా నేత రావి శ్రీనివాస్‌కు టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ శనివారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రిని విమర్శించడం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, ఇటీవల నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రచారం వంటి చర్యల నేపథ్యంలో నోటీసు జారీ చేసినట్టు డీఏసీ చైర్మన్ చిన్నారెడ్డి పేర్కొన్నారు. వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

రేపటి నుంచి తెలంగాణ సిఫారసు లేఖలపై శ్రీవారి దర్శనం

- ఏపీ ప్రజాప్రతినిధులకు సోమవారం బ్రేక్ కట్

తిరుమల, మార్చి 22(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలకు శ్రీవారి దర్శనం సోమవారం నుంచి అమలు కానుంది. అయితే, 25న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 30న ఉగాది రోజుల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినందున, 24, 29 తేదీల్లో మాత్రం సిఫారసు లేఖలు స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై సోమ, మంగళవారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు.. బుధ, గురువారాల్లో 300 ప్రత్యేకదర్శనాలు కల్పిస్తారు. ఈ క్రమంలో ఏపీ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఇకపై సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉండవు. దీనికి బదులుగా ఆదివారం అనుమతిస్తారు.

రాజకీయ గళం కోల్పోతాం

ఉత్తరాది ముందు ద్వితీయ శ్రేణి పౌరులుగా మారతాం.. పునర్విభజనపై జేఏసీ భేటీలో సీఎం రేవంత్

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): "జనాభా దామాషా ప్రాతిపదికన పునర్విభజనను దక్షిణాది వ్యతిరేకిస్తోంది. బీజేపీ ప్రతిపాదిస్తున్న ఈ పద్ధతిలో పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల్లోని మనం రాజకీయ గళం కోల్పోతాం. ఉత్తరాది మనల్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించి వేస్తుంది. అప్పుడు ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయి" అని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మనం దీనికి అంగీకరించకూడదని, దీనికి వ్యతిరేకంగా దక్షిణాది ప్రజలు, పార్టీలు, నేతలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన శనివారం చెన్నైలో ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పునర్విభజనపై అందరినీ ఏకతాటిపైకి తెచ్చిన స్టాలిన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రధాని మోదీ మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయి విధానాన్ని పాటించాలి. మరో 25ఏళ్లపాటు లోక్‌సభ సీట్లలో ఎలాంటి మార్పు తీసుకురావద్దు. సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా పునర్విభజన చేపట్టాలి. సీట్లు పెంచవద్దు. ఉన్న సీట్లతోనే పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. 1976లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇలానే చేసింది. లేకపోతే, రాష్ట్రాల మధ్య రాజకీయ అసమతౌల్యాలు వచ్చేవి. 2001లో వాజ్‌పేయి సర్కారూ దానినే పాటించింది. ఇప్పుడు ప్రధాని మోదీ కూడా అలాగే చేయగలరా?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇలా పునర్విభజనకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకోవాలని, రాష్ట్రాల్లోని జనాభా ఆధారంగా చేపట్టాలని, నగరాలు, గ్రామాల జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల హద్దులను మార్చు చేయాలని సూచించారు. 'ప్రొ రేటా' విధానం కూడా దక్షిణాదికి నష్టమే కలిగిస్తుందని, రాజకీయ అంతరాలను పెంచుతుందని వివరించారు. ప్రొ రేటా విధానంలో సీట్ల మధ్య తేడా కేంద్ర ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుందని, ఒక్క సీటు కూడా కీలకంగా మారుతుందని, ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మన దేశంలో ఉందని గుర్తు చేశారు. అందుకే, ప్రొ రేటా విధానం కూడా దక్షిణాది రాజకీయ ప్రయోజనాలకు భంగం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ నిర్మాణంలో 50 ఏళ్లపాటు అందించిన సేవలకు దక్షిణాదిని అభినందించాలని, మనకు కొంత వెనక్కి చెల్లించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణాదికి అవకాశమివ్వాలని అన్నారు.



జేఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తమిళనాడు సీఎం స్టాలిన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

లోక్‌సభలో 33 శాతం సీట్లు ఇవ్వండి

"లోక్‌సభలో ప్రస్తుతం 543 సీట్లున్నాయి. వీటిలో దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 130 మాత్రమే. ఇది మొత్తం సీట్లలో 24 శాతమే. పునర్విభజన తర్వాత ఏర్పడే నూతన లోక్‌సభలో మాకు 33 శాతం సీట్లు ఇవ్వాలనేది దక్షిణాది రాష్ట్రాల డిమాండ్. పునర్విభజనతో 50 శాతం సీట్లను పెంచాలని బీజేపీ భావిస్తే.. 272 సీట్లు పెరుగుతాయి. అప్పుడు మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్య 815 అవుతుంది. ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు 33 శాతం.. అంటే 272 సీట్లు ఇవ్వాలి. వీటిని దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలకు ప్రోరేటా ప్రాతిపదికన పంచవచ్చు. మిగిలిన సీట్లను ఉత్తరాది, ఇతర రాష్ట్రాలకు కేంద్రం తన అభిమతం మేరకు పంచవచ్చు" అని సీఎం రేవంత్ ప్రతిపాదించారు. అనుకున్న దానికంటే దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్య తగ్గిస్తే అది దేశ రాజకీయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ సీట్ల సంఖ్యను పెంచాలని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు.

ఎక్కువ నిధులిస్తూ.. తక్కువ పొందాలా?

"దేశ ఖజానాకు మనం పెద్ద మొత్తంలో నిధులిస్తూ తక్కువ మొత్తాన్ని పొందుతున్నాం. పన్నుల రూపంలో కేంద్రానికి తమిళనాడు రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తోంది. అదే.. యూపీకి రూపాయికి రూ.2.73; మధ్యప్రదేశ్‌కు రూ.1.73; బిహార్‌కు రూ.6.06 వెనక్కి వస్తున్నాయి. కర్ణాటకకు కేవలం 14 పైసలు, తెలంగాణకు 41పైసలు, కేరళకు 62 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి" అని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులను క్రమంగా తగ్గిస్తోందని తప్పుబట్టారు. జనాభాను నియంత్రించాలని 1971లో కేంద్రం నిర్ణయించినప్పటి నుంచీ దక్షిణాది రాష్ట్రాలు అమలు చేశాయని, ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. దక్షిణాదిని రాజకీయంగా కుదించే ఈ పునర్విభజనను అంగీకరించలేమని, అసమగ్ర పునర్విభజన ప్రక్రియ చేపట్టకుండా బీజేపీని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. దీనిపై దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

తదుపరి భేటీ హైదరాబాద్‌లో..

పునర్విభజన ప్రక్రియపై తమ రాష్ట్ర శాసన సభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తామని, తమ తరహాలోనే మిగిలిన రాష్ట్రాల్లోనూ తీర్మానం చేయాలని సహచర ముఖ్యమంత్రులు, ఇతర నేతలకు రేవంత్ విజ్ఞప్తి చేశారు. పునర్విభజనపై తదుపరి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తానని, పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడంపై అప్పుడు చర్చిద్దామని ప్రతిపాదించారు. ఈ పోరాటంలో ప్రజలను భాగస్వాములను చేసేందుకు భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తానని, దక్షిణాదిలోని ప్రతి ఒక్కరూ హక్కుల రక్షణకు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ఉత్తరాదిని గౌరవిస్తాం.. దక్షిణాది హక్కుల విషయంలో రాజీ పడం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల హక్కుల విషయంలో రాజీ పడబోమని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. డీలిమిటేషన్‌పై చెన్నైలో జరిగిన సమావేశానికి హాజరైన సీఎం దీనిపై ఎక్స్ వేదికగా స్పందించారు. "ఈ పుణ్యభూమి అంబేడ్కర్ మహనీయుడు రాసిన రాజ్యాంగం వల్ల సమాఖ్య స్ఫూర్తిని, సామాజిక న్యాయాన్ని, సమాన హక్కులను పొందింది. రాజ్య విస్తరణ కాంక్ష, రాజకీయ ప్రయోజన ఆకాంక్షతో డీలిమిటేషన్‌ను అస్త్రంగా ప్రయోగించి వీటిని విచ్ఛిన్నం చేస్తామంటే మౌనంగా ఉండలేం. ఉత్తరాదిని గౌరవిస్తాం.. దక్షిణాది హక్కుల విషయంలో రాజీ పడం" అని స్పష్టం చేశారు. ఈ ధర్మ పోరాటానికి చెన్నై శ్రీకారం చుట్టిందని, న్యాయం జరిగే వరకు, ధర్మం గెలిచే వరకు హైదరాబాద్ ఆకారం ఇస్తుందని పేర్కొన్నారు.

బీజేపీ మాటల్ని నమ్మలేం

- అసెంబ్లీ సీట్లు పెంచాలని చట్టంలో ఉన్నా అమలు చేయలేదు
- రేవంత్ నిర్వహించే భేటీకి కేసీఆర్‌ను పిలుస్తారో లేదో తెలియదు: కేటీఆర్
- కేసీఆర్‌ను ఆహ్వానించటంపై పార్టీలో చర్చించి చెబుతా: సీఎం రేవంత్‌రెడ్డి

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పునర్విభజనతో దక్షిణాదికి నష్టం జరగదని బీజేపీ చెబుతున్నప్పటికీ.. ఆ పార్టీని నమ్మలేమని.. అసెంబ్లీ సీట్ల పెంపే దీనికి ఉదాహరణ అని కేటీఆర్ చెప్పారు. ఏపీ పునర్విభజన చట్టం నిర్దేశించిన ప్రకారం తెలంగాణ, ఏపీ అసెంబ్లీల్లో సీట్ల సంఖ్యను పెంచుతామని బీజేపీ ప్రకటించిందని, కానీ, ఇప్పటికీ ఆ పని చేయలేదని, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాల్లో మాత్రం అసెంబ్లీ సీట్లు పెంచుకున్నారని వివరించారు. బీజేపీ మాటలపై నమ్మకం లేనందునే పునర్విభజనతో జరిగే నష్టంపై అందరం కలిసి సమావేశమై చర్చించామని కేటీఆర్ వివరించారు. చెన్నై సమావేశం నేపథ్యంలో 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. జనాభా ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించతలపెట్టిన సమావేశం హైదరాబాద్‌లో ఉంటుందో లేదో, కేసీఆర్‌ను పిలుస్తారో లేదో తనకు తెలియదన్నారు. చెన్నై సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పాల్గొనటంపై బీజేపీ నేతలు చేసిన విమర్శల మీద స్పందిస్తూ.. 'ఒక ప్రాంతంపై జరుగుతున్న వివక్షను తెలియజేస్తే దోపిడీ, కుట్రలు అంటున్నారు. ఇందులో దోపిడీ, కుట్రలు ఎక్కడున్నాయి' అని కేటీఆర్ ప్రశ్నించారు.

పార్టీలో చర్చించి చెబుతా: రేవంత్

నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో తాము నిర్వహించే సమావేశానికి కేసీఆర్‌ను ఆహ్వానించటంపై పార్టీలో చర్చించి చెబుతానని సీఎం రేవంత్ తెలిపారు. 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి సహకరించే దిశగా తమకు మద్దతిచ్చేవారందరినీ ఈ సమావేశానికి ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు.

టీడీపీ, జనసేన దూరం

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజనపై చెన్నైలో డీఎంకే పార్టీ నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి టీడీపీ, జనసేన హాజరు కాలేదు. ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను తమిళనాడు మంత్రి ఆహ్వానించారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షంగా ఉన్నందున ఆ సమావేశానికి హాజరుకాలేమని అప్పుడే పల్లా స్పష్టం చేశారు. తనకు అందిన ఆహ్వానంపై జనసేన స్పందిస్తూ... వేర్వేరు కూటముల్లో ఉన్నందున హాజరుకాలేమని పేర్కొంది.




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతి ప్రదానం చేస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

ఇంతకీ ఆ పెట్టెలో ఏముంది?

- స్టాలిన్ ఇచ్చిన గిఫ్ట్‌పై సర్వత్రా చర్చ

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ శనివారం చెన్నైలో జరిగిన సమావేశానికి హాజరైన నేతలకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ శాలువా కప్పి, ఓ బాక్స్‌ను బహూకరించారు. దీనిని టీవీ చానళ్లలో ప్రత్యక్ష ప్రసారంలో చూసిన వారంతా ఆ పెట్టెలో ఏముందంటూ ఆసక్తిగా చర్చించుకున్నారు. అయితే, తమిళ సంప్రదాయం, సంస్కృతిని తెలిపే అమూల్యమైన వస్తువులు బాక్స్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అందులో పత్తు మడై పాయ్ (పత్తుమడై చాప), ఊటీలో తోడర్ కులస్థులు ధరించే శాలువా, కాంచీపురం చేనేత పట్టుచీర, ఊటీ వర్కీ, కన్యాకుమారి జిల్లా కోవిల్‌పట్టికి చెందిన శెనగ మిఠాయి, ఈరోడ్ పసుపు, కొడైకెనాల్ వెల్లుల్లి ఉన్నట్లు సమాచారం. ఈ వస్తువులన్నీ అంతర్జాతీయ గుర్తింపు కలిగినవి. అందుకే వాటిని బహూకరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

నిధుల్లోనూ నష్టపోతాం



పార్లమెంటు సీట్ల పునర్విభజనతో దక్షిణాదికి అన్ని రకాలుగా నష్టం

- ఆర్థిక నియంతృత్వం వచ్చే ప్రమాదం
- దేశంకోసం జనాభాను నియంత్రించాం..
- జీడీపీకి 36 శాతం వాటా అందిస్తున్నాం
- అయినా మనల్ని శిక్షిస్తున్నారు..
- డీలిమిటేషన్ అంటే పుండు మీద కారమే
- దేశాన్ని వెనుకబాటుకు గురి చేస్తున్న రాష్ట్రాలకు రివార్డు ఇస్తామంటారా?
- దీన్ని నిలదీయాల్సిందే: కేటీఆర్

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గటం మాత్రమే కాదు.. ఆర్థికపరమైన అంశాల పరంగా, నిధుల కేటాయింపుల్లో కూడా తీవ్రమైన నష్టం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపుల్లో కూడా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దేశ జీడీపీకి 36 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు శిక్షింపబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ చెన్నైలో జరిగిన జేఏసీ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రప్రభుత్వ వివక్ష కొత్తేమీ కాదని, ఇటీవల ఈ వివక్ష, అన్యాయం మరింత పెరిగాయని తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రారంభించిన బుల్లెట్ రైలు వంటి ప్రాజెక్టులన్నీ ఉత్తరాదికే పరిమితమవ్వడం ఇందుకు ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. వివక్షను పెంచేలా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ అంశాన్ని ముందుకు తీసుకువస్తోందన్నారు. ఇప్పటికే అన్యాయానికి గురైన దక్షిణాది రాష్ట్రాలకు ఇది పుండు మీద కారం రుద్దటమేనన్నారు.



సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం

'దేశంలో ఏ రాష్ట్రమూ మరో రాష్ట్రం మీద ఆధిపత్యం చెలాయించే పరిస్థితి ఉండకూడదు. అదే నిసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఇది కేవలం ఉత్తర దక్షిణ రాష్ట్రాల వ్యవహారం కాదు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు నష్టం చేకూర్చే అంశం. కేవలం జనాభా ఆధారంగా సీట్లు పెరిగితే సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. మనమంతా భారతీయులం. అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉంది. విభిన్న భాషలు, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశమే భారతదేశం అన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు' అని కేటీఆర్ తెలిపారు. వెనుకబడిన రాష్ట్రాలకు కేంద్రం నిధులిచ్చే అంశాన్ని తాము వ్యతిరేకించడం లేదని, నిధుల కేటాయింపులో వివక్షను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

నష్టంపై మాట్లాడకుంటే చరిత్ర క్షమించదు

దేశాభివృద్ధి కోసం దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను పాటించాయని కేటీఆర్ గుర్తు చేశారు. ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం జనాభా నియంత్రణలో విఫలమయ్యాయని, అటువంటప్పుడు ఇప్పుడు డీలిమిటేషన్‌లో ఆ రాష్ట్రాలకు లబ్ధి చేకూర్చటం ఏ విధంగా సరైందని ప్రశ్నించారు. దేశాన్ని వెనుకబాటుకు గురి చేసిన వారికి రివార్డు ఇవ్వడం లాంటిదే ఇదని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి, భారత్ సూపర్‌పవర్ కావాలంటే.. అభివృద్ధి సాధించిన రాష్ట్రాలను ప్రోత్సహించాలిగానీ శిక్షించటం కాదని హితవు పలికారు. పరిపాలనలో, ఆర్థికాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికే ఆదర్శంగా ఉన్నప్పటికీ, తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మాట్లాడకుంటే చరిత్ర మనల్ని క్షమించదన్నారు.

మందబలం ఆధారంగా ప్రజాస్వామ్యం నడవొద్దు

భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని, అటువంటి దేశంలో ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదని కేటీఆర్ పేర్కొన్నారు. మందబలం నియంతృత్వానికి దారి తీస్తుందన్నారు. మెజారిటీ, మందబలం ఎటువంటి నియంతృత్వాన్ని సృష్టిస్తాయో.. 14 ఏళ్ల స్వరాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో తెలంగాణ ప్రజలు కళ్లారా చూశారన్నారు. ఢిల్లీలో వున్న మందబలంతో పాటు నాటి సమైక్య రాష్ట్రంలోని మెజారిటీ నాయకత్వంపైనా.. కేసీఆర్ నాయకత్వంలో అలుపెరుగని పోరాటం చేసి తెలంగాణ ప్రజలు తమ చిరకాల స్వప్నమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు. తమిళనాడు ప్రజల నుంచి అనేక అంశాలను స్ఫూర్తిగా తీసుకుంటామని, అస్తిత్వం కోసం, హక్కుల కోసం కొట్లాడటంలో తమిళనాడు తమకు స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. తమ హక్కులు సాధించుకోవడానికి దేశంలోని రాష్ట్రాలకు.. తమిళనాడు ద్రవిడ ఉద్యమం ఒక దిక్సూచిలా పని చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు.

బీజేపీపై విషం కక్కడమే వారి అజెండా

కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్‌లవి విభజన రాజకీయాలు

డీ లిమిటేషన్‌పై కేంద్రం ఏదీ తేల్చకముందే కుట్రలు: కిషన్‌రెడ్డి

స్టాలిన్ నిర్వహించింది దొంగల ముఠా భేటీ: బండి సంజయ్

హైదరాబాద్/చిక్కడపల్లి/కరీంనగర్ రూరల్/న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది, దక్షిణాది అంటూ కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్‌లు విభజన రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. డీ లిమిటేషన్ పేరుతో చెన్నైలో బీజేపీని వ్యతిరేకించే కాంగ్రెస్, బీఆర్ఎస్, డీఎంకే, కమ్యూనిస్టులు సమావేశమవ్వడం చూస్తుంటే 'ఆలు లేదు చూలు లేదు.. అల్లుడి పేరు సోమలింగం' అన్నట్లుగా ఉందని విమర్శించారు. 'అసలు నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి విధివిధానాలు ఖరారు కాలేదు. నియమ నిబంధనలు రూపొందించనేలేదు. కేంద్రం ఏది తేల్చకముందే.. దక్షిణాదికి అన్యాయం జరుగుతుందంటూ పార్టీలు ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేయడం దిగజారుడుతనానికి నిదర్శనం. పైకి డీ లిమిటేషన్‌పై భేటీ అని చెప్తున్నప్పటికీ, వాస్తవానికి వారి అజెండా బీజేపీపై విషం కక్కడమే. కేంద్రం డీ లిమిటేషన్ చేపట్టదలిచితే దక్షిణాది రాష్ట్రాల పట్ల ఎలాంటి వివక్ష చూపదు. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా కృషి చేస్తుంది' అని స్పష్టం చేశారు. 'తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో హామీల అమలు వైఫల్యాలతో కాంగ్రెస్, తమిళనాడులో అవినీతి కుటుంబ పాలనతో డీఎంకే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయి. ఇటు బీఆర్ఎస్ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ గెలవలేకపోయింది. ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించి, భావోద్వేగాలు రెచ్చగొట్టేందుకు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన తెచ్చేందుకు కుట్రలు పన్నుతున్నాయి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దేశంలో బీజేపీ విస్తరిస్తుంటే, కాంగ్రెస్ కుంచించుకుపోతోంది. నేడు కేవలం 3 రాష్ట్రాల్లోనే అధికారానికి పరిమితమైంది. దిక్కుతోచని స్థితిలో.. తమిళనాడు సీఎం స్టాలిన్‌ను ముందు పెట్టి ఉత్తర-దక్షిణ భారతదేశం మధ్య విభజన తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది. డీ లిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందంటూ కృత్రిమవాదాన్ని స్టాలిన్ సృష్టించారు. దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పక్షాలు తందానా అంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని మరోసారి నిరూపితమైంది' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.




దోచుకున్నది.. దాచుకోవడానికే భేటీ: సంజయ్

డీ లిమిటేషన్ పేరుతో చెన్నైలో స్టాలిన్ అధ్యక్షతన నిర్వహించింది దొంగల ముఠా సమావేశమని.. అది దోచుకున్నది దాచుకోవడానికి, అవినీతి స్కాముల నుంచి బయటపడడానికేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కరీంనగర్ జిల్లా చామనపల్లిలో మాట్లాడుతూ.. డీ లిమిటేషన్ పేరుతో చెన్నైలో సమావేశమైన పార్టీల వారంతా లిక్కర్ దందాలో దొరికినోళ్లేనని.. స్టాలిన్ ప్రభుత్వం వెయ్యి కోట్ల లిక్కర్ స్కామ్‌కు పాల్పడిందన్నారు. పదేళ్ల పాలనలో చేసిన అవినీతి స్కాముల నుంచి తప్పించుకునేందుకు బీఆర్ఎస్ కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తోందని విమర్శించారు. ఇండియా కూటమిలో స్టాలిన్ భాగస్వామి కాబట్టే చెన్నై భేటీకి సీఎం రేవంత్ వెళ్లారని.. అంతేకానీ ఆయనకు ఆ భేటీపై ఏ ఆసక్తి లేదని బీజేపీ ఎంపీ అర్వింద్ ఢిల్లీలో అన్నారు.

వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్

» ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి సాహితీ వేత్త



న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక హిందీ సాహిత్యంలో చెరగని స్థానం సంపాదించుకున్న సుప్రసిద్ధ హిందీ సాహితీవేత్త, కవి వినోద్ కుమార్ శుక్లా (88) కు దేశంలోనే అత్యున్నత సాహితీ గౌరవంగా భావించే 2024-జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో నివాసం ఉన్న వినోద్ కుమార్ శుక్లా అనేక నవలలు, కథలు, కవితలు రాశారు. 'దీవార్ మే ఏక్ ఖిడ్కీ థీ' అనే నవల రాసినందుకు ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ప్రముఖ ఒడియా రచయిత్రి ప్రతిభా రే అధ్యక్షతన శనివారం సమావేశమైన జ్యూరీ వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ పురస్కారం ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ పురస్కారాన్ని అందుకున్న హిందీ రచయితల్లో వినోద్ కుమార్ శుక్లా 12వ వారు కాగా, ఛత్తీస్‌గఢ్ నుంచి జ్ఞానపీఠ్ అవార్డు అందుకోనున్న తొలి రచయిత. ఈ ఏడాది జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతను ఎంపిక చేసేందుకు ఏర్పాటైన జ్యూరీలో ప్రతిభా రేతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, ప్రముఖ రచయితలు ప్రభావర్మ, దామోదర్ మోజో, అనామిక, ప్రఫుల్ షిలేదార్, జానకీ ప్రసాద్ వర్మలతో పాటు ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి-కవి ఏ కృష్ణారావు కూడా ఉన్నారు.

బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో ఐపీఎస్‌ల ప్రొటోకాల్‌కు బ్రేక్

బెంగళూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బెంగళూరు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఐపీఎస్ అధికారుల ప్రొటోకాల్ సేవలకు బ్రేక్ పడింది. సినీ నటి రన్యారావ్ తన తండ్రి, డీజీపీ రామచంద్రరావు పేరుతో వీఐపీ ప్రొటోకాల్‌ను ఉపయోగించుకోవడం వివాదాస్పదమైంది. ఈ కారణంగా ఐపీఎస్ అధికారులకు ఎయిర్‌పోర్ట్‌లో కొనసాగుతున్న ప్రొటోకాల్ సేవలను నిలిపివేసినట్టు నగర పోలీస్ కమిషనర్ దయానంద్ శనివారం మీడియాకు తెలిపారు. రన్యారావ్ కేసులో డీజీపీ రామచంద్రరావును సీనియర్ ఐఏఎస్ అధికారి గౌరవ్ గుప్త విచారించారు.

కొడుకుని గొంతుకోసి చంపిన కిరాతక తండ్రి

» పుణేలో ఘటన..నిందితుడు ఏపీలోని విశాఖ వాసి

పుణే, మార్చి 22: భార్యతో తరచూ గొడవల కారణంగా మూడున్నరేళ్ల కుమారుడిని దారుణంగా హత్య చేశాడో కిరాతక తండ్రి. కత్తితో గొంతు కోసి చంపేశాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణేలో జరిగింది. పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడిని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన తికేటి మాధవ సాధురావుగా గుర్తించామని ఇన్‌స్పెక్టర్ సీమా ధకనే తెలిపారు. 38 ఏళ్ల అతను ఐఐటీ బెంగళూరులో ఎంటెక్ చేశాడని, ఇంటి విషయాలపై మాధవ తన భార్య స్వరూపతో తరచూ గొడవ పడేవాడని పేర్కొన్నారు. రెండు నెలల క్రితం మాధవ ఉద్యోగం పోయింది. బీటెక్ చేసిన స్వరూప.. ఇంట్లోనే గృహిణిగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఉద్యోగం పోయినప్పటి నుంచి వీరిద్దరు తమ సేవింగ్స్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం మాధవ తన కుమారుడు హిమ్మత్‌ను ఇంటి నుంచి బైక్‌పై బయటకు తీసుకెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి వరకు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని భార్య పోలీసులకు మిస్సింగ్ ఫిర్యాదు చేసింది. మాధవ సెల్‌ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేయగా.. వాడ్గావ్ షెరి ఏరియాలో ఐలా స్టే అనే లాడ్జిలో లొకేషన్ చూపించింది. అక్కడ ఒక రూమ్‌లో ఉన్న మాధవ.. తలుపు తీయకపోవడంతో పోలీసులు బద్దలు కొట్టారు. ఆ సమయంలో అతను మద్యం మత్తులో పడి ఉండటాన్ని గుర్తించారు. అయితే అతని వద్ద కుమారుడు లేకపోవడంతో.. పోలీసులు అనుమానంతో స్టేషన్‌కు తీసుకొచ్చి ప్రశ్నించారు. తన కుమారుడిని గొంతు కోసి హత్య చేసినట్లు మాధవ ఒప్పుకున్నాడు. పోలీసులు బాలుడి మృతదేహాన్ని ఫారెస్ట్ పార్కు సమీపంలోని పొదల్లో గుర్తించారు.

357 బెట్టింగ్ వెబ్‌సైట్లు బ్లాక్

న్యూఢిల్లీ, మార్చి 22 : ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్స్ సర్వీసెస్ ట్యాక్స్ ఇంటెలిజెన్స్(డీజీజీఐ) విభాగం కొరడా ఝుళిపించింది. జీఎస్టీ రిజిస్ట్రేషన్, చెల్లింపుల్లో అవకతవకలకు, నిబంధనల అతిక్రమణకు పాల్పడిన సంస్థలకు చెందిన 357 వెబ్‌సైట్లను ఇప్పటిదాకా బ్లాక్ చేసింది. భారతదేశంలో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, గ్యాంబలింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న మరో 700 ఆఫ్‌షోర్ సంస్థలపై నిఘా పెట్టింది. అనధికార ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై ఇటీవల తీసుకున్న చర్యల్లో భాగంగా 2000 బ్యాంకు ఖాతాలు, రూ.4కోట్ల నగదును డీజీజీఐ అటాచ్ చేసింది. అలాగే, ఆఫ్‌షోర్ గేమింగ్ వెబ్‌సైట్లలో నగదు లావాదేవీలకు వినియోగిస్తున్న యూపీఐ ఐడీలకు అనుసంధానమైన 392 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన డీజీజీఐ రూ.122.05 కోట్లను అటాచ్ చేసింది. కాగా, విదేశాల్లో ఉంటూ నకిలీ బ్యాంకు ఖాతాల ద్వారా భారతీయుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న సద్గురు, మహాఖాల్, అబీ247 తదితర ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు చెందిన ముగ్గురిని డీజీజీఐ ఇటీవల అరెస్టు కూడా చేసింది.

హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ హతం

జెరూసలెం, మార్చి 22: హమాస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. గురువారం జరిపిన దాడిలో దక్షిణ గాజాలో హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ శుక్రవారం ప్రకటించింది. హమాస్ మిలిటరీ ఇంటెలిజెన్స్‌తోపాటు హమాస్ నిఘా, టార్గెటింగ్ యూనిట్‌లకు అధిపతిగా ఉన్న ఒసామా తబాష్‌ను అంతమొందించినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఎక్స్‌లో పోస్ట్ చేసింది. హమాస్ పోరాట వ్యూహాన్ని రూపొందించే బాధ్యతను ఆయన చూసుకునే వాడని, దక్షిణ గాజాలో హమాస్ మిలిటరీ విభాగం ఇంటెలిజెన్స్‌ను సమన్వయం చేయడంతోపాటు ఆ ప్రాంతంలో వారి కార్యకలాపాలకు నాయకత్వం వహించే వాడని ఐడీఎఫ్ పేర్కొంది. అక్టోబరు 7 దాడికి సంబంధించిన ప్రణాళికలో తబాష్ కీలక పాత్ర పోషించినట్టు తెలిపింది.

ఆదిత్య పేరు చెప్పొద్దని ఉద్ధవ్ ఫోన్ చేశారు

» సుశాంత్ మేనేజర్ దిశ మృతి ఘటనపై బీజేపీ నేత రాణె

ముంబై, మార్చి 22: బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, ఆయన మేనేజర్ దిశా సాలియన్‌ల మరణాల సంఘటనల్లో తాజాగా మరో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతుచిక్కని కారణాలతో 2020 జూన్ 8న దిశ మృతి చెందగా, అది జరిగిన ఆరు రోజులకే జూన్ 14న సుశాంత్ మరణించారు. దిశ మరణంపై శనివారం బీజేపీ సీనియర్ నేత నారాయణ రాణె తీవ్రమైన ఆరోపణ చేశారు. ఆ కేసులో తన కుమారుడు ఆదిత్య ఠాక్రే పేరును మీడియా వద్ద వెల్లడించవద్దంటూ మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే తనకు ఫోన్ చేసి చెప్పారని ఆరోపించారు. నాడు జరిగిన ఫోన్ సంభాషణను ఆయన వివరించారు. తాను ఎవరి పేరునూ మీడియాకు చెప్పలేదని, ఒక మంత్రి ప్రమేయం ఉందని మాత్రమే అన్నానంటూ ఉద్ధవ్‌కు సమాధానం ఇచ్చానని రాణె తెలిపారు. ఆ సమయంలో ఆదిత్య ఠాక్రే మంత్రిగా ఉండడం గమనార్హం. మరోవైపు తన కుమార్తె మరణంపై మరోసారి దర్యాప్తు చేయించాలని, ఆదిత్య ఠాక్రేపై కేసు నమోదు చేయాలని కోరుతూ దిశ తండ్రి సతీష్ బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. తన కుమార్తెపై దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేశారని ఆరోపించారు.

సుశాంత్ ఆత్మహత్య కేసు మూసివేత?

ముంబై, మార్చి 22: ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసును సీబీఐ మూసివేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. శనివారం క్లోజర్ రిపోర్టును సమర్పించిందని వెల్లడించాయి. ఆయన ముంబయిలోని బాంద్రాలో ఉన్న అపార్టుమెంటులో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై పలు రకాల అనుమానాలు రావడంతో నాలుగేళ్ల క్రితం సీబీఐ దర్యాప్తును చేపట్టింది. సుశాంత్ మరణానికి గర్ల్ ఫ్రెండ్, నటి రియా చక్రవర్తి కారణమంటూ ఆయన తండ్రి చేసిన ఆరోపణపై ఓ కేసు నమోదు చేసింది. అయితే, ఆత్మహత్య చేసుకునేలా సుశాంత్‌ను ఎవరైనా ప్రేరేపించారనేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని సీబీఐ గతంలోనే వెల్లడించింది.

జస్టిస్ వర్మపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

జరిగినప్పుడు అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ వీడియోను చిత్రీకరించినట్లు సమాచారం. ఆ తర్వాత ఆ క్లిప్పింగ్‌ను ఉన్నతాధికారులకు పంపగా.. వారు సీజేఐకి చేరవేశారు. ఆ క్లిప్పింగ్ ఆధారంగానే వర్మ బదిలీ, అంతర్గత విచారణకు కొలీజియం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

అలా ప్రకటించలేదు: ఫైర్స్ డీజీ

జస్టిస్ వర్మ ఇంట్లో ఎలాంటి నోట్లకట్టలు లభించలేదని తాను ప్రకటన చేసినట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చాయని, అవి అసత్యమని ఢిల్లీ అగ్నిమాపక విభాగం డైరెక్టర్ జనరల్ అతుల్ గర్గ్ స్పష్టంచేశారు. తాను అలా చెప్పలేదని వివరించారు. అయితే.. అగ్నిప్రమాదం సమయంలో గన్నీ బ్యాగుల్లో నగదు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ గన్నీ బ్యాగుల్లో కోర్టు డాక్యుమెంట్లు, పాత ఫైల్స్ ఉన్నట్లు జస్టిస్ వర్మ కుటుంబం తెలిపిందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే అమిత్ గర్గ్ వర్మ ఇంట్లో ఎలాంటి నగదు లేదని, 'స్టేషనరీ' మాత్రం దగ్ధమైందని శుక్రవారం తెలిపినట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి.

సింభోలీ షుగర్ మిల్స్ కేసులో వర్మ

2018లోనే ఓ ఆర్థిక వ్యవహారంలో వర్మ నిందితుడిగా ఉండగా.. గత ఏడాది ఆ కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘాజియాబాద్‌లో ఉన్న సింభోలీ షుగర్ మిల్స్(ఎస్ఎస్ఎం)కు వర్మ 2012 వరకు నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించేవారు. పరికరాలు, పనిముట్లు అందించే ఉద్దేశంతో చెరుకు రైతులకు నగదు పంపిణీ చేస్తామని పేర్కొంటూ ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ వద్ద ఎస్ఎస్ఎం రూ.97.85 కోట్ల రుణం తీసుకుంది. ఆ మొత్తాన్ని రైతులకు ఇవ్వకుండా.. ఇతర ఖాతాలకు బదిలీ చేసింది. రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో.. 2012లోనే ఈ ఎస్ఎస్ఎం బ్యాంకు ఖాతాను నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్(ఎన్‌పీఏ) ఆర్‌బీఐ ప్రకటించింది. దీనిపై 2018లో సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ కేసులో వర్మను పదో నిందితుడిగా సీబీఐ పేర్కొంది. ఆ తర్వాత దర్యాప్తు మందకొడిగా సాగి.. కేసు మూతపడింది. 2024 ఫిబ్రవరిలో ఆ కేసును తిరిగి దర్యాప్తు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆ ఆదేశాలను కొట్టివేసింది. దీంతో.. సీబీఐ దర్యాప్తు నిలిచిపోయింది.



జస్టిస్ యశ్వంత్ వర్మ, జస్టిస్ శీల్‌నాగు, జస్టిస్ అనుశివరామన్, జస్టిస్ సంధావాలియా

ఇదీ.. వర్మ నేపథ్యం..

ప్రయాగ్‌రాజ్‌లో 1969 జన్మించిన యశ్వంత్ వర్మ మధ్యప్రదేశ్‌లోని లా యూనివర్సిటీ నుంచి 1992లో న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. అదే సంవత్సరం అలహాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 2012-13లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి ప్రధాన స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 2014లో అదనపు న్యాయమూర్తిగా నియమితులై.. 2016లో అలహాబాద్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేశారు. 2021 అక్టోబరు 11 నుంచి ఢిల్లీ హైకోర్టులో పనిచేస్తున్నారు. కాగా.. శుక్రవారం నుంచి వర్మ సెలవులో ఉన్నారని సమాచారం. ప్రస్తుతం ఆయన ఢిల్లీ హైకోర్టులో సేల్స్ ట్యాక్స్, జీఎస్టీ, కంపెనీ అప్పీళ్లు వంటి కేసులను విచారించే అత్యంత కీలక ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్నారు.



జూలై 3 నుంచి తానా మహాసభలు

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు ప్రత్యేక ఆహ్వానం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) 24వ మహాసభలు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు జరగనున్నాయి. అమెరికాలోని మిచిగాన్(నోవై)లో జరిగే ఈ మహాసభలకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) వేమూరి రాధాకృష్ణకు ఆహ్వానం అందింది. తానా కాన్ఫరెన్స్ చైర్మన్ నాదెళ్ల గంగాధర్, మాజీ అధ్యక్షులు జయరామ్ కోమటి, డైరెక్టర్ సునీల్ పాంత్ర, చందు గొర్రెపాటి, శశి దొప్పాలపూడి బృందం వేమూరి రాధాకృష్ణను శనివారం స్వయంగా కలిసి మహాసభలకు ఆహ్వానించింది. అమెరికా, తెలుగు రాష్ట్రాల్లో తానా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను తానా ప్రతినిధులు వేమూరి రాధాకృష్ణకు ఈ సందర్భంగా వివరించారు. 3 రోజుల పాటు జరిగే మహాసభల్లో భాగంగా బిజినెస్ సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. తెలుగు కళాకారులు, రచయితలు, వ్యాపారవేత్తలు వివిధ రంగాలకు చెందిన 10వేల మంది ప్రముఖులు ఈ మహాసభల్లో పాల్గొంటారన్నారు.

అమెరికాలో 5.32లక్షల మంది తాత్కాలిక వలస వీసాల రద్దు

» నెలరోజుల్లో దేశం నుంచి బహిష్కరణ



వాషింగ్టన్, మార్చి 22: అమెరికా వలస విధానాన్ని సమూలంగా మార్చేసిన అధ్యక్షుడు ట్రంప్.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తాత్కాలిక వలస వీసాపై అమెరికాలో ఉన్న 5,32,000 మందిపై కొరడా ఝుళిపించారు. వీరి తాత్కాలిక వలసదారుల హోదాను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో క్యూబా, హైతీ, నికరాగ్వాన్, వెనిజులా దేశాలకు చెందిన పౌరులు ఉన్నారు. వీరందరికీ చట్టపరమైన భద్రతను తొలగిస్తున్నట్టు హోంల్యాండ్ సెక్యూరిటీ పేర్కొంది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్టు తెలిపింది. మరోవైపు, మాజీ అధ్యక్షుడు బైడెన్, మాజీ ఉపాధ్యక్షురాలు కమల, మాజీ విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సహా పలువురికి సెక్యూరిటీ క్లియరెన్స్‌ను ట్రంప్ రద్దు చేశారు. ఆయా నేతలకు ప్రభుత్వం అందిస్తున్న ఎస్కార్ట్, ఇతర సదుపాయాలను కూడా రద్దు చేయాలని పలు విభాగాలను ఆదేశించారు. దీంతో ఆయా నేతలకు రోజువారీ బ్రీఫింగ్ ఇకపై ఉండదు. అలాగే, గత ప్రభుత్వంలో నియమితులైన ఇంటెలిజెన్స్ అధికారులు సైతం ఎవరికీ సమాచారాన్ని చేరవేయరాదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్న ట్రంప్.. "దేశ ప్రయోజనాల రీత్యా వారికి ఇకపై ఇలాంటి సమాచారం ఇవ్వడం సరికాదు" అని తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

అల్లరిమూకల నుంచే ఆస్తినష్టం వసూలు

» చెల్లించకపోతే వారి ఆస్తులు జప్తు చేసి వేలం వేస్తాం

» నాగ్‌పూర్ హింసపై మహారాష్ట్ర సీఎం ఫడణవీస్

నాగ్‌పూర్, మార్చి 22: నాగ్‌పూర్ హింసాకాండలో ధ్వంసమైన ఆస్తుల విలువను అల్లర్లకు కారణమైన వారి నుంచే రికవరీ చేస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. డబ్బు చెల్లించడంలో విఫలమైనవారి ఆస్తులు జప్తు చేసి, వేలం వేస్తామని స్పష్టం చేశారు. అవసరమైన చోట్ల బుల్‌డోజర్లను కూడా ఉపయోగిస్తామని హెచ్చరించారు. శనివారం ఆయన నాగ్‌పూర్‌లో మీడియాతో మాట్లాడారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, వీడియోల ఆధారంగా 104 మంది ఆందోళనకారులను గుర్తించామని, 12మంది మైనర్లతో సహా 92 మందిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు తెలిపారు. అల్లర్లలో పాల్గొన్నవారితో పాటు అందుకు సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు వ్యాప్తి చేసేవారిని కూడా సహ నిందితులుగా పరిగణిస్తామని చెప్పారు. ఇప్పటి వరకూ సోషల్ మీడియా నుంచి 68 పోస్టులు తొలగించామని అన్నారు. ప్రధాని మోదీ పర్యటనపై ఈ అల్లర్ల ప్రభావం ఉండబోదన్నారు. అల్లర్లలో విదేశీ హస్తం కానీ, బంగ్లాదేశీ లింకులు గానీ బయటపడలేదని, దర్యాప్తు కొనసాగుతున్నందున దీనిపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని పేర్కొన్నారు.

6% పట్టణ కుటుంబాలకే రక్షిత కుళాయి నీరు

» లోకల్ సర్కిల్స్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 22: దేశంలోని పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఆందోళనకర అంశంగా మారింది. కేవలం 6% ఇళ్లకు మాత్రమే మున్సిపాలిటీల నుంచి తాగడానికి నాణ్యమైన కుళాయి నీరు అందుతోందని తాజా సర్వే వెల్లడించింది. 62% కుటుంబాలు సురక్షితమైన తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫయర్స్, ఆర్వో సిస్టమ్స్ వంటి ఆధునిక నీటి శుద్ధి (ఫిల్టరేషన్) విధానాలపై ఆధారపడుతున్నాయని పేర్కొంది. శనివారం 'వరల్డ్ వాటర్ డే' సందర్భంగా లోకల్ సర్కిల్స్ అనే సంస్థ తన సర్వే వివరాలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 302 జిల్లాల్లో 30 వేలకు పైగా కుటుంబాలపై సర్వే చేశారు. తమ ఇళ్లకు పైపుల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై ప్రశ్నించగా.. కేవలం 30% కుటుంబాలు మాత్రమే 'మంచి'గా ఉన్నాయని పేర్కొన్నాయి. అసలు తమకు కుళాయి నీరు సరఫరానే లేదని 12 శాతం మంది చెప్పారు.

సీట్లు తగ్గుతాయని మోదీయే చెప్పారు

» పునర్విభజనతో వంద సీట్లు తగ్గుతాయని తెలంగాణలో అన్నారు

» తమిళనాడు సీఎం స్టాలిన్ స్పష్టీకరణ

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలను బట్టి పునర్విభజనతో లోక్‌సభ సీట్లు తగ్గటం ఖాయమనే విషయం తేటతెల్లమవుతోందని తమిళనాడు సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. "పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లు తగ్గవని ఇటీవల కోయంబత్తూరు వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. కానీ, 2023లో తెలంగాణ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. కులాల వారీ జనగణన జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు 100 సీట్లను కోల్పోతాయని, ఇందుకు దక్షిణాది రాష్ట్రాల ప్రజలు సమ్మతిస్తారా? అంటూ నాడు ఆయన ప్రశ్నించారు" అని గుర్తు చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు తాము వ్యతిరేకం కాదని, అయితే, ఆ ప్రక్రియ సర్వజనామోదంగా, న్యాయసమ్మతంగా ఉండాలని డిమాండ్ చేశారు. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించేలా ఈ ప్రక్రియ ఉండకూడదన్నదే తమ అభిమతమని పునరుద్ఘాటించారు. సమావేశ ప్రారంభంలో స్టాలిన్ మాట్లాడుతూ.. "ఒక రాష్ట్రానికి చెందిన అధికార పార్టీ ఆహ్వానాన్ని అంగీకరించి ఇంతమంది రాజకీయ పార్టీల నేతలు సమావేశానికి విచ్చేయడం ఆనందంగా ఉంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే అందరం సమావేశమైనట్లు భారత జాతికి ఎలుగెత్తి చాటుతున్నాం. ఈ సమావేశం చారిత్రక ఘట్టంగా నిలుస్తుంది" అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను (543) యథాతథంగా ఉంచి పునర్విభజన జరిపితే తమిళనాడులో ఎనిమిది ఎంపీ సీట్లు తగ్గుతాయని, ఒకవేళ ఎంపీల సంఖ్యను (ఎనిమిది వందలకుపైగా) పెంచినా 12 ఎంపీ సీట్లను కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. పునర్విభజనకు అనుకూలంగా ప్రజలను చైతన్యవంతం చేయడంలో, కేంద్రాన్ని ఒప్పించడంలో జేఏసీ పాత్ర కీలకమని తెలిపారు. పునర్విభజన ముప్పు రాష్ట్రాల నెత్తిపై కత్తిలా వేలాడుతోందని కేరళ సీఎం విజయన్ అన్నారు. అనంతరం, జేఏసీ సమావేశ వివరాలను డీఎంకే ఎంపీ కనిమొళి మీడియాకు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధులు రావాల్సి ఉన్నా, అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరూ రాలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. వైసీపీ నుండి ప్రతినిధులెవరూ రాకపోయినా, ఈ సమస్యపై ఆ పార్టీ నేత ప్రధానికి లేఖ రాశారని వివరించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ త్వరలో స్టాలిన్‌ను కలుస్తారని ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.



డీలిమిటేషన్‌పై చెన్నైలో నిర్వహించిన జేఏసీ సమావేశానికి హాజరైన సీఎంలు విజయన్, భగవంత్ మాన్, స్టాలిన్, రేవంత్

పాతికేళ్లు వాయిదా వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఏకగ్రీవంగా ఆమోదించింది. పునర్విభజనకు వ్యతిరేకంగా కేంద్రంపై గొంతెత్తిన స్టాలిన్‌కు ఏడు రాష్ట్రాల నుంచి గట్టి మద్దతు లభించింది. ఆయన ప్రారంభించిన పోరాటంలో 'మేము సైతం...' అంటూ దక్షిణాదిలోని బీజేపీయేతర పార్టీలకు చెందిన పలువురు సీఎంలు, ప్రముఖులు; పంజాబ్ ముఖ్యమంత్రి భాగమయ్యారు. చెన్నైలో శనివారం ఉదయం అధికార డీఎంకే ఆధ్వర్యంలో జరిగిన తొలి ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశంలో ఎంపీ స్థానాల సంఖ్యను ఏమాత్రం తగ్గించడానికి వీల్లేదని నేతలు డిమాండ్ చేశారు. ఈ పోరాటంలో స్టాలిన్ వెంట ఉంటామని పలువురు నేతలు స్పష్టం చేశారు. పునర్విభజనను వ్యతిరేకిస్తున్న పార్టీలకు చెందిన ఎంపీలతో కోర్ కమిటీని ఏర్పాటు చేసుకుని, పార్లమెంటులో సమన్వయం, స్పష్టమైన వ్యూహంతో పని చేయాలని నిర్ణయించారు. సమావేశంలో కేరళ, తెలంగాణ, పంజాబ్ సీఎంలు విజయన్ (సీపీఎం), రేవంత్ రెడ్డి (కాంగ్రెస్), భగవంత్ మాన్ (ఆప్), కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్ (కాంగ్రెస్), బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ నేతలు వినోద్‌కుమార్, సురేశ్ రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, ఒడిసా మాజీ మంత్రి సంజయ్‌కుమార్ దాస్ బుర్మా(బీజేడీ), శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సర్దార్ బల్వీందర్ సింగ్, దల్జిత్‌సింగ్ సీమా, సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం, కాంగ్రెస్ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాకరన్, ముస్లిం లీగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎంఏ సలామ్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడు ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్, మజ్లిస్ ప్రతినిధి ఇంతియాజ్ జలీల్, కేరళ కాంగ్రెస్ (మణి) ప్రతినిధి జోస్ కె.మణి, కేరళ కొట్టాయం కాంగ్రెస్ ఎంపీ జార్జి కె.ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు. బీజేడీ అధినేత, ఒడిసా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ వీడియో సందేశం పంపించారు. జేఏసీ తదుపరి సమావేశం హైదరాబాద్‌లో జరగనుంది.

పందుల్లా కంటున్నారు..

» ఉత్తరాది ప్రజలపై డీఎంకే మంత్రి అన్బరసన్ దూషణ

» వీడియో ప్రదర్శించిన అన్నామలై.. నిరసన



డీఎంకే మంత్రి వ్యాఖ్యలపై అన్నామలై నిరసన ప్రదర్శన

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఆధ్వర్యంలో డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశం జరుగుతున్న నేపథ్యంలోనే తమిళనాడు బీజేపీ శాఖ అధ్యక్షుడు అన్నామలై శనివారం సామాజిక మాధ్యమాల్లో వెలువరించిన ఓ వీడియో కలకలం రేపింది. ఓ సభలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి అన్బరసన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు దక్షిణాది రాష్ట్రాల ప్రజలంతా కుటుంబ నియంత్రణ పాటించి జనాభాను తగ్గిస్తే.. ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు పందుల్లా పిల్లల్ని కని జనాభాను పెంచేశారంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఆ వీడియోలో ఉన్నాయి. ఇంకా ఆ మంత్రి మాట్లాడుతూ.. హిందీ నేర్చుకున్న ఉత్తరాది యువకులంతా తన ఇంట పశువులు మేపుకుంటున్నారని, పానీ పూరీలు అమ్ముకుంటున్నారని, తమిళులు హిందీని నేర్చుకుని ఉంటే వారిలాగే ఉత్తర భారత దేశానికి వెళ్లి పానీ పూరీలు అమ్ముకునే దుర్గతి పట్టేదని వ్యాఖ్యానించారు. దీనిపై అన్నామలై స్పందిస్తూ.. మంత్రి హోదాలోని వ్యక్తి ఉత్తరాదివారిని కించపరిచేలా మాట్లాడడం గర్హనీయమని పేర్కొన్నారు. కాగా, జేఏసీ భేటీకి వ్యతిరేకంగా తమిళనాడు అంతటా బీజేపీ నేతలు నిరసనలు తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ గవర్నర్ తమిళిసై తదితరులు నల్ల దుస్తులు ధరించి పలు చోట్ల నిరసనలు చేపట్టారు. పాలనాపరమైన అవినీతి కారణంగా ప్రజల నుంచి చవి చూస్తున్న వ్యతిరేకతను కప్పిపెట్టుకోవడం కోసం కొందరు సీఎంలు జేఏసీ భేటీకి వచ్చారని తమిళిసై విమర్శించారు. కాగా, పునర్విభజనను వ్యతిరేకిస్తున్నవారు... నిజంగానే సమస్య ఉందని భావిస్తున్నారా లేక రాజకీయ ఏజెండాతో వెళుతున్నారా అని ఆర్ఎస్ఎస్ ప్రశ్నించింది. పునర్విభజన ప్రక్రియను కేంద్రం ఇంకా అసలు మొదలే పెట్టలేదని, అలాంటప్పుడు చర్చలేమిటని ఆర్ఎస్ఎస్ జాతీయ సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ ప్రశ్నించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.